


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 172

గురువారం 7-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫైనల్లో విదర్భ

రంజీ ట్రోఫీ క్రికెట్ సెమీస్‌లో మధ్యప్రదేశ్‌పై విజయం - 12లో



ఎగువ మధ్య ఆదాయ దేశం

భారత్ 2031 నాటికి చేరుకుంటుందని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక - 13లో



ఆచూకీ చెప్తే రూ.10 లక్షలు

రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడి సమాచారమిస్తే రూ.10 లక్షలు ఇస్తామని ఎన్ఐఏ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



సీబీఐ కస్టడీకి షాజహాన్ షేక్

సందేశ్‌ఖాలీలో ఈడీ అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ మాజీ నేత షాజహాన్‌ను సీబీఐ కస్టడీలోకి తీసుకుంది.


వివరాలు 6లో ▸



ఎర్రసముద్రంలో హౌతీ దాడులు

ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలను లక్ష్యంగా చేసుకున్న హౌతీ తిరుగుబాటుదారులు తమ దాడులను ఉధృతం చేశారు.

వివరాలు 6లో ▸



ప్రైమరీల్లో ట్రంప్, బైడెన్ జోరు

అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వాల కోసం పోటీ పడుతున్న బైడెన్, ట్రంప్ సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల్లో జయకేతనం ఎగురవేశారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్



క్రీడలపై రామోజీ క్రీనీడ

- టీడీపీ హయాంలో అవినీతికి అడ్డాగా క్రీడారంగం
- గాండీవం, టిన్విక్ ప్రాజెక్ట్‌ల పేరుతో రూ.కోట్ల దోపిడీ
- కేవలం కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం
- పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆర్థిక సాయం అరకొరే
- జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు మహర్దశ
- వైఎస్సార్ నగదు పురస్కారాలతో ఆర్థిక సాయం పెంపు
- క్రీడాకారులకు దాదాపు రూ.20 కోట్లకు పైగా నగదు సాయం

13 లో

• ఇది దేవుడి స్క్రిప్ట్

నాన్న మొదలుపెడితే.. నేను పూర్తి చేశా

ప్రాజెక్టును పూర్తి చేసే అవకాశం.. నిజంగా నా అదృష్టం

వెలిగొండను జాతికి అంకితం చేసిన సీఎం వైఎస్ జగన్

వాయువేగంతో జంట సొరంగాలు పూర్తి

- పూర్తయిన టన్నెళ్లను స్వయంగా పరిశీలించి పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం
- ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు.. 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీరు కూడా..
- రూ.1,200 కోట్లతో ఎల్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్
- ఆగస్టు నుంచి ప్రాజెక్టు ద్వారా నీళ్లు
- రూ.53 కోట్లతో రెండు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన
- గిద్దలూరు నియోజకవర్గంలో 13,500 ఎకరాలకు సాగునీరు

2 లో

“ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే ఆయన కుమారుడిగా ఒక్కొక్కటి దాదాపు 18 కి.మీ. పైగా ఉన్న రెండు టన్నెళ్లను పూర్తి చేసి జాతికి అంకితం చేయడం నిజంగా దేవుడు రాసిన స్క్రిప్టే అనేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏముంది? వెలిగొండ మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13న మన ప్రభుత్వమే పూర్తి చేయగా రెండో సొరంగం పనులను కొద్ది రోజుల క్రితమే పూర్తి చేసి ఇవాళ జాతికి అంకితం చేస్తున్నాం. దశాబ్దాల స్వప్నాన్ని నెరవేరుస్తూ ఆ టన్నెల్‌లో ప్రయాణించే అదృష్టాన్ని కల్పించిన దేవుడికి సదా రుణపడి ఉంటా.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్ లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాగును బాగుచేశాం

- వ్యవసాయంలో కొత్త ఒరవడి తీసుకొచ్చాం: ముఖ్యమంత్రి జగన్
- తొలిసారిగా రైతన్నపై పైసా భారం పడకుండా పంటల బీమా అమలు
- 11.59 లక్షల మంది రైతులకు రూ.1,294.58 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

2 లో



నేడు వైఎస్సార్ చేయూత

నిధుల విడుదల

- అనకాపల్లి జిల్లా పిసినికాడలో 4వ విడత నిధులను బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- 26,98,931 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల ఖాతాల్లో రూ.18,750 చొప్పున జమ
- నేటి నుంచి 14 రోజులపాటు పంపిణీ ఉత్సవాలు.. ఇప్పటికే 3 విడతలుగా రూ.56,250 చొప్పున అందజేత

14 లో

చెప్పాడంటే చేస్తాడంతే..

- ప్రతి ఇంటికి ఐదేళ్లలో చేసిన మేలును వివరిస్తూ సీఎం జగన్ సందేశంతో లేఖలు
- మీ ఇంటికి మంచి జరిగితే మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విన్నపం
- రేపట్నుంచి మూడు రోజులు ఇంటింటికీ వలంటీర్ల ద్వారా పంపిణీ

సాక్షి, అమరావతి: సుపరిపాలనతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పారదర్శకంగా మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో చేకూర్చిన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన లేఖను నేరుగా లబ్ధిదారులకు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆదివారం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈమేరకు ముఖ్యమంత్రి జగన్ సందేశంతో కూడిన లేఖలను ప్రతి ఇంటికీ అందచేయనున్నారు. ఐదేళ్లలో ఒక్కో ఇంటికి ఏ పథకం ద్వారా మొత్తం ఎంత మేర ప్రయోజనం కలిగిందో వివరిస్తూ లబ్ధిదారుల వారీగా ప్రత్యేకంగా అనుబంధ పత్రాన్ని రూపొందించారు. లేఖ పంపిణీ సమయంలో వలంటీర్లు ఆయా కుటుంబాలకు చెందిన ఒక సభ్యుడి నుంచి

మిగతా 3వ పేజీలో ▶




• మడతబెట్టిన హామీలకు డిక్లరేషన్ రూపం..

బీసీల కోసం మరో వేషం

వచ్చే ఐదేళ్లలో బీసీలకు బాబు చేస్తానన్న ఖర్చు రూ.1.50 లక్షల కోట్లు

గత ఐదేళ్లలో జగన్ బీసీలకు చేకూర్చిన లబ్ధి రూ.1.76 లక్షల కోట్లు

- బీసీలంటే 'బ్యాక్ బోన్' అన్న వైఎస్సార్‌సీపీ స్లోగన్‌నే కాపీ కొట్టిన టీడీపీ
- బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ జగన్ సర్కారు అమలు చేస్తున్నవే
- బీసీ కార్పొరేషన్లు.. కుల ధ్రువీకరణ పత్రాలు.. కుల గణన.. ఇలా అన్నీ కాపీనే
- అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయకుండా డ్రామాలు
- నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం ఇస్తామన్న బాబు
- 50 శాతానికిపైగా పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ
- అభాసుపాలైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బీసీ డిక్లరేషన్



బాబూ ఈ మాటలు మరిచావా?

బీసీలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక.. ఇది బీసీల పార్టీ.. బీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం ఈ పార్టీ పనిచేస్తుంది.

\- ఇవి ఎన్నికల ముందు బాబు మాయ మాటలు.

కట్ చేస్తే..

ఏం తమాషాలు చేస్తున్నారా.. పిచ్చాటలు ఆడారంటే మీ తోకలు కత్తిరిస్తా.. మీ తాట తీస్తా.. అసలు మిమ్మల్ని ఇక్కడికి ఎవరు రానిచ్చారు.

\- ఇది అధికారంలోకి వచ్చాక బీసీలపై బాబు శివాలు.

సాక్షి, అమరావతి: బీసీ డిక్లరేషన్ సభలో తాను అధికారంలోకి వస్తే.. వచ్చే ఐదేళ్లలో చంద్రబాబు చేస్తానన్న ఖర్చు రూ.1.50 లక్షల కోట్లు.. గత ఐదేళ్లలో బీసీల కోసం సీఎం వైఎస్ జగన్ చేసిన ఖర్చు రూ. 1.76 లక్షల కోట్లు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయంగా చూసిన చంద్రబాబు 'బ్యాక్ బోన్' అంటూ జగన్ ప్రభుత్వ స్లోగన్‌ను కాపీ కొట్టారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. 'బ్యాక్ బోన్' అంటూ గత ఐదేళ్లలో వారికి అన్ని రంగాల్లో జగన్

మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీరే అంబాసిడర్! కంగ్రాచ్యులేషన్స్ సార్!

ఇలాంటివన్నీ రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలే

ధ్రువీకరణ పత్రాలపై సీఎం ఫొటో, నవరత్నాల లోగో ఉంటే నష్టమేమిటి?

- దీని వల్ల ప్రజల హక్కులు ఎలా ప్రభావితం అవుతాయి?
- పిటిషనర్‌ను నిలదీసిన హైకోర్టు సీజే ధర్మాసనం
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత గడువు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, నవరత్నాల లోగో ముద్రించడం వల్ల ప్రజల హక్కులు ఎలా ప్రభావితం అవుతాయని హైకోర్టు ప్రశ్నించింది. వాటిపై సీఎం ఫొటో, నవరత్నాల లోగో ఉంటే పిటిషనర్ హక్కులు ఎలా ప్రభావితం అవుతాయని కూడా ప్రశ్నించింది. ముఖ్యమంత్రి ఫొటో ఉంటే వచ్చిన నష్టం ఏమిటని నిలదీసింది. ఎన్నికల సమయంలో దాఖలు చేసే ఇలాంటి వ్యాజ్యాలన్నీ రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలే అవుతాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత గడువునిచ్చింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు

మిగతా 5వ పేజీలో ▶


ఆదేశాలిచ్చినా ఆందోళన ఎందుకు?

- న్యాయవాదులు, కక్షిదారులను ప్రశ్నించిన హైకోర్టు
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత గడువు.. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా

ఏం ఆశించి సమ్మె చేస్తున్నారు!

న్యాయవాద సంఘాలను ప్రశ్నించిన హైకోర్టు

5 లో





కోల్‌కతాలో నిర్మించిన దేశంలోని మొదటి అండర్ వాటర్ మెట్రోరైల్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిచారు. తర్వాత అందులో ప్రయాణిస్తూ విద్యార్థులతో ముచ్చటించారు.

6 లో



వెలిగొండ ప్రాజెక్ట్ జంట సొరంగాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్



వెలిగొండ జంట సొరంగాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ జంట సొరంగాల పైలాన్ వద్ద సీఎం జగన్

ఇది దేవుడి స్క్రిప్ట్

నాన్న మొదలుపెడితే.. నేను పూర్తి చేశా

వెలిగొండను జాతికి అంకితం చేసిన సందర్భంగా సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మూడు జిల్లాల్లో ఫ్లోరైడ్, కరువు పీడిత ప్రాంత ప్రజల కష్టాలను తీర్చే గొప్ప ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో 30 మండలాలకు తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా జంట టన్నెళ్లతో శరవేగంగా పూర్తి చేసిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి జగన్ ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు–ఎగువ చెర్లోపల్లి వద్ద బుధవారం ప్రారంభించారు. దివంగత వైఎస్సార్ హయాంలో చేపట్టిన 37.6 కి.మీ పొడవైన వెలిగొండ రెండు టన్నెళ్లలో చంద్రబాబు అధికారంలో ఉండగా 6.6 కి.మీ. పనులు మాత్రమే చేయగా మిగతావి 31 కి.మీ మేర పనులు వైఎస్సార్, సీఎం జగన్ పాలనలోనే జరగడం గమనార్హం. గిద్దలూరు నియోజకవర్గానికి ప్రయోజనం చేకూరుస్తూ 13,500 ఎకరాలకు సాగునీటిని అందించే రెండు ఎత్తిపోతల పథకాలకు కూడా సీఎం జగన్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఏమన్నారంటే..

మళ్లీ మనం రాగానే నీళ్లు నింపుతాం..

ప్రకాశం జిల్లాలోని 23 మండలాలు, నెల్లూరు జిల్లాలో ఐదు, కడప జిల్లాలో రెండు మండలాలు కలిపి మొత్తం 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి సమస్యకు పరిష్కారం చూపిస్తూ వెలిగొండ రెండు సొరంగాలు వేగంగా పూర్తయ్యాయి. దీంతో వచ్చే ఖరీఫ్‌లో శ్రీశైలం నుంచి నల్లమలసాగర్‌కు నీళ్లు తీసుకొచ్చి నింపుతున్న దృశ్యం జూలై–ఆగస్టులో ఆవిష్కృతమవుతుందని సంతోషంగా చెబుతున్నా. దాదాపు 3 వేల క్యూసెక్కులతో మొదటి టన్నెల్‌ను పూర్తి చేశాం. 8,500 క్యూసెక్కుల క్యారీయింగ్ కెపాసిటీతో రెండో టన్నెల్ పూర్తయింది. అంటే శ్రీశైలంలో మట్టం 840 అడుగులు దాటిన వెంటనే రోజుకో టీఎంసీని ఈ రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు తీసుకురాగలిగే గొప్ప పరిస్థితి ఈ రోజుతో వచ్చింది. జూలై–ఆగస్టులో నీళ్లు నింపే సమయానికి మరో రూ.1,200 కోట్లు ఖర్చు చేసి ఎల్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్ కూడా పూర్తి చేస్తాం. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టమైన రెండు టన్నెళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రిజర్వాయర్ కూడా పూర్తయిపోయింది. ఇక మిగిలినవి పెద్దగా ఏమీ లేవు. మళ్లీ మనం అధికారంలోకి వచ్చి ప్రమాణ స్వీకారం చేసిన రెండు మూడు నెలల్లోనే ఎల్‌ఏ, ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసి పూర్తిగా నీళ్లు నింపుతాం.

దుర్భిక్ష ప్రాంతానికి మేలు చేయని బాబు..

ఈ ప్రాజెక్టు వల్ల ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలన్నింటికీ మంచి జరుగుతుందని తెలిసినా, యర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు, కనిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు నియోజకవర్గాలకు మేలు జరుగుతుందని తెలిసినా బాబు హయాంలో టన్నెళ్లు పూర్తి చేయకుండా పనులు నత్తనడకన సాగాయి. ఇందులో ఒక్కొక్కటి 18.8 కి.మీ. పొడవుతో 37.6 కి.మీ పొడవైన 2 టన్నెళ్లున్నాయి. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఉరుకులు పరుగులతో సింహభాగం పనులు చేయగా 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో 6.6 కి.మీ. మాత్రమే టన్నెళ్ల పనులు జరిగాయి. ఆ తర్వాత మీ బిడ్డ సీఎం అయ్యాక జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ 2 టన్నెళ్లను వడివడిగా పూర్తి చేసి వెలిగొండను సాకారం చేశాడని చెప్పేందుకు గర్విస్తున్నా.

రెండు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన

గిద్దలూరు నియోజకవర్గానికి మేలు చేసే 2 ఎత్తిపోతల పథకాలకు వెలిగొండ టన్నెళ్ల పైలాన్ సమీపంలో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అర్ధవీడు మండలం పాపినేనిపల్లి, వెలగలపాయ ఎత్తిపోతల పథకాలకు భూమి పూజ నిర్వహించారు. రెండు ఎత్తిపోతల పథకాలకు రూ.53 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు. దీని ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు అందనుంది.

టన్నెల్‌లో కలియదిరిగి... పైలాన్‌ను ఆవిష్కరించి

నిర్మాణం పూర్తి చేసుకున్న వెలిగొండ టన్నెళ్ల వద్దకు మధ్యాహ్నం 11.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం జగన్ జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి వెలిగొండ నిర్మాణంలో భాగస్వాములైన అధికారులతో ఫొటోలు దిగి పేరుపేరునా అభినందించారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి జంట సొరంగాల పైలాన్ వద్దకు సీఎంను తోడ్కొని వెళ్లారు. జంట సొరంగాల పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం జగన్ వెలిగొండ వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి టన్నెళ్లను వీక్షించారు. అనంతరం రెండో టన్నెల్ లోపలకు వెళ్లి కలియదిరిగి పరిశీలించారు. మెగా ఇంజినీరింగ్ వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు టన్నెళ్ల పనులు, సాంకేతిక అంశాలను తెలియచేశారు. అనంతరం వెలిగొండ సావనీర్‌ను సీఎం ఆవిష్కరించారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రిన్స్‌పల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా సీఈ ఆర్ మురళీనాథ్‌రెడ్డి తదితరులు ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా సీఎం జగన్‌కు అందించగా పాదరక్షలను విడిచిపెట్టి భక్తి భావంతో స్వీకరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మేరుగు నాగార్జున, మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వాగతం పలికారు. సీఎం వెంట హెలికాప్టర్‌లో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు.



బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తున్న సీఎం జగన్



పంట నష్టపరిహారం–పెట్టుబడి రాయితీ చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాగును బాగు చేశాం

వ్యవసాయంలో కొత్త ఒరవడి తీసుకొచ్చాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- 58 నెలల్లో రైతులకు అన్ని విధాలుగా తోడుగా నిలిచాం
- తొలిసారిగా రైతన్నపై పైసా భారం పడకుండా పంటల బీమా అమలు
- ఆర్బీకేలు, సచివాలయాలతో గ్రామ స్థాయిలో పరిస్థితులు మారాయి
- 11.59 లక్షల మంది రైతులకు రూ.1,294.58 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

సాక్షి, అమరావతి: 'సచివాలయాలు, ఆర్బీకేలు లాంటి గొప్ప వ్యవస్థల ఏర్పాటుతో గ్రామ స్థాయిలో పరిస్థితులు మారిపోయాయి. వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడి తెచ్చి రైతులకు తోడుగా నిలిచాం. వారికి ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నాం. అందుకే ఈ ఐదేళ్లలో వారి జీవితాల్లో స్పష్టమైన మార్పు కన్పిస్తోంది' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ఖరీఫ్ 2023లో వర్షాభావంతో ఏర్పడిన కరువు, గత డిసెంబర్‌లో మిచాంగ్ తుపానుతో నష్టపోయిన 11,59,126 మంది వ్యవసాయ, ఉద్యాన రైతులకు రూ.1,294.58 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్ ఏమన్నారంటే..

అవినీతి, వివక్షకు తావు లేకుండా..

పారదర్శకంగా మంచి జరుగుతుందా? అని ఎవరైనా ఐదేళ్ల క్రితం ప్రశ్నిస్తే అది అయ్యే పని కాదనే సమాధానం వచ్చేది. ఎందుకంటే ఆరోజు పారదర్శకంగా ఏ ఒక్క పని జరిగేది కాదు కాబట్టి. మొట్టమొదటిసారిగా అటువంటి పరిస్థితులు మారాయి. ఆర్బీకేల ద్వారా రైతన్నను చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థ తోడుగా ఉంది. ప్రతి ఎకరాను ఇ–క్రాప్ చేయడం వల్ల సచివాలయ పరిధిలో ఏ పంటను ఎవరు ఎన్ని ఎకరాల్లో వేశారో పూర్తి డేటా అందుబాటులోకి వచ్చింది. వైపరీత్యాల వల్ల ఏ పంటకు నష్టం జరిగినా అత్యంత పారదర్శకంగా అర్హుల జాబితాలను ప్రదర్శిస్తున్నారు. ఒకవేళ ఏదైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుకునే వెసులుబాటు ఉంది. ఎక్కడా అవినీతి, వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా అర్హులైన ప్రతి రైతుకూ సహాయం సకాలంలో అందుతున్న పరిస్థితి ఈ 58 నెలల పాలనలోనే జరుగుతోందని చెప్పడానికి ఆనందపడుతున్నా. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పడానికి సంతోషపడుతున్నా.

తడిసిన ధాన్యాన్ని కొన్న ప్రభుత్వం మనదే..

తడిసిన ధాన్యం, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన పరిస్థితి గత ప్రభుత్వంలో ఎప్పుడూ చూడలేదు. అలాంటిది ఈ ప్రభుత్వంలో రైతు నష్టపోకూడదన్న సంకల్పంతో రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని మొట్టమొదటిసారిగా కొనుగోలు చేస్తూ అడుగులు పడ్డాయి. మిచాంగ్ తుపాన్ వేళ దాదాపు 3.25 లక్షల టన్నులు రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు తోడుగా నిలిచింది ప్రభుత్వం. నాలుగేళ్ల పాటు సమృద్ధిగానే వర్షాలు పడ్డాయి. గతేడాది ఖరీఫ్‌లో కొంత మేర వర్షం తక్కువగా నమోదు కావడంతో 7 జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సి వచ్చింది. ఈ మండలాల్లో పంటలు నష్టపోయిన 6.96 లక్షల మంది రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.847 కోట్లు విడుదల చేస్తున్నాం. మిచాంగ్ తుపాను వల్ల పంటలు నష్టపోయిన 4.61 లక్షల మంది రైతన్నలకు మరో రూ.442 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేస్తున్నాం. ఈ రెండూ కలిపి 11.61 లక్షల మంది రైతన్నలకు మొత్తంగా రూ.1,294.58 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసే మంచి కార్యక్రమం దేవుడి దయ వల్ల జరుగుతోంది.

80 శాతం సబ్సిడీపై విత్తనాలందించాం

కరువు, తుపాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు సబ్సిడీపై విత్తనాలను అందించి అండగా నిలిచాం. ఉలవలు, అలసంద, మినుము, పెసర, కంది, రాగి, మొక్కజొన్న లాంటి స్వల్ప కాలిక పంటల సాగు కోసం 30 వేల క్వింటాళ్లను రూ.26 కోట్లతో 1.14 లక్షల మంది రైతులకు సరఫరా చేయగలిగాం. మిచాంగ్ తుపాను వల్ల డిసెంబర్ 4న నష్టం జరిగితే డిసెంబర్ 8వ తేదీకల్లా రూ.31 కోట్లతో 80% సబ్సిడీ మీద రాయితీతో 49,758 క్వింటాళ్ల విత్తనాలను 71,415 మంది రైతులకు ఆర్బీకేల ద్వారా సరఫరా చేసి తోడుగా నిలబడగలిగాం. జూన్‌లో వారికి పంటల బీమా పరిహారం అందిస్తాం.

పైసా భారం లేకుండా పంటల బీమా

చంద్రబాబు పాలనలో ఏటా కరువు కాటకాలే నెలకొన్నా 2014–19 మధ్య 30.85 లక్షల మందికి రూ.3,411 కోట్లు మాత్రమే బీమా పరిహారం ఇచ్చిన పరిస్థితిని చూశాం. ఇప్పుడు దేవుడి దయతో ఏటా మంచి వర్షాలు పడుతున్నాయి. ఒక్క సంవత్సరమే కొద్దో గొప్పో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగేళ్లలో ఎప్పుడూ ఒక్కటి కూడా కరువు మండలంగా ప్రకటించాల్సిన అవసరం రాలేదు. మనం 54.55 లక్షల మందికి రూ.7,802 కోట్ల బీమా పరిహారం ఇచ్చి తోడుగా నిలబడ్డాం. పైసా కూడా ప్రీమియం కట్టాల్సిన అవసరం లేకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేసి రైతులకు తోడుగా నిలబడింది ఈ ప్రభుత్వమే. ఇ– క్రాప్ ద్వారా రైతుకు ఇన్సూరెన్స్ ఆటోమేటిక్‌గా వర్తింపజేసే అడుగులు మొదటిసారిగా పడ్డాయి. గతంలో రుణాల కోసం బ్యాంకులకు వెళ్లినప్పుడు 5 శాతం ప్రీమియం కింద జమ చేసుకుని ఇన్సూరెన్స్ వర్తింపజేసేవారు. రుణాలు తీసుకోని రైతులకు, ఆ విషయం తెలియని వారికి ఇన్సూరెన్స్ వచ్చే అవకాశమే ఉండేది కాదు. అలాంటిది ఈరోజు పంటల బీమా అమలులో ఎన్ని మార్పులు వచ్చాయో గమనించమని ప్రతి రైతన్ననూ కోరుతున్నా.

చిన్న రైతుకు పెద్ద భరోసా

ప్రతి రైతుకూ పెట్టుబడి సహాయంగా రూ.13,500 అందించడం ఇంతకు ముందెన్నడూ లేదు. చంద్రబాబు హయాంలో రైతులు పంటలు వేసేటప్పుడు వారికి తోడుగా నిలబడాలనే ఆలోచన చేయలేదు. తాజా లెక్కల ప్రకారం దాదాపు 63%మంది రైతులకు అర హెక్టారు లోపు మాత్రమే భూములున్నాయి. హెక్టారు లోపు భూమి ఉన్న వారు మరో 24% మంది ఉన్నారు. ఈ 87%మంది రైతులు దాదాపు 70% విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అర హెక్టార్ లోపు పొలం ఉన్న రైతులకు రూ.13,500 రైతు భరోసా సాయం 80% పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతోంది. ఇటువంటివన్నీ గత 58 నెలలుగా మాత్రమే జరుగుతున్నాయి.

■ మంత్రి కాకాణితో పాటు సీఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీ పాలనా భవనం ప్రారంభం

ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ అడ్మినిస్ట్రేషన్ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి జగన్ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. గుంటూరు లాంలోని వర్సిటీ ప్రాంగణంలో 5.2 ఎకరాల విస్తీర్ణంలో రూ.110 కోట్లతో నూతనంగా నిర్మించిన ఈ అత్యాధునిక భవన సముదాయం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గత సర్కారు కేవలం శంకుస్థాపన చేసి సరిపుచ్చగా సీఎం జగన్ పూర్తి చేసి ప్రారంభించడం సంతోషకరమని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు లాం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్సిటీ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మిదేవి, జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంతకుముందు విత్తనాల కోసం లాఠీ దెబ్బలు తినేవాళ్లం



నాకు ఐదెకరాలున్నాయి. ఖరీఫ్‌లో 2 ఎకరాల్లో మొక్కజొన్న వేశా. సకాలంలో వర్షాలు రాక నష్టపోయా. ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. రైతుల కష్టాలను గుర్తించి సాయం చేస్తున్నారు. గతంలో పెట్టుబడుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోయేవాళ్లం. నేడు ఏటా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తున్నారు. పంటల బీమా వస్తుంది. సున్నా వడ్డీ రాయితీ వస్తోంది. గతంలో విత్తనాల కోసం లాఠీ దెబ్బలు తినేవాళ్లం. ఇప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల ద్వారా ఇస్తున్నారు. గతంలో వ్యవసాయం చేయాలంటే చాలా అవస్థలు పడేవాళ్లం. మీరు వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. పంటలకు మద్దతు ధర ఇస్తున్నారు. మాకు చాలా ఆనందంగా ఉంది. మా గ్రామంలో హెరిటేజ్ డెయిరీ మాత్రమే ఉండేది. అందులో లీటర్ పాలకు రూ. 20 నుంచి రూ. 25 మాత్రమే ఇచ్చేవారు. కానీ నేడు లీటర్‌కు రూ. 35 నుంచి రూ. 40 వస్తున్నాయి. పాడి రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. పిల్లలను మంచి చదువులు చదివిస్తున్నాను. గత 57 నెలల్లో వ్యవసాయ పథకాల ద్వారా రూ.88,392 వచ్చాయి. మా నాన్నకు పింఛను రూ. 1,35,750, నా భార్యకు వైఎస్సార్ ఆసరా కింద రూ. 54,000, సున్నా వడ్డీ కింద రూ. 5,369, పిల్లలకు విద్యా దీవెన కింద రూ. 66,000, వసతి దీవెన కింద రూ. 58,000 వచ్చాయి. అన్నీ కలిపి రూ. 4,06,761 వచ్చాయి. ఇంత పెద్ద మొత్తంలో సాయం అందడం ఇదే ప్రథమం. అదీ లంచాలతో పని లేకుండా నేరుగా మా ఖాతాలో జమ చేశారు. ఇంత కంటే ఇంకేం కావాలి. మళ్లీ మీరే సీఎం కావాలి.

– జనార్దన్ రెడ్డి, రైతు, భైరాపురం, శ్రీ సత్యసాయి జిల్లా

ఇంతలా ఆలోచించే సీఎంను ఎన్నడూ చూడలేదు

నేను 1.20 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాన్ వల్ల పంట దక్కదేమోనని అనుకున్నాం. సకాలంలో పూడికలు తీయించడం వల్ల వర్షం నీరంతా సముద్రంలోకి వెళ్లిపోయింది. గతంలో తుపాను వస్తే పట్టించుకునేవారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. తడిసిన ధాన్యం కొంటున్నారు. మిల్లుకు పంపిన 13 రోజుల్లో డబ్బు వస్తోంది. ట్రాక్టర్ బాడుగ, గోతాలకు కూడా సొమ్మిచ్చారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తున్నారు. తుపాను నష్టం సాయం అందుతోంది. రైతుల కోసం ఇంతలా ఆలోచించే సీఎంను ఎన్నడూ చూడలేదు. గతంలో పంట నష్ట పరిహారం వారికి అనుకూలమైన వారికే ఇచ్చారు. నేడు పార్టీలకతీతంగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. మేం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మా ఊళ్లోనే మాకు కావాల్సినవన్నీ దొరుకుతున్నాయి. ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స చేయించుకున్నా. ఇంటికొచ్చే సమయంలో డబ్బులు కూడా ఇచ్చారు. మా పాప చదువుతున్న ప్రభుత్వ పాఠశాలను చాలా బాగా అభివృద్ధి చేశారు. చిన్నమ్మాయికి ట్యాబ్ ఇచ్చారు. మంచి ఆహారం ఇస్తున్నారు. ఎక్కడా రూపాయి లంచం ఇవ్వకుండా అర్హత ఉంటే చాలు అన్ని పథకాలు అందిస్తున్నారు. నా ఒక్క కుటుంబానికే రూ.3.10 లక్షల సాయం అందింది. మీరు మాట ఇస్తే జరిగినట్లే. మళ్ళీ మీరే సీఎంగా ఉండాలి. మళ్ళీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట కాలువలు బాగు చేయాలని కోరుతున్నా.

–మోషే, రైతు, నర్రావారి పాలెం, కర్లపాలెం మండలం, బాపట్ల

చెప్పిన మాటకు మించి సాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల్లో చెప్పిన దానికి మించి సాయం అందిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా సోషల్ ఆడిట్ నిర్వహించి, పారదర్శకంగా, నేరుగా రైతులే వెరిఫై చేసుకున్న తర్వాత లబ్ధిదారుల తుది జాబితాలు ప్రకటిస్తున్నాం. మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలకు రికార్డు టైంలో నాలుగు రోజుల్లోనే సబ్సిడీ విత్తనాలు ఇచ్చాం. దీనివల్ల రైతులు వెంటనే నారుమళ్ళు పోసుకుని విత్తుకోగలిగారు. ఈ ప్రభుత్వంలో 34.43 లక్షల మంది రైతులకు రూ.3,262 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. గతంలో బాబుప్రభుత్వం రూ.2,560 కోట్ల బకాయిలు పెట్టి రైతులను మోసం చేసింది. సీఎం జగన్ ఇచ్చిన మాటకంటే మిన్నగా వైఎస్సార్ రైతు భరోసాతో పాటు సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా ప్రతిదీ ఇస్తున్నారు. చంద్రబాబు హయాంలో 39 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన రూ.1180.66 కోట్ల సున్నా వడ్డీ బకాయిలను సైతం వైఎస్ జగన్ చెల్లించారు. పంటల బీమా, విత్తన, బిందు సేద్యం బకాయిలనూ చెల్లించారు. టీడీపీ ప్రభుత్వం రైతులను వంచిస్తే వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా నిలిచారు. రైతులను కంటిపాపలా కాపాడుకున్న సీఎం వైఎస్ జగన్‌కు అన్నదాతలు ఆశీస్సులు అందించాలి. మరో 3 నెలల్లో సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యి ఇదే రీతిలో అండగా నిలుస్తారు.

– కాకాణి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

- న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి



సాక్షి, అమరావతి: సమాజంలో మహిళలను గౌరవించే వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థలు మాత్రమే పురోభివృద్ధి చెందుతాయని హైకోర్టు న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి చెప్పారు. ఇటీవలి కాలంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత పెరుగుతోందని, ఇది ఎంతో శుభసూచకమని తెలిపారు. మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పని ప్రదేశాల్లో మహిళల హక్కులు అన్న అంశంపై బుధవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ డాక్టర్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ బి.శ్రీభానుమతి, జస్టిస్ ప్రతాప జ్యోతిర్మయి ప్రసంగించారు. మహిళలకు ప్రాధాన్యత పెరగడం ఎంతో సంతోషకరమని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా మహిళల పురోగతి సులభమవుతుందన్నారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు చట్టాలున్నాయని తెలిపారు. ఆ చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి మజ్జి బబిత, పరిపాలనాధికారి అమరరంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా మహిళలకు జాతీయ అవార్డు

- 'లే–ఎక్స్‌ట్రార్డినరీ' పోటీల్లో సత్యవేడ గ్రూప్‌నకు మొదటి బహుమతి

సాక్షి, అమరావతి: పనికిరాని వస్త్రాలతో మహిళా సంఘం సభ్యులు సంఘటితంగా చేసిన ప్రయత్నం రూ.లక్షల వ్యాపారానికి నాంది పలికింది. మరో 20 మందికి జీవనోపాధిని కూడా కల్పించింది. అంతేనా... వారి ప్రయత్నానికి జాతీయ స్థాయి గుర్తింపు సైతం దక్కింది. కర్నూలు పట్టణానికి చెందిన సత్యవేడ మెప్మా స్వయం సహాయక సంఘం సభ్యులు పనికిరాని వస్త్రాలతో డోర్ మ్యాట్స్ తయారు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పట్టణ, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన–నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్స్ మిషన్ నిర్వహించిన



అవార్డు అందుకుంటున్న సత్యవేద ప్రతినిధి కృష్ణవేణి

'లే–ఎక్స్‌ట్రార్డినరీ' పోటీల్లో సత్యవేడ ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉత్తమ జీవనోపాధి కల్పనలో మొదటి బహుమతి సాధించారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రూప్ ప్రతినిధి కృష్ణవేణి నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్స్ మిషన్ అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మెప్మా సత్యవేడ ఎస్‌హెచ్‌జీ సభ్యులు పనికిరాని వస్త్రాలు, వాటి వేస్ట్‌తో డోర్ మ్యాట్స్‌ను తయారు చేస్తూ ఏటా రూ.30 లక్షల వ్యాపారం చేస్తున్నారు. అంతేగాక మరో 20 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి సత్యవేడ సభ్యులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మహిళలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. దాంతో మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణనిచ్చి ప్రోత్సహించడంతో పాటు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. అందుకు గుర్తింపుగా కేంద్రం నుంచి సత్యవేడ గ్రూప్‌నకు అవార్డు రావడం ఆనందంగా ఉందని మెప్మా ఎండీ విజయలక్ష్మి పేర్కొన్నారు.

మాపై ఎల్లోమీడియా దుష్ప్రచారం: మంత్రి సురేష్

సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ వేదిక వద్ద తనను అవమానించినట్టు మీడియాలో వస్తున్న ప్రచారాన్ని మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఖండించారు. ఎవరినో కూర్చోబెట్టేందుకు తనను వేదికపై కుర్చీలోంచి లేపారన్నది అబద్ధమని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభా వేదిక సమీపంలోకి వచ్చిన ప్రజానీకాన్ని సభా ప్రాంగణంలో సర్దుబాటు చేయాలని సూచించడంతో తాము కిందకు దిగామన్నారు. 'మమ్మల్ని అవమానించే నైజం మా సీఎంది కాదు. దళితులను అవమానించిన పార్టీ టీడీపీ. టీడీపీ దళితులను అవమానిస్తే మా జగనన్న మమ్మల్ని అక్కున చేర్చుకున్నారు. తప్పుడు సందేశాలు ప్రజల్లోకి పంపాలని ఎంత ప్రయత్నించినా ఎల్లోమీడియాను ప్రజలు నమ్మరు' అని మంత్రి పేర్కొన్నారు.

14 వరకు ఏపీ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) నిర్వహిస్తోన్న రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష (ఏపీ సెట్ 2024) దరఖాస్తు గడువును ఈ నెల 14 వరకు పొడిగించినట్లు ఏపీసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జీఎంజే రాజు బుధవారం తెలిపారు. విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞాపనలు పరిశీలించి దరఖాస్తు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముగిసిన టెట్

120 సెంటర్లలో విజయవంతంగా పరీక్షలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్ -2024) విజయవంతంగా ముగిశాయి. చివరి రోజైన బుధవారం ఉదయం మైనర్ లాంగ్వేజిస్ పరీక్షకు 10,469 మంది (89.73 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంగ్లిష్ భాషా పరీక్షకు9,789 మంది (89.58 శాతం) హాజరయ్యారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించిన సెకండరీ గ్రేడ్ టీచర్ల అర్హత పరీక్ష పేపర్-1ఏకు 1,13,296 మంది (87.63 శాతం) హాజరయ్యారు. మార్చి 2 నుంచి 6వ తేదీ వరకు జరిగిన స్కూల్ అసిస్టెంట్ టీచర్ల అర్హత పరీక్ష పేపర్-2ఏకు 1,19,500 మంది (88.82 శాతం) మంది హాజరయ్యారు. 5న నిర్వహించిన ప్రత్యేక విద్య ఉపాధ్యాయ అర్హత పరీక్ష పేపర్-1బి, పేపర్-2బి రాసేందుకు 3,111 మంది (78.02 శాతం) హాజరయ్యారు. ముగిసిన పేపర్లకు 'కీ' విడుదల చేస్తామని, అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి తుది కీని ప్రకటిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు.

'చెప్పాడంటే చేస్తాడంతే..'

▶ మొదటి పేజీ తరువాయి

ఈ- కేవైసీ తీసుకోనున్నారు. లేఖ సారాంశం ఇదీ..

రాష్ట్ర ప్రజలందరికీ..

- ముఖ్యమంత్రిగానే కాకుండా మీలో ఒకడిగా, మీ కుటుంబ సభ్యుడిగా, మీ బిడ్డగా మీ అందరితో కొన్ని విషయాలు పంచుకోవాలనుకుంటున్నా. మీ అందరి చల్లని దీవెనలతో ఏర్పాటైన మనందరి ప్రభుత్వం ఐదేళ్లు పూర్తి చేసుకుంటోందని తెలియజేయడానికి నేనెంతగానో సంతోషిస్తున్నా. ఈ ఐదేళ్లలో మీ బిడ్డ ప్రభుత్వం సాధించిన విజయాల్లో కొన్నిటిని మీకు మరోసారి గుర్తు చేయదలిచా. మీకిచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలోని నవరత్నాలను అమలు చేసి 99.5 శాతం హామీలను మనందరి ప్రభుత్వం పూర్తి చేయగలిగింది. గత పాలకులు తమ మేనిఫెస్టోని మాయం చేసి మోసగిస్తే మనం భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి ప్రతి హామీని నెరవేరుస్తూ మేనిఫెస్టోకి జవాబుదారీతనం, సార్థకత తీసుకురాగలిగాం. కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలను అందించగలిగాం.
- నాడు- నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చాం. ప్రభుత్వ స్కూళ్లన్నింటిలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందుబాటులోకి తేవడంతోపాటు ఐబీ దిశగా అడుగులు వేయగలిగాం. విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ట్యాబ్‌లు సమకూర్చి జగనన్న గోరుముద్ద ద్వారా రోజూ రుచికరమైన భోజనం అందజేస్తున్నాం. జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెనలతో పాటు డిజిటల్ క్లాస్ రూంలు,



సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్ లాంటి కార్యక్రమాలు చేపట్టగలిగాం. ఈ ఐదేళ్లలో విద్యారంగానికే సుమారు రూ.74 వేల కోట్లు ఖర్చు చేశాం. ఇది విద్యా రంగంలో మీ కళ్ల ముందే మీ బిడ్డ తీసుకొచ్చిన మార్పు. గత పాలకులు మన బిడ్డల భవిష్యత్ గురించి ఏనాడైనా ఇలా పట్టించుకున్నారా? ఒక్కసారి ఆలోచించండి.
- వైద్యం కోసం పేదలెవరూ అప్పుల పాలు కాకూడదన్నది మీ బిడ్డ తపన, తాపత్రయం. ఖరీదైన కార్పొరేట్ వైద్యం పేదలకు ఉచితంగా అందించేలా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచగలిగాం. గతంలో ఆరోగ్య శ్రీ ద్వారా 1,000 రకాల చికిత్సలే అందగా ఇప్పుడు ఏకంగా 3,257 రకాల చికిత్సలను ఉచితంగా అందిస్తున్నాం. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను మనందరి ప్రభుత్వంలో అభివృద్ధి చేసుకోగలిగాం. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో గ్రామీణ ప్రజల గడప వద్దకే మెరుగైన వైద్య సేవలను తీసుకెళ్లగలిగాం.
- గ్రామాల్లో ఆర్బీకేలను నెలకొల్పి రైతులకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకు తోడుగా ఉంటున్నాం. రైతన్నకు ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ధాన్యం కొనుగోలు సొమ్మును నేరుగా ఖాతాల్లో జమ చేయగలిగాం. ఐదేళ్లలో రైతులకు రూ.1,75,007 కోట్లు సాయంగా అందించి వారికి అండదండగా నిలవగలిగాం.
- మీ బిడ్డ ప్రభుత్వంలో ఇవాళ ప్రతి ఊరు మారింది. ఏ ఊరికి వెళ్లినా ప్రతి 50 గడపలకు ఒక వలంటీరుతో పాటు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ సదుపాయం, నాడు-నేడుతో రూపు మారిన గవర్నమెంట్ బడులు కనిపిస్తాయి. పెన్షన్ మొదలు ఇంటికే రేషన్, సర్టిఫికెట్లు, మెడికల్ టెస్ట్‌ల వరకు అన్ని రకాల సేవలు తలుపు తట్టి మరీ అందిస్తున్నాం. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ప్రభుత్వాన్నే వారి గడప వద్దకు తేగలిగాం. గతంలో ఎప్పుడైనా ఈ పరిస్థితి ఉందా? పాలన, సేవలు అందించే విషయంలో మీ బిడ్డ తెచ్చిన ఈ మార్పును గమనించమని కోరుతున్నా.
- 31 లక్షల మంది పేద అక్కచెల్లెమ్మలకు ఒక్కొక్కరికీ కనీసం రూ.10 లక్షల విలువైన ఇంటి పట్టాలను వారి పేరిటే రిజిస్ట్రేషన్ చేసి సొంతింటి కలను సాకారం చేసే దిశగా అడుగులు వేయగలిగాం. అక్కచెల్లెమ్మల పేరిటే సంక్షేమ ఫలాలను అందించి మహిళా సాధికారితను సాకారం చేశాం.
- కులమతాలు, ఏ పార్టీ అనే వివక్ష లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసి డీబీటీతో రూ.2.62 లక్షల కోట్లు పేదల ఖాతాల్లోకి నేరుగా జమ చేసి లబ్ధి చేకూర్చాం. పేదలకు తోడుగా నిలిచి వారి జీవన ప్రమాణాలు పెరిగేలా తోడ్పాటు అందించాం.
- ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి ఎంత మేలు చేశామన్నది మీ కళ్ల ముందే కనిపిస్తోంది. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడగలిగాం. మీ బిడ్డ పాలనలో మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మీ బిడ్డను మరోసారి ఆశీర్వదించండి.

ఇట్లు.. మీ ముఖ్యమంత్రి
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గడచిన ఐదేళ్లలో 40శాతం గోదాముల సామర్థ్యం పెంపు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- తుది దశకు మరో 24,600 మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులు



గోదాములను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

గన్నవరం: గడిచిన ఐదేళ్లలో గోదాముల సామర్థ్యాన్ని 40 శాతం పెంచడం రైతుల పట్ల సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కృష్ణాజిల్లా, గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రూ.11.88 కోట్లతో నిర్మించిన 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు, 60 టన్నుల కెపాసిటీ కలిగిన లారీ వే్రబిడ్జిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు కాకాణి పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ స్థాపించిన 65 ఏళ్లలో 8.86 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సొంత గోదాములను నిర్మించినట్లు చెప్పారు. వీటిలో 2,23,300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నిర్మించినట్లు తెలిపారు. మరో 24,600 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. పాత గోదాములను రూ.21 కోట్లతో ఆధునీకీకరించినట్లు తెలిపారు. ఈ గోదాముల్లో నిల్వ చేసుకునే పంట ఉత్పత్తులకు సంస్థ జారీ చేసే నిల్వ రశీదుపై బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. నిల్వ చార్జీల్లో 25 శాతం రైతులకు రిబేటు కల్పిస్తామన్నారు. గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ జనాబ్ కరిముల్లా షేక్ అమీన్ మాట్లాడుతూ.. ఈ గోదాముల్లో పంట ఉత్పత్తులు దెబ్బతినకుండా కెమికల్ ట్రీట్‌మెంట్‌తోపాటు శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్, కో ఆపరేషన్ ముఖ్య కార్యదర్శి బాబు.ఏ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ చైర్మన్ ఎండీ జి.ఓంకార్‌రెడ్డి, పలువురు ఏఎంసీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేతన్నలకు చేయూతనిచ్చిన జగన్ ప్రభుత్వం

నటి పూనమ్‌కౌర్ ట్వీట్

సాక్షి, అమరావతి: కోవిడ్ సమయంలో నేతన్నలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా ఆదుకుందని సినీ నటి పూనమ్‌కౌర్ కితాబిచ్చారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'మహమ్మారి సమయంలో ప్రభుత్వం నేత కార్మికులను గొప్పగా ఆదుకుంది. ఆ సమయంలో చేనేత ప్రచారకర్తగా నేను ఉండడం నా అదృష్టం' అని ఆమె పేర్కొన్నారు.

సాధారణ ఎన్నికలు, రంజాన్ మాసం ఒకేసారి

- అధికారిక ఇఫ్తార్ విందులను ఎన్నికల నియమావళి అనుమతించదు
- వ్యక్తిగత హోదాలో సొంత ఖర్చుతో ఇఫ్తార్ విందులకు ఓకే
- అన్ని రాష్ట్రాల సీఎస్‌లు, సీఈవోలకు కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఈసారి సాధారణ ఎన్నికలు, రంజాన్ మాసం ఒకేసారి వచ్చాయి. మార్చి 11వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది. సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రక్రియ కూడా రెండురోజులు అటు ఇటుగా మొదలవనుంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒకపక్క రంజాన్ ఉపవాసదీక్షలు, ఇఫ్తార్‌లు, మరోపక్క సాధారణ ఎన్నికల ప్రక్రియ కొనసాగనున్నాయి. రంజాన్ మాసంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నేతలు ఇఫ్తార్ విందులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటున్నందున ప్రభుత్వాలు అధికారిక ఇఫ్తార్ విందులు ఇవ్వడం కుదరదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగే సమయంలో రాష్ట్రాలు అధికారికంగా వినోద, మతపరమైన కార్యక్రమాలకు వ్యయం చేయడం సమంజసం కాదని పేర్కొంది. అయితే వ్యక్తిగత హోదాలో సొంత ఖర్చులతో ఇఫ్తార్ విందులను నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో మంత్రులుగానీ, రాష్ట్ర ప్రభుత్వాలుగానీ అధికారికంగా ఇఫ్తార్ విందులు నిర్వహించరాదని పేర్కొంది. ఈ విషయాన్ని సంబంధిత అందరి దృష్టికి తీసుకువెళ్లాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు (సీఎస్‌లకు), రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు (సీఈవోలకు) కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

ప్రభుత్వ పథకాలను సక్సెస్ చేసింది ఉద్యోగులే

- ఉద్యోగుల సాధక బాధకాలు మొత్తం ప్రభుత్వానికి తెలుసు
- ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది
- ప్రభుత్వం ఏర్పాటు, పరిపాలనలో ఉద్యోగుల పాత్ర వెల కట్టలేనిది
- 5 ఏళ్ల ప్రభుత్వ ప్రస్థానం ఉద్యోగుల సహకారంతో సాఫీగా సాగింది
- బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల



సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను సక్సెస్ చేసింది ప్రభుత్వ ఉద్యోగులేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగమేనని, ప్రభుత్వం ఏర్పాటులో, పరిపాలనలో వారి పాత్ర వెలకట్టలేనిదని తెలిపారు. ఈ ఐదేళ్ల ప్రభుత్వ ప్రస్థానం ఉద్యోగుల సహకారంతో సాఫీగానే సాగిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సాధక బాధకాలు మొత్తం ప్రభుత్వానికి తెలుసునని చెప్పారు. వారి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు పొందుతున్న ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వమే ఒక పాలసీని రూపొందిస్తుందని చెప్పారు. ఉద్యోగుల జీతాల మొత్తం భారీగా పెరిగినప్పటికీ, వేతనాలు పెంచామని, కొత్త ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. కోవిడ్ సమయంలో రాష్ట్రానికి ఆదాయం రాలేదని, అదనంగా డబ్బు ఖర్చయిందని తెలిపారు. చంద్రబాబు దిగిపోతూ ప్రభుత్వంపై రూ.2.90 లక్షల కోట్ల అప్పులు పడేశారన్నారు. ప్రభుత్వానికి అప్పు పుట్టకుండా, ఆదాయం రాకుండా చంద్రబాబు రోజూ అవాంతరాలు కల్పిస్తున్నారని చెప్పారు. రాష్ట్రం మరో శ్రీలంక అవుతుంది అన్న పెద్ద మనిషి.. ఈరోజు 18 ఏళ్లు దాటిన అమ్మాయిల దగ్గర నుంచి పథకాలు ప్రకటించారని, 50 ఏళ్లు దాటగానే బీసీలకు పెన్షన్ ఇస్తానంటున్నారని అన్నారు. అర్హత ఉన్న వారిని తీసేసి పథకాలు ఇవ్వడం చంద్రబాబు దగ్గర ఉన్న ట్రిక్కని చెప్పారు. కానీ సీఎం జగన్ మాత్రం జల్లెడ పట్టి అర్హత ఉన్న వారిని గుర్తించి మరీ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. నాడు-నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేయకుండా అమ్మ ఒడి ఇచ్చి వదిలేసి ఉంటే నిధులు మిగిలేవన్నారు. కానీ సీఎం జగన్ ఎంత కష్టమైనా స్కూళ్లను అభివృద్ధి చేయాల్సిందేనని గట్టి పట్టుదలతో పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దారని చెప్పారు. ఆస్పత్రులకు కోటాను కోట్లు ఖర్చు చేశారని, ఫ్యామిలీ డాక్టర్ సిస్టమ్ తెచ్చారని తెలిపారు. రూ.16 వేల కోట్లతో నాలుగు పోర్టులు వస్తున్నాయని, అభివృద్ధి అంటే ఇది అని వివరించారు. కోవిడ్ రెండేళ్లు తీసేస్తే మిగిలిన తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతంగా సీఎం జగన్ వ్యవస్థలో మార్పులు తెచ్చారన్నారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది

బ్రాహ్మణుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. బ్రాహ్మణులలో పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సీఎం జగన్ బ్రాహ్మణులకు రాజకీయంగా, ఇతరత్రా సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తున్నారని చెప్పారు. 2014 -19 మధ్య రాష్ట్రంలో అరాచకం నడిచిందని, తిరిగి ఆ పాలన వస్తే ప్రజలు కష్టాల పాలవుతారని అన్నారు. అన్ని వర్గాలకు అర్థమయ్యేలా చెప్పగలిగినది బ్రాహ్మణ సామాజిక వర్గమే కనుక సీఎం జగన్ ప్రకటించినట్లు 175 అసెంబ్లీ స్థానాల్లో గెలిచే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి. కామేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారులు నేమాని భాస్కర్, జ్వాలాపురం శ్రీ కాంత్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుందర రామశర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు అమ్మ ప్రసాద్, ద్రోణంరాజు రవికుమార్, పి. పురుషోత్తమ శర్మ, జ్వాలా నరసింహారావు పాల్గొన్నారు.

● తెలంగాణ

టీవీ5 సాంబశివరావుపై చీటింగ్ కేసు

- సంధ్య హోటల్స్ డీడీతో భార్య పేరిట కారు కొనుగోలు
- గచ్చిబౌలి పీఎస్‌లో సంస్థ అకౌంటెంట్ ఫిర్యాదు
- ఐపీసీ 406, 420 సెక్షన్ల కింద కేసు నమోదు

గచ్చిబౌలి(హైదరాబాద్): టీవీ5 సాంబశివరావు చీటింగ్ బాగోతం మరొకటి వెలుగులోకి వచ్చింది. 2019లో సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌లో రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేసిన సాంబశివరావు తన వక్ర బుద్ధిని ప్రదర్శించినట్లు ఆలస్యంగా బయటపడింది. సంధ్య హోటల్స్ పేరిట కారు కొనుగోలు చేయాలని ఇచ్చిన డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ని తీసుకొని భార్య పేరిట కారు కొన్నట్లు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో తాజాగా చీటింగ్ కేసు నమోదైంది. సంధ్య హోటల్స్ కోసం ఓ కారు కొనాలని యాజమాన్యం భావించగా డీడీ ఇస్తే తనకున్న పరిచయాలతో త్వరగా కారు ఇప్పిస్తానని నమ్మించిన సాంబశివరావు... రూ. 9,21,000 డీడీతో ఆయన భార్య విజయదుర్గ పేరిట స్విఫ్ట్ (టీఎస్ 10ఈవీ 3443) కారు కొనుగోలు చేసి తమను మోసగించారంటూ సంధ్య కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ లిమిటెడ్ అకౌంటెంట్ పి.సాంబశివరావు మంగళవారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వరుణ్ మోటార్స్‌తో కలసి డాక్యుమెంట్లను మార్చి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో టీవీ5 సాంబశివరావు, ఆయన భార్యపై గచ్చిబౌలి పీఎస్‌లో ఐపీసీ 406, 420, రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

5 నిమిషాల్లోనే బయాప్సీ ఫలితం!

సాక్షి, హైదరాబాద్: రోగ నిర్ధారణలో కీలకమైన బయాప్సీ ఫలితాలను ఐదు నిమిషాల్లోనే అందించే 'వివాస్కోప్'అనే అధునాతన సాంకేతిక పరికరాన్ని ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రి తెలిపింది. జీఐ (గ్యాస్ట్రో ఇంటెస్టినల్) ఎండోస్కోపీ పరీక్షల్లో ఇదో గొప్ప ముందడుగు అని పేర్కొంది. సంప్రదాయ పద్ధతిలో కణజాల నమూనాలను సేకరించి వాటి విశ్లేషణ ఫలితాల కోసం ఐదు రోజులు వేచి ఉండాల్సి వచ్చేదని... వివాస్కోప్‌తో కణజాల బయాప్సీ ఫలితాల సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించగలిగినట్లు ఏఐజీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరిజ్ఞానం వల్ల త్వరితగతిన రోగనిర్ధారణ చేయడంతోపాటు చికిత్సల్లో జాప్యం లేకుండా చూసుకొనే అవకాశం లభించిందని పేర్కొన్నారు.

బీసీ అభ్యర్థి సీటుకు చంద్రబాబు మంగళం

- శంకర్ యాదవ్‌ను కాదని జయచంద్రారెడ్డికి సీటు
- ఆయనకు మద్దతు ఇచ్చేదిలేదని తేల్చిచెప్పిన శంకర్
- టికెట్ మార్పు కోసం కొండా నరేంద్ర బేరం
- పెద్దతిప్పసముద్రం వద్ద తమ్ముళ్ల నిరసన ప్రదర్శన



పెద్దతిప్పసముద్రంలో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

బి.కొత్తకోట/పెద్దతిప్పసముద్రం: బీసీలు ఓటు బ్యాంకే తప్ప వారికి రాజకీయ సాధికారత అక్కర్లేదని చంద్రబాబు మరోసారి నిరూపించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సీటే ఇందుకు నిదర్శనం. ఇక్కడ ఇన్నాళ్లూ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎంఎల్ఏ శంకర్ యాదవ్‌ను కాదని.. పార్టీలో కొత్తగా చేరిన జయచంద్రారెడ్డికి కేటాయించారు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయంపై నేతలు, కార్యకర్తలు తిరుగుబాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్, టికెట్ ఆశిస్తున్న ఎన్ఆర్ఐ కొండా నరేంద్రలు బహిరంగంగా వ్యతిరేకిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ మద్దతు కోసం ఆమె ఇంటికి వెళ్లిన జయచంద్రారెడ్డి భంగపడ్డారు. ఐదేళ్లుగా వ్యయ ప్రయాసలకోర్చి పని చేస్తే పార్టీకి కనీస పరిచయం లేని వ్యక్తికి టికెట్ ఇచ్చి తనను అవమానించారని శంకర్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గత నెల 27న ఉండవల్లిలో చంద్రబాబుతో భేటీ అయినప్పుడు ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు సమాచారం. అప్పటినుంచి పార్టీ అధిష్టానం స్పందన కోసం వేచి చూసి టికెట్ తనకు లేదని స్పష్టం కావడంతో జయచంద్రారెడ్డిని ఓడించేందుకు వ్యూహం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు కొండా నరేంద్ర వ్యూహం ఇంకోలా ఉంది. శంకర్‌కు ఇవ్వని పక్షంలో తనకు టికెట్ ఇస్తే ఎన్నికల ఖర్చంతా భరిస్తానని, ఎంతకావాలో చెప్పండంటూ అధిష్టానం వద్దే బేరం పెట్టినట్టు సమాచారం. కొండాకు 2014లోనే టీడీపీ టికెట్ వచ్చే అవకాశం ఉన్నా తిరస్కరించారు. ప్రస్తుతం పార్టీలో కొత్తగా చేరిన వ్యక్తికి టికెట్ ఎలా ప్రకటిస్తారన్న వాదనతో అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. శంకర్, కొండా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకతతో జయచంద్రారెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ మద్దతు కోసం ఆమె ఇంటికి వెళ్లినా తాను ఇంట్లో లేనని చెప్పించేశారు. దీన్నిబట్టి చూస్తే లక్ష్మీదేవమ్మ వర్గం కూడా వ్యతిరేకంగా ఉన్నట్టు స్పష్టమైంది.

అవసరం తీరాక గెంటేశారు

అవసరం కోసం బీసీనేత శంకర్ వెంటపడి మరీ టీడీపీలోకి తెచ్చుకున్న చంద్రబాబు ప్రత్యామ్నాయం కనిపించగానే గెంటేశారు. 2009లో తంబళ్లపల్లె కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన శంకర్ బెంగళూరులో వ్యాపారాలకే పరిమితమయ్యారు. 2012లో అప్పటి ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్ రెడ్డి టీడీపీ వీడటంతో ఇక్కడ అభ్యర్థి దొరకలేదు. దీంతో తక్కువ ఓట్లతో ఓటమిపాలైన శంకర్‌ను పార్టీలోకి పిలిచారు. రాజకీయాలపై ఆసక్తి లేదని శంకర్ చెప్పినా చివరికి పోటీకి ఒప్పించారు. 2014 ఎన్నికల్లో గెలిచారు. 2019 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ టికెట్ ఆశించే రెండో వ్యక్తి లేకపోయినా చంద్రబాబు..శంకర్‌కు టికెట్ ఇవ్వడానికి ఆసక్తి చూపలేదు. నామినేషన్ల పర్వం మొదలయ్యాక ఇక తప్పదన్న నిర్ణయానికి వచ్చాక శంకర్‌కే ఇవ్వాల్సి వచ్చింది. ఇప్పుడతని అవసరం తీరిపోయింది. ప్రత్యామ్నాయం దొరకడంతో కనీస మర్యాద లేకుండా ఏకంగా గెంటేశారు. రెండు నెలల క్రితం టీడీపీలో చేరిన జయచంద్రారెడ్డికి ప్రాధాన్యం ఇస్తూ తొలి జాబితాలోనే అభ్యర్థిత్వం ప్రకటించారు. అభ్యర్థి మార్పు విషయం శంకర్‌తో చర్చించకుండా చంద్రబాబు బీసీ సామాజిక వర్గాన్ని తీవ్రంగా అవమానించారని ఆ వర్గ నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీవర్గాలు టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలోని పలువురు తెలుగు తమ్ముళ్లు బుధవారం రోడ్డెక్కారు. స్థానిక బస్టాండ్‌లో టీడీపీ జెండాలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ పేరును ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు శంకర్ పార్టీ కార్యక్రమాలన్నీ విజయవంతం చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. జయచంద్రారెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేస్తే తాము ఏ మాత్రం సహకరించబోమని స్పష్టం చేశారు. కొత్త వ్యక్తులకు టికెట్ ఇవ్వాలనే ఆలోచన పార్టీ హైకమాండ్‌కు ఉంటే కనీసం కార్యకర్తల అభిప్రాయాలను చంద్రబాబు పరిగణనలోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఈ నిరసనలో ఏఎంసీ మాజీ చైర్మన్ పి.శ్రీనాథ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ఆ రూ.75 కోట్లను వారంలో జమచేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: న్యాయస్థానాల భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన నిమిత్తం కేంద్రం తన వాటా కింద రూ.45 కోట్లు ఇచ్చిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన రూ.30 కోట్లను వారంలోపు జమ చేయాల్సిందేనని హైకోర్టు చెప్పింది. ఆ రూ.45 కోట్లు, ఈ రూ.30 కోట్లు కలిపి మొత్తం రూ.75 కోట్లను వచ్చే బుధవారానికల్లా తమ అధీనంలో ఉండే సింగిల్ నోడల్ ఏజెన్సీ అకౌంట్‌లో జమచేయాలని స్పష్టం చేసింది. విచారణను వచ్చేవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కృష్ణాజిల్లా గన్నవరంలో పలు కోర్టుల కోసం అవసరమైన భవన నిర్మాణాలను చేపట్టలేదని, పాత భవనాలకు మరమ్మతులు నిర్వహించట్లేదని, ఈ దిశగా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ గన్నవరానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి 2022లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడం తెలిసిందే. దీన్ని సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. తాము ఇవ్వాల్సిన రూ.30 కోట్లు ఇప్పటికే జమ కావాల్సిందని, కానీ పాలనపరమైన సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరిగిందని తెలిపారు.

తమ్ముళ్ల టికెట్ పూజలు

- గందరగోళంలో పెదకూరపాడు టీడీపీ కేడర్
- వైకుంఠపురంలో భాష్యం, యండ్రాయిలో కొమ్మాలపాటి, చామర్తిలో కంచేటి పూజలు
- ఎవరికివారే అభ్యర్థులుగా ప్రకటన
- ప్రచారరథాలు సిద్ధం చేసుకున్న నేతలు



యండ్రాయి శివాలయంలో నవగ్రహ హోమం చేస్తున్న కొమ్మాలపాటి దంపతులు



వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ప్రవీణ్ దంపతులు



వరసిద్ధి వినాయక దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న కంచేటి సాయిబాబు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు తలోదారిలో పయనిస్తున్నారు. ఎవరికివారే టికెట్ తమకేనంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార వాహనాలను సిద్ధం చేసుకున్నారు. దీంతో నియోజకవర్గంలో తెలుగుదేశం కేడర్ గందరగోళంలో ఉంది. టికెట్ ఎవరికిస్తారోనని రెండునెలలుగా కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒక్కసారిగా తెలుగుదేశం టికెట్ ఆశిస్తున్న నేతలు ప్రత్యేక పూజలంటూ తమ అనుచరులతో కలిసి ప్రత్యక్షమవడంతో కార్యకర్తలు ఆశ్చర్యానికి గురయ్యారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అమరావతి మండలం యండ్రాయిలోని శివాలయంలో సతీమణి మాధవీలతతో కలిసి సుదర్శన, సుబ్రమణ్య, నవగ్రహయాగాలు, పూజలు చేశారు. మీ కోసం - మీ కొమ్మాలపాటి పేరుతో ప్రజల్ని పలకరిస్తూ గ్రామంలో తిరిగారు. ఈ టికెట్ ఆశిస్తున్న భాష్యం ప్రవీణ్ అమరావతి మండలం వైకుంఠపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోను, అత్తలూరు రామాలయంలోను, సంప్రదాయపీఠంలోను సతీసమేతంగా పూజలు చేసి, అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బహిష్కరించడంతో టీడీపీలో చేరిన కంచేటి సాయిబాబు అచ్చంపేట మండలం చామర్తిలో వరసిద్ధి వినాయక దేవాలయంలో పూజలు చేశారు. ఎవరికివారు పూజలు చేసి ప్రచారానికి సిద్ధమవడంతో కార్యకర్తలు గందరగోళంలో పడ్డారు. ఎవరు అభ్యర్థి అవుతారో, ఎవరి వెంట వెళ్లాలో అని తలలు పట్టుకుంటున్నారు. పెదకూరపాడు టికెట్ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు ఆటలాడుతున్నారని, పార్టీని నమ్ముకున్న వారికి టీడీపీలో అన్యాయం జరుగుతోందంటూ శ్రీధర్ అనుచరులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. డబ్బు మూటలతో వచ్చిన భాష్యం ప్రవీణ్‌ను చంద్రబాబే ప్రోత్సహిస్తున్నారని, ప్రవీణ్‌కు టికెట్ ఇస్తే పనిచేసేది లేదని తేల్చి చెబుతున్నారు. పొత్తులో భాగస్వాములైన జనసేన కేడర్ మాత్రం తెలుగుదేశంలో పరిణామాలను చూసి విస్తుపోతోంది.

శ్రీసిటీలో పారిశ్రామిక ప్రగతి, నైపుణ్యాభివృద్ధి భేష్




ప్రసంగిస్తున్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు

శ్రీసిటీ(వరదయ్యపాలెం)/తిరుమల: శ్రీసిటీ పారిశ్రామికవాడలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు అభినందనీయమని మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ప్రశంసించారు. బుధవారం ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం జరిగిన పరిశ్రమల సీఈవోల సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. దశలవారీగా అర్హత కలిగిన మిజోరాం యువతకు ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను కల్పించడం తన ప్రాధాన్యత అంశంగా ఆయన స్పష్టం చేశారు. శ్రీసిటీలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం ఉందన్నారు. గతంలో వెనుకబడిన ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషిని అభినందించారు. కేంద్ర ప్రభుత్వం నినాదమైన ఆత్మ నిర్భర భారత్‌కు మద్దతుగా రక్షణ, అంతరిక్ష రంగాల పరికరాల తయారీ పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించి, అందు కోసం శ్రీసిటీలో ప్రత్యేక జోన్‌ల ఏర్పాటు కోసం పరిశీలించాలని శ్రీసిటీ ఎండీకి గవర్నర్ సూచించారు. అనంతరం మిజోరాం ప్రభుత్వ అధికారుల బృందంతో కలసి డైకిన్ పరిశ్రమను నెలకొల్పిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి అక్కడ నిపుణులతో చర్చించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాలను సందర్శించి విద్యా అవకాశాలు, ఆవిష్కరణలపై అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చలు జరిపారు.

శ్రీవారి సేవలో..

తిరుమల శ్రీవారిని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



ప్రతి ఒక్కరూ కఠినతరమైన పోరాటం చేస్తున్నవారే.
అందుకే మీరు కలిసి అందరితోనూ దయగా వ్యవహరించండి.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 7 మార్చి 2024

నల్ల కోటు... రాజకీయం!

కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ రాజ్యానికి మూలస్తంభాలు. ఇందులో న్యాయ వ్యవస్థ మిగిలిన రెండింటికంటే విశిష్టమైనది. ఎందుకంటే మొత్తం మూడు వ్యవస్థల పరిధులనూ, పరిమితులనూ నిర్ణయించగల, నిర్దేశించగల స్థానం ఆ ఒక్క వ్యవస్థకు మాత్రమే వుంది. ఇతర రెండు వ్యవస్థలతో పోలిస్తే ఇప్పటికీ న్యాయ వ్యవస్థపై ప్రజలకు కొద్దో గొప్పో విశ్వసనీయత వుంది. దానికి విఘాతం కలిగించే పరిణామాలు అడపా దడపా చోటుచేసుకుంటున్న సంగతి కూడా కాదనలేనిది. 175 ఏళ్ల చరిత్ర కలిగిన కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి, ఆ పదవికి రాజీనామా ఇచ్చిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ వైనం అటువంటిదే. తన రాజకీయ రంగ ప్రవేశంపై జస్టిస్ గంగోపాధ్యాయ ఇచ్చిన సంజాయిషీ ఆశ్చర్యం కలిగిస్తుంది. అధికార పక్షమైన తృణమూల్ కాంగ్రెస్ తనను రోజూ దుమ్మెత్తిపోయటం, అసభ్య పదజాలంతో దూషించటం ఆయన తట్టుకోలేకపోయారట. కనుక నల్లకోటు, న్యాయదండం విడిచిపెట్టి ఒక రాజకీయ పార్టీ కండువా కప్పుకోవటమే ఆయనకు పరిష్కారంగా తోచింది! అలా అసభ్య పదజాలంతో దూషించే నేతలకు చదువు సక్రమంగా లేదన్న జస్టిస్ గంగోపాధ్యాయ విమర్శలో నిజం వుండొచ్చు. కానీ ఆయన చదువుసంధ్యలూ, విజ్ఞతా ఏమయ్యాయి? తాను వెలువరించే తీర్పులకు పూలు తప్ప రాళ్లు పడవని ఎలా అనుకున్నారు?

తృణమూల్ సర్కారుపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో జస్టిస్ గంగోపాధ్యాయ కఠినంగా వ్యవహరించారన్న పేరు వుంది. మొత్తం 14 ఉదంతాల్లో ఆయన సీబీఐ దర్యాప్తు జరపాలని ఆదేశించారు. అందులో ఉపాధ్యాయ నియామకాల కోసం పెద్దయెత్తున ముడుపులు చేతులు మారాయన్న స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్సెస్సీ) కేసు ప్రధానమైనది. ఆయన ఉత్తర్వుల కారణంగా 2022లో ఉన్నత విద్యాశాఖమంత్రిగా వున్న పార్థా ఛటర్జీతోపాటు దళారులు, డబ్బులిచ్చి ఉద్యోగాల్లోకొచ్చిన కొందరు టీచర్లు అరెస్టయ్యారు. నిజానికి ఆ కేసులో జస్టిస్ గంగోపాధ్యాయ ఇచ్చిన ఆదేశాలు ఆయనకు పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చాయి. అవినీతిపై నిప్పులు కక్కే యోధుడిగా, సీఎం పదవికి అన్నివిధాలా అర్హతగల వ్యక్తిగా లోక్‌సభ కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధురి అప్పట్లో కీర్తించారు. వామపక్షాలు సైతం ఆయన తీర్పులను ప్రశంసించాయి. కానీ అవి జస్టిస్ గంగోపాధ్యాయ చెవికి సోకినట్టు లేదు. 'న్యాయమూర్తులుగా తమ తీర్పులు నచ్చకపోతే విమర్శించవచ్చు, అప్పీల్‌కు పోవచ్చు. కానీ దూషిస్తారా?' అని ఆయన ప్రశ్నించటం సబబే. కానీ ఆయన చేయాల్సిందేమిటి? దూషణలకు జవాబుగా ఒక రాజకీయ పార్టీ కండువా కప్పుకోవటమా? ఇందువల్ల ఆయనకుగానీ, మొత్తంగా వ్యవస్థకుగానీ విశ్వసనీయత పెరుగుతుందా? నిరుడు జస్టిస్ గంగోపాధ్యాయ తృణమూల్‌ను విమర్శిస్తూ స్థానిక చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దాన్ని తీవ్రంగా తప్పుబట్టి మందలించినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

న్యాయమూర్తి పదవిలో వుంటూ రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేయటం జస్టిస్ గంగోపాధ్యాయతోనే మొదలు కాలేదు. 1967లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కోకా సుబ్బారావుతోపాటు జస్టిస్ రంగనాథ్ మిశ్రా, జస్టిస్ బహరూల్ ఇస్లాం, జస్టిస్ ఫాతిమా, జస్టిస్ సదాశివం, జస్టిస్ రంజన్ గొగోయ్ వరకూ ఎందరో వున్నారు. జస్టిస్ బహరూల్ ఇస్లాం 1983లో అప్పటి బిహార్ పీసీసీ(ఐ) అధ్యక్షుడు జగన్నాథ్ మిశ్రాపై వచ్చిన ఫోర్జరీ, నేరపూరిత ప్రవర్తన ఆరోపణలనుంచి ఆయన్ను విముక్తి చేసిన నెల రోజులకే అస్సాంలో ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చింది. ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. రిటైర్మెంట్ అనంతరం లా కమిషన్, మానవహక్కుల సంఘం, కంపెనీ లా బోర్డు, వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ వంటి సంస్థలకు నేతృత్వం వహించే అవకాశం ఎటూ వుంటుంది. అది కూడా సరికాదని అభ్యంతరం చెప్పేవారున్నారు. రాజీనామా చేసిన వెంటనే బీజేపీలో చేరబోతున్నట్టు ప్రకటించటం, అంతకు వారంరోజుల ముందు ఆ పార్టీ నేతలను సంప్రదించినట్టు చెప్పటం జస్టిస్ గంగోపాధ్యాయ విజ్ఞతపై సందేహాలు రేకెత్తిస్తుంది. ఈ వారంరోజుల్లో కేసులేమీ చూడలేదన్నంత మాత్రాన ఈ సందేహాలు సమసిపోవు. మిమ్మల్ని ముందుగా బీజేపీ నేతలే సంప్రదించారా అన్న ప్రశ్నకు ఆయన లౌక్యంగా 'మేమిద్దరం ఒకరినొకరం సంప్రదించుకున్నాం' అని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ నీతివంతమైన పాలన గురించి ఎవరికీ భ్రమల్లేవు. నాలుగైదేళ్ల క్రితం ముఖ్యమంత్రి మమతా బెనర్జీయే తమ పార్టీలో అవినీతి నేతలు మితిమీరుతున్నారనీ, వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుందనీ హెచ్చరించిన సంగతి అందరికీ గుర్తుంది. ఇలాంటి పరిస్థితి వున్నది గనుకే జస్టిస్ గంగోపాధ్యాయ వెలువరించిన తీర్పులను అనేకులు ప్రశంసించారు. తన రాజకీయ రంగ ప్రవేశ నిర్ణయంతో ఆ తీర్పులపై సందేహాలు తలెత్తటానికి ఆయనే కారకులయ్యారు.

బీజేపీ నేతలు స్వర్గీయ అరుణ్ జైట్లీ, ప్రస్తుత కేంద్రమంత్రి నితీన్ గడ్కరి వంటివారు పదవీ విరమణ తర్వాత జడ్జీలు ఏ పదవీ తీసుకోరాదని అభిప్రాయపడ్డారు. అసలు సీవీసీ పదవికున్నట్టే జడ్జీలకు సైతం రిటైరయ్యాక పదవులు చేపట్టరాదన్న ఆంక్షలుండాలని చాలామంది చెబుతారు. అలా కాకపోయినా కనీసం రెండేళ్లపాటు ఏ పదవీ తీసుకోకుండా వుండటం శ్రేయస్కరం. రాజకీయాలకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల స్థితిలో వుందనే సంకేతం మన దేశ గౌరవాన్ని మరింత పెంచుతుందని అందరూ గుర్తించాలి.

వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

విశ్లేషణ



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

వికేంద్రీకరణ అనేది ఆధునిక ప్రజాస్వామిక సూత్రం. అభివృద్ధి అనేది ఒక్కచోటు గంపగుత్తగా పోగుపడటం అనేది ప్రాంతాల మధ్య అసమానతలను పెంచుతుంది. అభివృద్ధి వికేంద్రీకరణతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో అమరావతి ప్రాజెక్టును రద్దు చేయాలని వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావించడం సముచితమైన నిర్ణయం. అయితే, చాలామంది గుర్తించాల్సినది... ప్రజలతో కూడిన అమరావతి వేరు, నూతన నగర నిర్మాణం కోసం తలపెట్టిన అమరావతి ప్రాజెక్టు వేరు. చండీగఢ్, నయా రాయ్‌పూర్, లవాసా, నోయిడాల అనుభవంతో చూస్తే కొత్త నగర నిర్మాణాలకు ఉన్న పరిమితులు అర్థం అవుతాయి. పది లక్షల జనాభా దాటిన గుంటూరు, విజయవాడలకు సంబంధం లేకుండా, రెండు నగరాలకు 30–40 కిలోమీటర్ల దూరంలోనే మరో కొత్త నగరం అనేది ఊహకందదు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, గోదావరి జిల్లాల ప్రయోజనాలను పణంగా పెట్టి... పరిమిత ప్రయోజనాల కోసం దీన్ని చేపట్టడం అర్థరహితం. అందుకే అమరావతి ప్రాజెక్టును రద్దు చేయడం రాష్ట్ర ప్రజలందరూ స్వాగతించాల్సిన నిర్ణయం.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి... విశాఖపట్నం కేంద్రంగా రాజధాని, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అంశంపై మరోమారు కీలక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనపై సమగ్ర చర్చ చేయాల్సి ఉంది.

అమరావతి వేరు, అమరావతి ప్రాజెక్టు వేరు...

అమరావతి ప్రాంతాన్నీ, అమరావతి ప్రాజెక్టునూ వేరువేరుగా చూడాలి. అమరావతి ప్రాంతం అంటే అక్కడి ప్రజలు. అమరావతి ప్రాజెక్టు అనేది కొత్త నగర నిర్మాణం పేరుతో రూపొందించినది. అమరావతి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మాట్లాడేవారిని గుండు గుత్తగా వ్యతిరేకించడం నేడు జరుగుతున్న తప్పుడు ప్రచారం. చెప్పాలంటే నిజానికి ప్రస్తుత రాజధాని నిర్మాణం జరుగుతున్నది అమరావతిలో కాదు, వెలగపూడిలో.

అమరావతి ప్రాజెక్టు అందరిదా?

అమరావతి ప్రాజెక్టు రూపాన్ని పరిశీలిస్తే... ఎంపిక చేసుకున్న ప్రాంతంలో స్థూలంగా 20 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. అదనంగా రైతుల నుంచి మరో 33 వేల ఎకరాల భూమి తీసుకున్నారు. అందుకు ప్రతిగా అక్కడి రైతులకు ఒకేసారి 1.50 లక్షల రుణమాఫీ చేశారు. కాగా, రాష్ట్రం మొత్తం రైతులకు 5 దఫాలుగా 50 వేల రూపాయలు మాత్రమే మాఫీ చేయడం ఈ సందర్భంగా గమనార్హం. ఇక, ప్రతి ఏటా ఎకరాకు 50 వేలు కౌలుగా అమరావతి ప్రాజెక్టు రైతులకు చెల్లించాలి. ప్రతి ఏటా మొత్తంలో 10 శాతం పెంచుకుంటూ, 10 సంవత్సరాల పాటు ఇవ్వాలి. కేవలం ప్రతి ఏటా చెల్లించే కౌలు మాత్రమే 165 కోట్ల రూపాయలు. దీనికి ప్రతి ఏటా 10 శాతం అదనంగా పెంచి ఇవ్వాలి. అభివృద్ధి చెందిన రాజధానిలో మూడవ వంతు తిరిగి ఇవ్వాలి. అంటే ఒక లక్ష ప్లాట్‌లు అన్నమాట! స్థూలంగా అక్కడి రైతులకు 11 వేల ఎకరాల భూమి అభివృద్ధి చెందిన రాజధానిలో ఉంటుంది. అంటే మొత్తం 50 వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన రాజధానిలో ప్రభుత్వ భూమి పోను, మిగిలిన భూమి అంతా ఆ 19 గ్రామాలకు చెందిన ప్రజలకు మాత్రమే చెందినదిగా ఉంటుంది. అలాంటి రాజధాని 5 కోట్ల మంది ప్రజలది ఎలా అవుతుంది?

ఇది ఆచరణలో సాధ్యమా?

గత తెలుగుదేశం ప్రభుత్వం రూపొందించిన రాజధాని ప్రాజెక్టు ఆచరణలో సాధ్యమా? ఎందుకు ఈ అనుమానం వస్తున్నదీ అంటే... రాజధాని కార్యాలయాలు ఉండటం వేరు, కొత్త నగర నిర్మాణం చేపట్టడం వేరు. దేశంలో కొత్త నగర నిర్మాణాల రూపు రేఖలు పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. చండీగఢ్, నయా రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), లవాసా (మహారాష్ట్ర), నోయిడా (ఉత్తరప్రదేశ్)ల అనుభవంతో చూస్తే కొత్త నగర నిర్మాణాలకు ఉన్న పరిమితులు అర్థం అవుతాయి. 10 లక్షల జనాభా దాటిన గుంటూరు, విజయవాడలకు సంబంధం లేకుండా, రెండు నగరాలకు 30–40 కిలోమీటర్ల దూరంలోనే మరో కొత్త నగరం, అందులోనూ హైదరాబాద్ స్థాయి నగరాన్ని నిర్మించడం అనేది ఊహకందదు. అందుకే నగర నిర్మాణంలో విశేష అనుభవం ఉన్న శివరామకృష్ణన్... అమరావతి ప్రాజెక్టు కోసం రాష్ట్ర వనరులను, శక్తి సామర్థ్యాలను వెచ్చించడం అంటే ఆత్మహత్యా సదృశ్యం అవుతుందని హెచ్చరించారు.



నూతన నగరం అవసరమేనా?

5 కోట్ల పై చిలుకు జనాభా కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్ని నగరాలు ఉంటాయి? ఇప్పటికే విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు లాంటి ఎనిమిది నగరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరో నగరం నిర్మించడం సాధ్యమేనా?

కొత్త నగరాన్ని కోరుకుంటున్నవారు చెపుతున్నది పెట్టుబడులను ఆకర్షించాలని. రాష్ట్రంలో ఐటీ కంపెనీల కోసం తిరుపతి, హిందూపురం అత్యంత అనువయిన ప్రాంతాలు. పారిశ్రామిక అవకాశాలకు విశాఖ, కాకినాడ, శ్రీసిటీ లాంటివి అందుబాటులో ఉన్నాయి. స్వల్ప ఖర్చుతో ఈ నగరాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. వీటిని పక్కనపెట్టి... ఉత్తరాంధ్ర, రాయలసీమ, గోదావరి జిల్లాల ప్రయో జనాలను పణంగా పెట్టి... అత్యంత వ్యయ ప్రయాసలతో, పరిమిత ప్రయోజనాల కోసం, పాలకుల వ్యక్తిగత అవసరాల (పేరు ప్రతిష్ఠలు) కోసం చరిత్రలో నిలిచిపోయే రాజధాని నిర్మాణం చేపట్టడం ప్రమాదకరం.

ఆధునిక నగరాలుగా విశాఖ, తిరుపతి

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాంతాల స్వభావాన్ని అర్థం చేసుకుంటే... విశాఖపట్నం, తిరుపతి మహా నగరాలుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని తెలుస్తుంది. విశాఖ ఇప్పటికే మహానగర ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. ఆ తర్వాత ఈ అవకాశం తిరుపతికి ఉన్నది. చెన్నై, బెంగుళూరు మహానగరాలకు అత్యంత సమీపంలో తిరుపతి ఉన్నది. వాతావరణ సమతుల్యత ఉన్న తిరుపతి... ఐటీ కేంద్రంగా ఆధునిక అవకాశాలను అందిపుచ్చుకుంటుంది. చెన్నై వరదలు వచ్చినప్పుడు తిరుపతికి ఉన్న సానుకూలాంశాలు ఏమిటో అర్థమయ్యాయి. శ్రీసిటీ విజయవంతం కావడాన్ని పరిగణన లోకి తీసుకొని విశాఖ, తిరుపతిలను ఆధునిక అవకాశాలను అంది పుచ్చుకునే విధంగా మహానగరాలుగా అభివృద్ధి చేయాలి.

అందుకే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రతిబంధకంగా మారిన అమరావతి ప్రాజెక్టును రద్దు చేయాలని వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించడం సముచితమైన నిర్ణయం. రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కొత్తగా మహానగర నిర్మాణ ఆలోచనను పక్కన పెట్టాలి. రాజధానితో సహా అభివృద్ధి, నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలి. వీటికి కేటాయింపులు జరిపి, సత్వర పూర్తికి చర్యలు తీసుకోవాలి. మొత్తం ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవడం, అమలు చేయడం లాంటి విషయాల్లో గత తెలుగుదేశం ప్రభుత్వం లాగా కాకుండా... ప్రజాస్వామ్య పద్ధతిలో అందరి అభిప్రాయాలను, అభిమతాలను పరిగణనలోకి తీసుకోవాలి. హేతుబద్ధ నిర్ణయం తీసుకొని సమతుల్యతతో కూడిన సమగ్రాభివృద్ధికి బాటలు వేయాలి.

వ్యాసకర్త 'రాయలసీమ మేధావుల ఫోరం' సమన్వయకర్త, తిరుపతి । మొబైల్: 94904 93436

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అద్భుత మెట్రో



ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన భారతదేశ మొట్టమొదటి అండర్‌వాటర్ మెట్రో మన ఇంజినీర్లు, కార్మికులు సాధించిన అద్భుతమైన కార్యం. దాన్ని హుగ్లీ కిందుగా వెళ్తూ హౌరా, కోల్‌కతాను అనుసంధానించే మెట్రోగా మాత్రమే చూడొద్దు. భారత్‌ను రూపాంతరీకరిస్తున్న ఎన్నో సూపర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ఒకటిగా చూడాలి.

– కంచన్ గుప్తా, కేంద్ర ప్రభుత్వ సలహాదారు

మంచి చర్య



నీటిని వృథా చేసేవాళ్లకు బెంగళూరులోని హౌజింగ్ సొసైటీలు 5,000 రూపాయల జరిమానా విధిస్తున్నాయని వార్త. నీళ్లే పూజనీయం, నీళ్లే జీవితం. మనం నీటికి చెందుతాం, నీళ్లు మనకు చెందవు. నీటిని సంరక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలి.

– శేఖర్ కపూర్, దర్శకుడు

స్వీయ విమర్శ అవసరం



తమ వెనుకబాటుతనానికి ముస్లింలు ఎంతకాలం ఇతరులను బాధ్యులుగా చేస్తారు? పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, చాలా అరబ్ దేశాల్లోని ముస్లింలను ఎవరు వెనక్కి ఉంచుతున్నారు? ఇజ్రాయెలా, ఆరెస్సెసా? వాళ్ల దృక్పథమే దానికి కారణం. తమ విద్య, సామాజిక వెనుకబాటుతనానికి వాళ్లు తమలోకి తాము చూసుకోవాలి.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్‌ఎల్‌డీ జాతీయ ఉపాధ్యక్షుడు

వ్యాపార బంధం



ఇండియా ప్రతిరోజూ 50 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటోంది. అందులో రష్యా నుంచి రోజుకు 10 నుంచి 14 లక్షల బ్యారెళ్లను పొందుతోంది.

– వెలినా త్చకరోవా, విశ్లేషకురాలు

అన్నీ రాయనివ్వాలి!



పుస్తకాలను అమ్మే వ్యాపారంలో ఉన్నవాళ్లు పుస్తకాలను అమ్మాలి. లోడుల కొద్దీ పుస్తకాలు, రకరకాల పుస్తకాలు అమ్మాలి. అంతేగానీ ఫలానా రకం అమ్ముడుపోతాయని వాళ్లు రచయితలకు చెప్పొద్దు. దానికి బదులుగా కొత్త మార్కెట్లు ఎక్కడున్నాయో అన్వేషించాలి.

– అన్నే జైదీ, రచయిత్రి

ఇన్ బాక్స్

సమకాలీన కఠోర సత్యం

ఫిబ్రవరి మూడవ వారంలో అమెరికా విదేశీ సంబంధాల 'సమాచార చిత్రాలు' విడుదలయ్యాయి. అవి రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు అంతర్జాతీయ మద్దతును వెల్లడించాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఉక్రెయిన్‌కు అందించిన సహాయాన్ని ఇవి వివరిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు 7,430 కోట్ల డాలర్ల సాయం అందిస్తూ, సాయం చేసే దేశాల్లో అగ్రస్థానంలో ఉంది అమెరికా. ఈ సాయంలో సైనిక సాయం 4,630 కోట్ల డాలర్లు. 40కి పైగా దేశాలు ఉక్రెయిన్‌కు సాయంగా నిలిచాయి. వాటిలో ఎక్కువ నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సభ్యులూ, అమెరికా సైనిక మిత్రదేశాలే. ఉక్రెయిన్‌కు ఇంత ఉదారంగా మద్దతు ఇవ్వడానికి అమెరికాకు నిధులు ఎక్కడివి?

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం యూరోపియన్ దేశాల్లో, ముఖ్యంగా నాటో దేశాల్లో ఆయుధ పోటీని రేకెత్తించింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలను ఇచ్చిన తర్వాత ఆ దేశాలు తమ ఆయుధశాలలను తిరిగి నింపుకోవాలి. అందుకు ఆయుధాలను కొనాలి. ఆయుధాల తయారీ బహుళజాతి సంస్థలు అమెరికాలో ఎక్కువగా ఉన్నాయి. అన్ని దేశాలూ అమెరికా నుండే ఆయుధాలు కొనాలి. ఇందులో అమెరికా సైనిక మిత్రదేశాలన్నీ ఒకే పడవలో ఉన్నాయి. పోలండ్, జపాన్, దక్షిణ కొరియా, చైనా–తైవాన్ ద్వీపం వంటి మిత్రదేశాలు ఆయుధాల ప్రధాన కొనుగోలుదార్లు.

ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. వీటి వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అమెరికా ప్రమేయం ఉంది. ఆ యా దేశాలకు అమెరికా తన ఆయుధాలను అమ్మి సొమ్ముచేసుకోవాలనే లక్ష్యం ఇందుకు కారణం. 2023లో అమెరికా ప్రభుత్వం 8,100 కోట్ల డాలర్ల ఆయుధాలను అమ్మింది. ఇది 2022 అమ్మకాల కంటే 56 శాతం ఎక్కువ. అమెరికా తన వ్యూహాత్మక పొత్తులను కొనసాగిస్తూనే, ఒక చేత్తో ఆయుధాలను అందించి, మరో చేత్తో వాటిని అమ్మే కళను మెరుగుపరుచుకొంది. యూరోపియన్ మిత్రదేశాలను తిరిగి ఆయుధాలతో సిద్ధం చేయడం ద్వారా, ఉక్రెయిన్ సైనిక ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం ద్వారా, అమెరికా రక్షణరంగ పరిశ్రమ, దాని అనుబంధ రంగాల పరిశ్రమలలో ఉపాధి బాగా పెరిగింది. అమెరికా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచింది.

అంతరిక్ష, రక్షణరంగాల పరిశ్రమలు అమెరికా అంతటా 21 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించాయి. అమెరికా ఆయుధ విక్రయాలు దాని శత్రువినాశ లక్ష్యానికి వ్యూహాత్మకంగా సహకరిస్తాయి. అదే సమయంలో దేశంలో ఉద్యోగితా స్థాయిని పెంచి ఆర్థిక పటుత్వానికీ కారణమవుతాయి. అందుకే ఉక్రెయిన్‌కు చేస్తున్న సైనిక సహాయాన్ని అమెరికా ఆపలేదు. అలా చేస్తే అది అమెరికా వ్యూహాత్మక వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీస్తుంది. ఇది భయంకర వాస్తవం. ఎక్కువ దేశాలలో సంఘర్షణలు అమెరికాలో ఎక్కువ ఉద్యోగాలను సృష్టిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా శాంతికి భంగం కలిగిస్తాయి. ఇది సమకాలీన కఠోర సత్యం!

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, గుంటూరు

మెకార్తీయిజం–ఎల్లో జర్నలిజం

అభిప్రాయం



పి. విజయబాబు


హిట్లర్ ప్రభుత్వంలో ప్రసార మంత్రిత్వశాఖను నిర్వహించిన 'జోసెఫ్ గోబెల్స్' పేరు అబద్ధపు ప్రచారాలకు పర్యాయ పదమై నిలిచింది. జనంలో ప్రచార మాధ్యమం ఎంత బలమైనదో అర్థం చేసుకున్నాడు జోసెఫ్ గోబెల్స్. వ్యక్తి (హిట్లర్) ఆరాధన పెంపొందించడానికీ, ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేయడానికీ, తప్పుడు వార్తలను నిజాలుగా నమ్మించడానికీ ప్రచార, ప్రసార మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగించాడు గోబెల్స్. తదనంతర కాలంలో దారుణంగా అపఖ్యాతి పాలయ్యాడు. అప్పటినుంచి ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే దానిని 'గోబెల్స్' ప్రచారంగా అభివర్ణించడం పరిపాటి అయింది.

తెలుగు నాట గోబెల్స్ వారసులు బయల్దేరి అచ్చం గోబెల్స్ వలె చంద్రబాబు, లోకేష్ బాబుల ఇమేజ్ పెంచడానికి, జగన్ మోహన్ రెడ్డిపై విష ప్రచారం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.

అయితే ఇప్పుడు ఈ దిగజారుడు జర్నలిజంలో గోబెల్స్‌ను మించి, కొత్త అంకానికి తెరతీశారు. అదే 'మెకార్తీయిజం'. అర్థంలేని భయాలను సృష్టించి జనాల్ని కలవరపాటుకు గురి చేయడం, తమ ప్రత్యర్థులను జనాలకు భూతద్దంలో చూపి భయపెట్టడం, తాము నమ్ముకున్న వాళ్లను రక్షకులుగా చూపించడం మెకార్తీ జర్నలిజం.

అసలేమిటీ 'మెకార్తీ జర్నలిజం' అని రేఖామాత్రంగా పరిశీలిస్తే చంద్రబాబు అను'కుల' మీడియా ప్రచారాల తంతు అర్థం అవుతుంది. 1950వ దశకంలో అమెరికా సెనేటర్ జోసెఫ్ మెకార్తి కమ్యూనిజాన్ని బూచిగా చూపిస్తూ, కమ్యూనిస్టులపై పోరాడే అలుపెరుగని వీరుడిగా ఆదిలో పేరుగాంచాడు. అయితే ఆ తర్వాత జనం చీత్కారాలకు గురై రాజకీయాల నుంచి బహిష్కృతుడయ్యాడు.

అమెరికా–రష్యాల మధ్య ఆధిపత్య పోరు నడిచిన రోజులవి. ఆ సమయంలో మెకార్తి మీడియాలో కమ్యూనిస్టులు దేశంలోకి చొరబడ్డారని భయపెట్టి వార్తలు విస్తృతంగా ప్రచారం చేసేవాడు. తనకు గిట్టని వాళ్లను 'అన్ అమెరికన్' అని ముద్ర వేశాడు. అతడి శాడిజానికి నిజాయితీగా పనిచేసే జర్నలిస్టులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అతడు పని చేసిన కాలాన్ని 'రెడ్ స్కేర్' అని పిలిచేవారు. లేని దాన్ని ఉన్నట్టు బీభత్సంగా ప్రచారం చేసే జర్నలిజం 'మెకార్తీయిజం'గా పేరుపడింది. ఇప్పుడు మన తెలుగు నాట చంద్రబాబునాయుడి మీడియా బృందం చేస్తున్నది అదే!



'కామెంట్ ఈజ్ ఫ్రీ' బట్ ట్రూత్ షుడ్ బీ శాక్రెడ్' అంటాడు సంపాదకీయాలకు ఓంప్రథమంగా శ్రీకారం చుట్టిన ప్రఖ్యాత సంపాదకుడు థామస్ బార్న్స్. కానీ ఈ సూత్రానికి తెలుగునాట ఒక వర్గం మీడియా ఎప్పుడో తిలో దకాలు ఇచ్చింది. వ్యాఖ్య ఏదైనా చేయవచ్చు. అందులో సత్యం ముత్యం అంత స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి అని బార్న్స్ చెప్తే, 'వ్యాఖ్య ఏదైనా చేసెయ్! అందులో వాస్తవాలతో పని లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనం ఉండాలి. మాంచి మసాలా దట్టించిన గుత్తి వంకాయ కూరలాగా, ఇంకా ఘాటుగా ఉండాలంటే చికెన్ 65 లాగా స్టోరీ వండాలి. ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్ శెహ బాష్! అనే విధంగా ఉండాలి. వార్త వేరు వ్యాఖ్య వేరు అనుకోవద్దు. ఇప్పుడు మన పాలసీలో వ్యాఖ్యే వార్త' అనే ఆదేశాలు ఇచ్చే స్థితికి దిగజారాయి బాబు భజన బృందాలు. వేయవలసిన వార్తలు ఉంటే లోపలి పేజీలో సింగిల్ కాలమో, డబుల్ కాలమో వేయాలి. 'కిక్ ఇచ్చే వంటకాలే బ్యానర్ స్టోరీలు'... ఇదే నయా జర్నలిజం.

అయితే ప్రజలకు ఏది నిజం, ఏది అబద్ధం అనేది ఎప్పుడో అర్థమై పోయింది. అందుకే చంద్రబాబు నాయుడుని 23 సీట్లకు పరిమితం చేశారు. అర్థం కానిదల్లా చంద్రబాబు నాయుడికీ, ఆయన తనయుడు లోకేష్‌కే!

అసత్య ప్రచారాలకు మోసపోయే అపరిణత మనస్కులు కారు మన ఆంధ్రులు అని మరొకసారి చాటి చెప్పే సమయం ఆసన్నమైంది. అందుచేత నయా గోబెల్స్‌లను, మెకార్తీలను తరిమికొట్టడానికి 'సిద్ధం' కండి! టీడీపీ దోపిడీకి శాశ్వతంగా వీడ్కోలు పలకండి.

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

లయకారుడు శివరూపుడు

శివతత్త్వం అమేయం. 'ఇంత'ని కొలిచి చెప్పలేనిది. పర్వతమంత కాటుకను సముద్రమంత నీటి పాత్రలో ముంచి, సిరా తయారుచేసి, భూమియంత కాగితం పెట్టుకొని, కల్పవృక్షం కొమ్మను కలంగా అమర్చుకొని, మాటల కోసం తడుముకో నక్కరలేని వాగ్దేవి సరస్వతి స్వయంగా కూర్చొని అదేపనిగా ఎల్ల కాలమూ రాస్తూ వెళ్ళినా, సాంబశివుడి మహిమను సమగ్రంగా వివరించడం సాధ్యం కాదు – అంటుంది 'శివమహిమ్న స్తోత్రం'.

'శివ' అంటే మంగళం, శుభం అని అర్థం. 'శం'–కరుడు అంటే ఆనందాన్నీ, శ్రేయస్సునూ, సౌభాగ్యాన్నీ ఇచ్చేవాడు. ప్రళయ కాలంలో ప్రాణికోటినంతా లయం చేసే ఫాలాక్షుడిని, భస్మలేపనంతో దిగంబరుడిగా శ్మశాన సీమలలో సంచరించే కామారిని 'శివుడు', 'శంకరుడు' అనడం ఏమి సబబు? వేదాంత దృష్ట్యా, మృత్యువులో భయంకరమూ, అమంగళమూ, అపవిత్రమూ ఏమీ లేదు. జనన మరణాలు దేహానికి మాత్రమే తప్ప దేహికి లేవు. తాత్కాలికంగా ధరించిన ఒక దేహం జీర్ణమైపోతే, దేహి దాన్ని వదిలేసి మరొక కొత్త దేహాన్నీ నామరూపాలనూ పొందుతాడు. మాసి, వెలిసి, చిరిగిన వస్త్రాన్ని మార్చి, నూతన వస్త్రాన్ని ధరించడంలో అమంగళమేముంది? కాబట్టి పునఃసృష్టికి దోహదం చేసే లయకారుడు, 'శివ' రూపుడే.



జ్యోతిర్మయం

అదీగాక, శివుడు భక్తవత్సలుడు. భక్తుడు చేతులు జోడించి తనను ఏది కోరినా ఇస్తాడు, బిడ్డ కోరితే తల్లి ఆటవస్తువులను ఇచ్చినట్టు. ఈ ఆటవస్తువులిచ్చే ఆనందం క్షణికమనీ, వీటివల్ల దీర్ఘకాల ప్రయోజనం లేదనీ తల్లికి తెలుసు. బిడ్డకు తెలియదు. అమాయకత్వం, అజ్ఞానం పోయి, పరిణతి వచ్చినప్పుడు తెలుస్తుంది. శివుడు ప్రాపంచిక సుఖాలనే ఆటబొమ్మలను కోరేవారికి వాటినీ ఇస్తాడు. వాళ్ళకు పరిణతి కలిగి, క్షణికాల మీద విరక్తి వచ్చి, మోక్ష సుఖం కోరితే దాన్నీ ఇస్తాడు. ఇహ పర శ్రేయస్సు ఇచ్చేవాడు కనక ఆయన 'శం'–కరుడు.

అడిగిన వాళ్ళకు అష్టైశ్వర్యాలిస్తూ, తను మాత్రం అత్యంత నిరాడంబరంగా, ఆత్మారాముడై, నిత్య, నిరతిశయ, నిరవధిక ఆనందమయుడై ఉండడం వెనక విశేషమేమిటి? 'కోరితే ప్రాపంచిక సుఖాల వరాలిస్తాను కానీ అసలైన ఆనందం కోరికలు లేని స్థితి లోనే' అని సదాశివుడి సందేశం. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే గనక, మహాశివరాత్రి సందర్భంగా మనఃపూర్వకమైన నమస్కారం మాత్రం శివార్పణం చేద్దాం. దాంతో పాటు మారేడు దళమూ, దోసెడు నీళ్లూ. ఓం నమశ్శివాయ! (రేపు మహాశివరాత్రి)

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.10.23 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.49 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.38 నుండి 3.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.13 నుండి 11.01 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృత ఘడియలు:** రా.10.43 నుండి 12.12 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.19, **సూర్యాస్తమయం:** 6.03.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆటో ఇచ్చి ఆదుకున్నారు



మాది పేద కుటుంబం. విజయనగరం జిల్లా వంగర మండలం మగ్గూరు గ్రామంలో కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. వ్యవసాయ, ఉపాధి హామీ పనులు లేని సందర్భాల్లో ఇంటి వద్దనే ఖాళీగా ఉండాల్సి వచ్చేది. నా భర్త రాజు ఆటో నడుపుతూ రోజు వారీ కూలి డబ్బులు తెచ్చేవాడు. నాకూ ఆటో డ్రైవింగ్ రావడంతో నేనూ దానిని నడిపి కొంత ఆదాయం తెచ్చేదాన్ని. ఏడాది క్రితం ఆటో పాడైపోవడంతో మూలకు చేరింది. దాన్ని బాగు చేయించుకునే స్తోమత లేకపోవడంతో వెలుగు అధికారులకు సమస్య తెలిపాను. వారు స్పందించి మహిళాశక్తిలో భాగంగా ఉన్నతి పథకం ద్వారా వడ్డీలేకుండా రూ.3.30 లక్షలు విలువ చేసే ఆటోను మంజూరు చేశారు. దానిని నడుపుకుంటూ రుణాన్ని తీర్చుకుని కుటుంబ పోషణ గావిస్తున్నాను. వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.పది వేల వంతున నాలుగేళ్లపాటు వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు పదివేలు, సున్నావడ్డీ పథకం ద్వారా కొంత మొత్తం వచ్చింది. ఈ విధంగా జగనన్న మా కుటుంబానికి బతుకునిచ్చి నిలబెట్టారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది.

– సిర్లి అశ్విని, మగ్గూరు

(తూముల మహేశ్వరరావు, విలేకరి, వంగర)

బతుకు భయం తీరింది



చిరు వ్యాపారంతో జీవనం గడుపుతున్న మా కుటుంబంపై విధి చిన్నచూపు చూసినా.. ప్రభుత్వం కనికరించింది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద కాపవరంలో మా ఆయన బజ్జీలు అమ్ముతూ చిరు వ్యాపారం చేసేవాడు. గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతితో కుటుంబం గడిచేదెలాగా అనుకుని ఆందోళన చెందా. సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు అండగా నిలిచాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ. 18,750లు వంతున, వైఎస్సార్ఆసరా కింద ఏడాదికి రూ. 15వేలు వంతున రావడంతో మాకు ఆర్థిక సమస్యలు తీరాయి. వితంతు పింఛను వెన్నుదన్నైంది. ఇంటి పనులు చూసుకుంటూనే కూలి పనికి వెళ్లి కొంత సంపాదిస్తున్నాను. నాకు పదోతరగతి చదువుతున్న కుమార్తె ఉంది. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున అందుతోంది. స్కూల్ యూనిఫాం, విద్యా సామగ్రి ప్రభుత్వమే అందజేయడంతో పాప చదువుకు ఇబ్బంది తొలగింది. ఇప్పుడు మా ఆర్థిక కష్టాలు తీరాయి.

– పెద్ద హైమావతి, పెదకాపవరం

(వి.ఆర్.కోటేశ్వరరావు, విలేకరి, ఆకివీడు)

సర్కారు అండతో నిలదొక్కుకున్నాం



మాది పేద కుటుంబం. నేను, అమ్మ నాగలక్ష్మమ్మ, కుమార్తె సుమాంజలి కలసి శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో ఉంటున్నాం. కుటుంబ పోషణ నిమిత్తం ఆటో నడుపుతున్నా. టీడీపీ ప్రభుత్వ హయాంలో మాకు ఎలాంటి పథకాలూ అందలేదు. అప్పట్లో బతుకు భారంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగనన్న అండతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా అమ్మ నాగలక్ష్మమ్మ పేరు మీద తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం వచ్చింది. ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరైంది. మా అమ్మకు వితంతు పింఛన్ రూ.3 వేలు వస్తోంది. తోపుడు బండిపై కూరగాయలు అమ్ముతున్నందుకు జగనన్న తోడు పథకం కింద ఏటా రూ.10 వేలు రుణం ఇస్తున్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున అందింది. నాకు ఆటో ఉండడం వల్ల వాహనమిత్ర కింద ఏడాదికి రూ.10 వేల చొప్పున అకౌంట్లో జమ చేశారు. కుమార్తెకు 'అమ్మఒడి' ఇస్తున్నారు. కుమార్తె ప్రస్తుతం సంజీవపురం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుకుంటోంది. ఆమె చదువుపై మాకెలాంటి బెంగ లేదు. మాలాంటి పేదలు ప్రశాంతంగా బతికేందుకు అవసరమైన వాటన్నింటినీ జగనన్న ప్రభుత్వం సమకూరుస్తోంది. జగనన్నకు మా కుటుంబం అంతా రుణపడి ఉన్నాం.

– గణాచార్ల శ్రీరాములు, బత్తలపల్లి

(మదనాపు రామాంజనేయులు, విలేకరి, బత్తలపల్లి)

టీడీపీ నేత బరితెగింపు

30 ఎకరాల పెన్నా పోరంబోకు భూముల్లో ప్లాట్లువేసి విక్రయాలు

- ఇప్పటికే రూ.15 కోట్లు సొమ్ము చేసుకున్న వైనం
- ఇప్పుడు పేదలకు పంచుతున్నట్లు నాటకం
- స్థలాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు



హద్దు రాళ్లను తొలగిస్తున్న జేసీబీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడులో టీడీపీ నేత కబ్జాచేసిన పెన్నా పోరంబోకు భూములను బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 30 ఎకరాలు ఆక్రమించి దాదాపు 1,400 ప్లాట్లు వేసిన ఆ నేత ఇప్పటికే కొన్ని అమ్మి రూ.15 కోట్లు సొమ్ముచేసుకున్నారు. మిగిలిన ప్లాట్లను పేదలకు పంచుతున్నానంటూ చీటీలు పంపిణీ చేశారు. స్థానికుల ఫిర్యాదుతో వచ్చిన రెవెన్యూ, జలవనరులశాఖల అధికారులు.. పోలీసుల సహకారంతో ఆ భూమిని స్వాధీనం చేసుకుని జేసీబీతో హద్దురాళ్లను తొలగించారు. కోడూరుపాడుకు చెందిన టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 550, 411, 435, 538, 39, 40లోని 30 ఎకరాల పెన్నా పోరంబోకు స్థలంపై కన్నేశారు. దీన్లో కొంత భూమిని గతంలో దళితులకు డి–ఫారం పట్టాగా పంపిణీ చేశారు. వారు ఆ భూముల్ని సాగుచేసుకుంటున్నారు. ఇక్కడ ఎకరా ధర రూ.రెండుకోట్ల వరకు ఉంది. ఈ మొత్తం భూమిని ఆక్రమించిన కమలాకర్‌రెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేస్తానని గత ఏడాది అందరినీ నమ్మించారు. రోడ్లు ఏర్పాటుచేసి దాదాపు 1,400 ప్లాట్లతో లే అవుట్ వేశారు. కొన్ని ప్లాట్లను రూ.రెండులక్షల నుంచి రూ.నాలుగు లక్షలకు విక్రయించి దాదాపు రూ.15 కోట్లు సొమ్ము చేసుకున్నారు. తాజాగా మిగిలిన ప్లాట్లను పేదలకు పంపిణీ చేస్తానంటూ చీటీలు అందజేశారు. చీటీలు అందుకున్నవారిలో ఆయన అనుచరులు, వారి సంబంధీకులే 300 మంది వరకు ఉన్నట్లు తెలిసింది.

కొనుగోలుదారుల ఆందోళన

పెన్నా పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేశారన్న సమాచారం అందుకున్న రెవెన్యూ, జలవనరులశాఖల అధికారులు బుధవారం అక్కడికి చేరుకున్నారు. పోలీసుల సహకారంతో ప్రభుత్వస్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణదారులపై చర్యలకు ఉపక్రమించారు. టీడీపీ నేత వద్ద రూ.నాలుగు లక్షలకు ప్లాట్లను కొనుగోలు చేశామని, తమ పరిస్థితి ఏమిటంటూ అక్కడ పదిమంది ఆందోళన చేశారు. ఏదైనా ఉంటే ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసే హక్కు ఎవరికీలేదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో వారు వెనుదిరిగారు.

కాపుల డిక్లరేషన్ ఎప్పుడు పవన్?

- బీసీలకు ప్రకటించిన హామీలను కాపులకూ ప్రకటించాల్సిందే..
- మాజీ ఎంపీ హరిరామజోగయ్య లేఖాస్త్రం



జోగయ్య రాసిన లేఖ

పాలకొల్లు సెంట్రల్: జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు జయహో బీసీ అంటూ పది హామీలతో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు సరే.. మరి కాపుల డిక్లరేషన్ ఎప్పుడు ప్రకటిస్తారని మాజీ ఎంపీ, రాజకీయ విశ్లేషకుడు చేగొండి హరిరామజోగయ్య ప్రశ్నించారు. బుధవారం 'జయహో కాపూస్ జయహో బీసీస్' అంటూ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ సరే, కాపుల డిక్లరేషన్ ఎప్పుడంటూ జోగయ్య ఓ లేఖ విడుదల చేశారు. 52 శాతం ఉన్న బీసీలకు డిక్లరేషన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గ విషయమేనని, కాపులకూ డిక్లరేషన్ ఎప్పుడు ప్రకటిస్తారో కూడా తెలియజేయాల్సిందని సూచించారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో చంద్రబాబు, పవన్‌లు బీసీ డిక్లరేషన్ పేరుతో 10 ఎన్నికల హామీలిచ్చారని, ఇందులో పవన్ తన వంతుగా బీసీలకు రాజ్యాధికారం దక్కేలా.. యాచించే స్థితి నుంచి శాసించే స్థితికి తెస్తానంటూ 11వ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అదే విధంగా 25 శాతం ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్తుల ఆర్థిక సామాజిక పరిస్థితులపైనా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ–జనసేన కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ప్రకటించిన హామీలతో సమానంగా కాపులకూ ప్రకటించాల్సిందేనన్నారు. ఇదిలా ఉండగా, మదనపల్లికి.. శ్రీరామ రామాంజనేయులు, తిరుపతి.. ఆరణి శ్రీనివాస్, రాజంపేట.. ఎంవీ రావు, అనంతపురం.. టీసీ వరుణ్, పుట్టపర్తి.. శివశంకర్, తంబళ్లపల్లి కొండా నరేంద్ర, గుంతకల్లు.. మణికంఠకు కేటాయించాలని సూచిస్తూ పవన్‌కు జోగయ్య మరో లేఖ రాశారు.

ఇలాంటివన్నీ రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్సీ, ఎస్టీల కుల, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, నవరత్నాల లోగో ముద్రించడాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించి, వాటిని ముద్రించకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ ధ్రువీకరణ పత్రాల మీద ముఖ్యమంత్రి ఫొటో, నవరత్నాల లోగో ముద్రిస్తున్నారని, వాటిని పరిశీలించాలని కోర్టును కోరారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం.. ధ్రువీకరణ పత్రాలపై సీఎం ఫొటో, నవరత్నాల లోగో ఉంటే నష్టం ఏముందని ప్రశ్నించింది. అసలు పిటిషనర్ ఎవరని ఆరా తీసింది. పిటిషనర్ ఎస్సీ, ఎస్టీ, సంఘం అధ్యక్షుడని రవిప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి ఫొటో, లోగో వల్ల ఎన్నికల సమయంలో ప్రజలు ప్రభావితం అవుతారని అన్నారు. ఎలా ప్రభావితం అవుతారన్న ధర్మాసనం.. ఎన్నికల సమయంలో దాఖలు చేసే ఇలాంటి వ్యాజ్యాలన్నీ రాజకీయ ప్రయోజన వ్యాజ్యాలే అవుతాయని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ న్యాయవాది జీఎల్ నరసింహారెడ్డి వినతి మేరకు కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి మరింత గడువునిచ్చింది.

సౌరవిద్యుత్ కొనుగోలుపై నిర్ణయం త్వరగా చెప్పండి

- ఏపీఈఆర్‌సీకి హైకోర్టు ఆదేశం
- విచారణ ఏప్రిల్ 18కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సౌరవిద్యుత్ కొనుగోలు చేసే విషయంలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ), విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో), విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంల) మధ్య కుదిరిన త్రైపాక్షిక ఒప్పందాన్ని అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతపై వీలైనంత త్వరగా నిర్ణయం వెలువరించాలని హైకోర్టు బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని ఆదేశించింది. ఈ ఒప్పందం విషయంలో ఏపీఈఆర్‌సీ నిర్ణయం వెలువరించిన తరువాతే తమ ముందున్న ప్రజాప్రయోజన వ్యాజ్యాలను విచారిస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 చొప్పున ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందానికి కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) ఆమోదం తెలపడాన్ని సవాలు చేస్తూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది.

విద్యుత్ కొన్నా, కొనకున్నా విమర్శలు..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యాజ్యాలను త్వరగా తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ పంపిణీకి అంగీకారం తెలిపిన కంపెనీలు..ఈ వ్యాజ్యాలు కోర్టులో ఉండటంతో వెనకడుగు వేస్తున్నాయని తెలిపారు. దీనివల్ల అంతిమంగా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. పిటిషనర్లు రాజకీయ పార్టీలకు చెందిన వారని, వారే అధిక ధరకు కొనుగోలు చేస్తే అభ్యంతరం చెబుతూ కోర్టుకు వస్తారని, కొనుగోలు చేయకపోతే రైతులకు విద్యుత్ అందించడం లేదంటూ బయట రాజకీయ విమర్శలు చేస్తారని వివరించారు. పిటిషనర్లవి ద్వంద్వ ప్రమాణాలన్నారు. సెకీ నుంచి విద్యుత్ కొనుగోలుకు ఇప్పటికే ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపిందన్నారు. త్రైపాక్షిక ఒప్పందం అమలు కోసమే విద్యుత్ పంపిణీ సంస్థలు పిటిషన్ దాఖలు చేశాయని తెలిపారు. ఈ వ్యాజ్యాలకు, ఏపీఈఆర్‌సీ ముందున్న వ్యాజ్యంతో సంబంధం లేదన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యాలను అత్యవసరంగా విచారించాలని కోరారు. సెకీ తరఫున సీనియర్ న్యాయవాది ఎం.ఆర్.రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ.. అంతర్‌రాష్ట్ర విద్యుత్ సరఫరా ఒప్పందం విషయంలో సీఈఆర్‌సీకి మాత్రమే జోక్యం చేసుకునే అధికారం ఉంటుందని చెప్పారు. ఈ వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నందున విద్యుత్ సరఫరాకు కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ మొత్తం వ్యవహారంపై ఏపీఈఆర్‌సీ విచారించడం సబబుగా ఉంటుందంది. వీలైనంత త్వరగా విద్యుత్ పంపిణీ సంస్థల పిటిషన్‌పై నిర్ణయం తెలపాలని ఏపీఈఆర్‌సీని ఆదేశించింది.

ఒంటరి పోరుకు సిద్ధం కావాల్సిందే..

ఏపీ బీజేపీ నేతలతో నడ్డా, అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ :ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధం కావాలని ఏపీ బీజేపీ నాయకత్వానికి ఆ పార్టీ అధిష్టానం సూచించిందని తెలిసింది. అన్ని నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులు బరిలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలందని సమాచారం. బుధవారం ఢిల్లీలో ఏపీ బీజేపీ నేతలతో జరిగిన సమావేశంలో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు సంబంధించి అభ్యర్థులపై పార్టీ అధిష్టానం చర్చించింది. పార్టీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు సహా పలువురు రాష్ట్ర నేతలు పాల్గొన్నారు. అగ్రనేతలతో జరిగిన సమావేశంలో ఏపీకి సంబంధించిన పొత్తుల అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని.. కేవలం 175 స్థానాలకు బలమైన అభ్యర్థులను నిలబెట్టే అంశంపైనే చర్చించామని రాష్ట్ర బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

ఏం ఆశించి సమ్మె చేస్తున్నారు!

న్యాయవాద సంఘాలను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా న్యాయవాద సంఘాలు కోర్టు విధులను బహిష్కరించడంపై వివిధ సంఘాలను హైకోర్టు వివరణ కోరింది. ఎవరి ప్రోద్బలంతో.. ఏం ఆశించి సమ్మె చేస్తున్నారో చెప్పాలని గుంటూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిని ఆదేశించింది. ఆ మేరకు నోటీసులిచ్చింది. సమ్మె కొనసాగిస్తున్న కడప, విశాఖపట్నం న్యాయవాదుల సంఘాలకు సైతం నోటీసులిచ్చింది. తాము ఆదేశాలిచ్చినా సమ్మె కొనసాగిస్తుండటంపై ప్రశ్నించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలంది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా న్యాయవాద సంఘాలు సమ్మెకు పిలుపునిస్తూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నాయని న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. ధర్మాసనం స్పందిస్తూ.. ఇంకా ఏయే న్యాయవాద సంఘాలు సమ్మె విరమించడం లేదని ప్రశ్నించింది. దీనికి రాష్ట్ర బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది జి.వెంకటరెడ్డి వాదనలు వినిపిస్తూ.. గుంటూరు న్యాయవాదుల సంఘం మినహా మిగిలిన న్యాయవాదుల సంఘాలన్నీ సమ్మె విరమించాయన్నారు. కడప, విశాఖ సంఘాలు సమ్మె విరమణ నిమిత్తం సమావేశాన్ని నిర్వహిస్తున్నాయని చెప్పారు.

ఆదేశాలిచ్చినా ఆందోళన ఎందుకు?

న్యాయవాదులు, కక్షిదారులను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కుల చట్టం విషయంలో న్యాయవాదులు, కక్షిదారుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ ఆదేశాలు జారీ చేసిన తరువాత కూడా ఆందోళన ఎందుకని న్యాయవాదులను హైకోర్టు ప్రశ్నించింది. చట్టం రాకముందు ఏ వ్యవస్థ ఉందో అదే వ్యవస్థ కొనసాగుతోందని, సివిల్ కోర్టులన్నీ పాత విధానంలోనే కేసులను విచారించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని హైకోర్టు గుర్తు చేసింది. తాము ఇచ్చిన ఈ ఉత్తర్వుల వల్ల న్యాయవాదులకు, కక్షిదారులకు వచ్చిన నష్టం ఏముందని ప్రశ్నించింది. భూ యాజమాన్య హక్కుల చట్టం విషయంలో ఇంకా రూల్స్ రూపొందించలేదని, అందువల్ల ఆ చట్టం ఇప్పటికిప్పుడు అమలయ్యే పరిస్థితి లేదంది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి మరింత గడువు ఇచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన విషయం విదితమే. వీటిపై సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా పై వ్యాఖ్యలు చేసింది.

నెల్లూరు జిల్లాలో క్లీన్ స్వీప్ ఖాయం

- ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు దురుద్దేశపూరితమే
- ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటరీ సమన్వయకర్త విజయసాయిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి, పక్కన బీద మస్తాన్‌రావు

నెల్లూరు (దర్గామిట్ట) : సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయ సాయిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక రామ్మూర్తి నగర్‌లో వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను నిర్మూలించి బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికాభివృద్ధి చెందేలా పాలన సాగించారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంలోనే ఒకటి, రెండు స్థానాల్లోనే ఉందని చెప్పారు. అది తెలిసి కూడా రాష్ట్రం వెనుకబడి ఉందని ప్రతిపక్షాలు విమర్శించడం అర్థరహితమని పేర్కొన్నారు. సిద్ధం సభలకు విశేష స్పందన లభిస్తోందని, రాష్ట్ర ప్రజల్లో వైఎస్సార్‌సీపీ పట్ల ప్రేమ, అభిమానం మరింత అధికమైందన్నారు. ఇక్కడ పుట్టి పెరిగిన తనకు ఈ జిల్లాకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు.

పీకే వ్యాఖ్యలు దురుద్దేశంతో చేసినవే

ఇటీవల ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలు దురుద్దేశంతో చేసినవిగా స్పష్టమవుతోందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలను గమనిస్తే ఎటువంటి గణాంకాలు, శాస్త్రీయ ఆధారాలు లేకుండా చెప్పినట్టు స్పష్టమవుతోందన్నారు. వాటిని ప్రజలు నమ్మరని అన్నారు. నెల్లూరు జిల్లాకు రోడ్డు, రైలు మార్గాల సౌకర్యాలు బాగున్నాయని, విమాన సౌకర్యం లేదని అన్నారు. జిల్లాలో రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో పాటు రెండు ఫిషింగ్ హార్బర్లు ఉన్నాయన్నారు. దగదర్తి మండలంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. మంత్రి గుమ్మనూరు జయరామ్ టికెట్ రాలేదని పార్టీని వీడారని అన్నారు.

అదొక బాబు చీటింగ్ డిక్లరేషన్

- చంద్రబాబు ప్రకటించింది బీసీ డిక్లరేషన్ కాదు
- నిజంగా బాబు 30 పథకాలు ఇచ్చి ఉంటే 2019లో ప్రజలు 30 సీట్లయినా ఇచ్చి ఉండేవారు
- రాజ్యాంగం నిర్దేశించిన దానికంటే జగనన్న పాలనలో బీసీలకు ఎక్కువ అవకాశాలు
- స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లపై కేసు వేయించింది బాబే
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రకటించింది బీసీ డిక్లరేషన్ కాదని, అదొక బాబు చీటింగ్ (బీసీ) డిక్లరేషన్ అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి దుయ్యబట్టారు. కాస్త మసాలా దట్టించి పాత హామీలనే పెట్టి బాబు మళ్లీ బీసీలను మోసగిస్తున్నారని విమర్శించారు. గత హామీలను తుంగలో తొక్కిన బాబుకు కనీసం సిగ్గనిపించడంలేదా అని నిలదీశారు. ఆ హామీలు నెరవేర్చనందుకు బాబు, పవన్ బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆనాడు బాబు నిజంగా 30 పథకాలు ఇచ్చి ఉంటే 2019లో ప్రజలు కనీసం 30 సీట్‌లెనైా ఇచ్చి ఉండేవారన్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు – బ్యాక్ బోన్ క్లాసులని వైఎస్సార్‌సీపీ 2019 ఎన్నికలకు ముందు ఏలూరు డిక్లరేషన్‌లోనే నినాదం ఇచ్చిందని, అదే నినాదాన్ని కాపీ కొట్టడం చంద్రబాబు, పవన్ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. 2014 ఎన్నికల్లో బీసీలకు చంద్రబాబు 143 వాగ్దానాలిచ్చారని, పవన్ హామీలు కూడా కలిపితే 600 దాటుతాయని, వాటిలో ఒక్కటీ అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. బీసీ డిక్లరేషన్‌లో గతంలో చెప్పిన వాటిలో ఎన్ని నేరవేర్చారో చెప్తే బాగుండేదన్నారు. బీసీలెవరూ బాబు, పవన్‌ను నమ్మడం లేదని చెప్పారు. 40 ఏళ్లుగా బాబు బీసీల్ని రాజకీయంగా వాడుకొని వదిలేశారన్నారు.

బాబు దృష్టిలో బీసీ అంటే బాబు క్యాస్ట్

చంద్రబాబు దృష్టిలో బీసీ అంటే బాబు క్యాస్ట్ అని, ఎస్సీ అంటే సేమ్ క్యాస్ట్ అని చెప్పారు. అబద్ధానికి ఆధార్ కార్డు చంద్రబాబేనని ధ్వజమెత్తారు. బీసీ ప్రధాన మంత్రిని దూషించిన బీసీ వ్యతిరేకి చంద్రబాబు అని చెప్పారు. బీసీలకు వెన్నెముక, ఆత్మగౌరవం జగనన్న అయితే.. వెన్నుపోటు చంద్రబాబు అని తెలిపారు. ఏపీలో చీటింగ్ చీఫ్ మినిస్టర్ చంద్రబాబని, మోసానికి పాంటు, షర్ట్ వేస్తే అది చంద్రబాబే అవుతారని తెలిపారు. బాబు బీసీలను అణచివేశారని, జగనన్న పాలనలో బీసీలు బాద్‌షాలని తెలిపారు. రాజ్యాంగం నిర్దేశించిన దానికంటే జగనన్న పాలనలో బీసీలకు ఎక్కువ అవకాశాలు దక్కాయని చెప్పారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లపై కేసు వేయించింది చంద్రబాబేనని అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ఆమె చెప్పారు.

బీసీ పక్షపాత సీఎం వైఎస్ జగన్

బీసీల పక్షపాత సీఎంగా వైఎస్ జగన్ పేరుగాంచారని కల్యాణి చెప్పారు. సీఎం జగన్ ఈ ఐదేళ్లలో బీసీలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.1.78 లక్షల కోట్లు అందించారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పదవులు, కాంట్రాక్టులు అన్నీ ఆయన సామాజికవర్గానికే ఇచ్చుకున్నారని తెలిపారు. సీఎం జగన్ అన్ని పదవులు, కాంట్రాక్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని, సీఎం జగనన్న నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారని చెప్పారు. '124 సార్లు బటన్ నొక్కి బీసీల ఖాతాల్లో డబ్బు వేయడం మోసమా? శాశ్వత బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం మోసమా? బీసీ కులగణన కూడా జగనన్న చేపట్టారు. ఇళ్ల పట్టాలు, గృహాల్లో మెజార్టీ బీసీలకే దక్కాయి. స్పీకర్‌గా బీసీనే చేశారు. 11 మంది బీసీలకు మంత్రులుగా అవకాశం ఇచ్చారు. ఉద్యోగాల్లోనే పెద్ద పీట బీసీలకే. గ్రామ సచివాలయ ఉద్యోగాల్లో 60 శాతం బీసీలే ఉన్నారు. 54 వేల మందికి శాశ్వత ఉద్యోగాలు వచ్చాయి. 2.14 లక్షల శాశ్వత ఉద్యోగాలిస్తే వాటిలోనూ 60 శాతం బీసీలకే దక్కాయి ' అని వివరించారు. ఇంత మేలు చేసిన జగనన్నకు ప్రజలంతా మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

చంద్రబాబుతో పవన్ మరో దఫా మంతనాలు

- బీజేపీతో పొత్తు, సీట్లపై చర్చ
- బీజేపీని పొత్తుకు ఒప్పించేందుకు పవన్ ఢిల్లీ వెళతారంటూ లీకులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మరో దఫా సమావేశమయ్యారు. బుధవారం పవన్ ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి, రు. పొత్తులో భాగంగా ఇప్పటికే 99 మంది ఉమ్మడి అభ్యర్థుల జాబితాను ప్రకటించగా, మిగిలిన సీట్లలో అభ్యర్థుల ఎంపికపై బుధవారం చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. బీజేపీతో పొత్తు ఇంకా తేలకపోవడంతో ఏం చేయాలనే విషయంపైనా చర్చ జరిగినట్లు చెబుతున్నారు. ఆ పార్టీతో పొత్తు విషయంపై స్పష్టత వచ్చే వరకు మిగిలిన సీట్లపై నిర్ణయం తీసుకోలేమని ఇరువురు అభిప్రాయ పడ్డట్లు తెలిసింది. బీజేపీ అధిష్టానాన్ని పొత్తుకు ఒప్పించేందుకు గురువారం పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళతారని టీడీపీ, జనసేన పార్టీ నేతలు ఈ సమావేశం తర్వాత మీడియాకు లీకులిచ్చారు. ఆ తర్వాత చంద్రబాబు కూడా ఢిల్లీ వెళ్తారని చెబుతున్నారు. వాస్తవానికి పవన్ ఢిల్లీ వెళతారని చాలారోజుల నుంచి ఆ రెండు పార్టీల నేతలు చెబుతున్నారు. కానీ ఇంతవరకు ఢిల్లీ నుంచి పవన్‌కి పిలుపు రాలేదు. గురు, శుక్రవారాల్లో అయినా వస్తుందో లేదో తెలియదు. కానీ, పవన్ ఢిల్లీ వెళ్లి పొత్తును ఖరారు చేసుకుని వస్తారనే ప్రచారాన్ని ఆ పార్టీలు జోరుగా చేస్తున్నాయి.

చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం!

రష్యా, చైనా సంయుక్త యోచన... పదేళ్లలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ


ప్రతీకాత్మక చిత్రం

చంద్రునిపై మనిషి శాశ్వత నివాస కలను వీలైనంత త్వరగా సాకారం చేయాలని రష్యా, చైనా తలపోస్తున్నాయి. అందుకవసరమైన విద్యుత్ అవసరాలను సోలార్ ప్యానళ్లు తీర్చలేకపోవచ్చనే ఉద్దేశంతో జాబిలిపై ఏకంగా అణు విద్యుత్కేంద్రమే ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చాయి! అందుకోసం ఇప్పటికే సంయుక్త కార్యాచరణకు తెర తీశాయి కూడా...

- సాక్షి, నేషనల్ డెస్క్

అంతరిక్ష పోటీలో కీలక ముందడుగు వేసే దిశగా రష్యా, చైనా సంయుక్తంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా చంద్రునిపై మనిషి శాశ్వత నివాస కలను నిజం చేసే దిశగా కదులుతున్నాయి. 2035 లోపు అక్కడ అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేయాలని నిశ్చయానికి వచ్చాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇప్పటికే మొదలైందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ చీఫ్ యూరీ బోరిసోవ్ తెలిపారు. ఈ మేరకు తాజాగా ఆయన ఒక ప్రకటన చేశారు. అయితే ఇదంతా సులువు కాబోదని యూరీ అంగీకరించారు. కాకపోతే, ''న్యూక్లియర్ స్పేస్ ఎనర్జీ రంగంలో రష్యాకున్న అపార నైపుణ్యం ఈ విషయంలో బాగా ఉపయోగపడనుంది. మేం తలపెట్టిన ప్రాజెక్టు చంద్రునిపై మనిషి శాశ్వత ఆవాసం దిశగా కీలక ముందడుగు కానుంది. అక్కడ మున్ముందు ఎదురయ్యే ఇంధన అవసరాలు, డిమాండ్లను తీర్చేందుకు సోలార్ ప్యానళ్లు చాలవు. అణు విద్యుతే ఇందుకు సమర్థమైన ప్రత్యామ్నాయం. కనుకనే బాగా ఆలోచించిన మీదట ఈ ప్రాజెక్టును పట్టాలకెక్కించాం'' అని ఆయన వివరించారు.

పర్యవేక్షణకు అంతరిక్ష 'అణు'నౌక...

అయితే చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం వ్యవస్థాపన మాటల్లో చెప్పినంత సులువేమీ కాదు. ఇందుకోసం ఇప్పటికే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు యూరీ వెల్లడించారు....

- తొలి దశలో మానవ ప్రమేయంతో నిమిత్తం లేకుండా చంద్రునిపై అణు ప్లాంటు స్థాపన ప్రయత్నాలు పూర్తిగా ఆటోమేటెడ్ పద్ధతిన సాగుతాయి.
- ఇందుకోసం ప్రధానంగా రోబోలను రంగంలోకి దించి వాటి సాయంతో పని నడిపిస్తారు.
- స్పేస్ టగ్‌బోట్ పేరిట అణు విద్యుత్‌తో నడిచే అంతరిక్ష నౌకను అభివృద్ధి చేసే యోచనలో రష్యా ఉంది.
- ఇందులో భారీ అణు రియాక్టర్‌తో పాటు హై పవర్ టర్బైన్లు కూడా ఉంటాయి.
- విద్యుత్కేంద్రం తయారీకి కావాల్సిన సామగ్రిని దాన్నుంచే చంద్రునిపైకి పంపుతారు.
- దాని నిర్మాణ క్రమంలో వెలువడే అంతరిక్ష వ్యర్థాలు తదితరాలను క్లియర్ చేసే పని కూడా ఈ నౌకదే.

చల్లబరచేదెలా...?

చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం నిర్మాణంలో ఇమిడి ఉన్న అనేకానేక సాంకేతిక సమస్యలను అధిగమించడంలో రష్యా, చైనా తలమునకలుగా ఉన్నాయి. అయితే అణు ప్లాంటును ఎప్పటికప్పుడు చల్లబరచడం వాటికి అత్యంత కీలకమైన సవాలుగా మారనుంది. గతేడాది రష్యా ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన లూనా–25 అంతరిక్ష నౌక అంతరిక్షంలో అదుపు తప్పి పేలిపోయింది. ఆ ఎదురుదెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయినా అణు కేంద్రం విషయంలో వెనక్కు తగ్గొద్దని పట్టుదలగా ఉంది. ఆలోపే చైనాతో కలిసి మానవసహిత చంద్ర యాత్ర, ఆ వెంటనే చంద్రునిపై శాశ్వత బేస్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. చైనా కూడా 2030 నాటికల్లా తమ తొలి వ్యోమగామిని చంద్రునిపైకి పంపడం లక్ష్యంగా పెట్టుకుంది. వీటన్నింటినీ అమెరికా ఓ కంట కనిపెడుతూనే ఉంది. వీలైనంత త్వరగా అంతరిక్షంలో అణ్వాయుధాలను ఏర్పాటు చేసుకోవడమే రష్యా లక్ష్యమని ఇప్పటికే ఆరోపించడం తెలిసిందే. ఇదంతా పెద్ద దేశాల నడుమ అంతరిక్షంపై ఆధిపత్య పోరుకు దారి తీసే ఆస్కారం లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా విన్పిస్తున్నాయి.

రేసు నుంచి నిక్కీ హేలీ ఔట్


విలేకరుల భేటీ నుంచి నిష్క్రమిస్తున్న హేలీ

వాషింగ్టన్: మంగళవారం ఒకేసారి 15 రాష్ట్రాల్లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన నేపథ్యంలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం రేసు నుంచి తప్పుకుంటున్నట్లు భారతీయ మూలాలున్న నాయకురాలు నిక్కీ హేలీ బుధవారం ప్రకటించారు. వెర్మాంట్‌లో గెలుపు కాస్తంత ఊరటనిచ్చినా మిగతా అన్ని చోట్ల ఎదురైనా ప్రతికూల ఫలితాలను బేరీజు వేసుకుని ఆమె ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఫలితాల తర్వాత సౌత్ కరోలీనాలో ఆమె మాట్లాడారు. ''నా ప్రచారానికి అర్ధంతరంగా ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అమెరికన్ల గొంతుక గట్టిగా వినిపించాలని భావించా. నా శక్తిమేరకు నేను కృషి చేశా. అనుకున్న కార్యాన్ని పూర్తిచేయలేకపోయా. ఇందులో చింతించాల్సింది ఏమీ లేదు. రేసులో నేను ఉండకపోవచ్చుకానీ నేను నమ్మిన సిద్ధాంతాలను ఇకమీదటా బలంగా వినిపిస్తా'' అని నిక్కీ హేలీ అన్నారు.

రిపబ్లికన్ ఏకైక అభ్యర్థిగా ట్రంప్

- రేసు నుంచి నిక్కీ హేలీ వైదొలగడంతో లాంఛనమైన ట్రంప్ అభ్యర్థిత్వం
- సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల్లో ట్రంప్, బైడెన్‌ల జోరు


బైడెన్ ట్రంప్

వాషింగ్టన్: ఈ ఏడాది నవంబర్‌లో జరగబోయే అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్, రిపబ్లికన్‌పార్టీల తరఫున బరిలో దిగబోయే అభ్యర్థులు ఎవరనేది దాదాపు ఖరారైంది. మంగళవారం 15 రాష్ట్రాలు, ఒక టెరిటరీలో జరిగిన ఆయా పార్టీల ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్, బైడెన్‌ల హవా కొనసాగింది. రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న ట్రంప్ మంగళవారం నాటి 'సూపర్ ట్యూస్‌డే' ప్రైమరీల్లో దాదాపు అన్నింటిలోనూ జయకేతనం ఎగరేశారు. వెర్మాంట్ రాష్ట్ర ప్రైమరీలో మాత్రమే భారతీయ సంతతి నాయకురాలు, సొంత పార్టీలో ప్రత్యర్థి అయిన నిక్కీ హేలీ చేతిలో ట్రంప్ ఓటమి చవిచూశారు. మిగతా రాష్ట్రాల ప్రైమరీల్లో ట్రంప్‌దే విజయం. మరోవైపు వరస ఓటముల నేపథ్యంలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి తప్పుకుంటున్నట్లు నిక్కీ హేలీ ప్రకటించారు. దీంతో ట్రంప్ అభ్యర్థిత్వం ఖరారైంది. మొత్తం రిపబ్లికన్ డెలిగేట్లలో మూడింట ఒక వంతు మంది ఈ మంగళవారం నాడే తమ అభ్యర్థి ఎవరనేది ఎన్నుకున్నారు. పార్టీ తరఫున అభ్యర్థిత్వం సాధించాలంటే రిపబ్లికన్ అభ్యర్థి మొత్తం 2,429 ఓట్లకుగాను కనీసం 1,215 డెలిగేట్ల ఓట్లు సాధించాలి. సూపర్ ట్యూస్‌డే రోజున ట్రంప్ 764 డెలిగేట్ల ఓట్లు సాధించారు. నిక్కీ హేలీ కేవలం 43 డెలిగేట్ల ఓట్లు సాధించారు. సూపర్‌ట్యూస్‌డేకు ముందు గతంలో ట్రంప్ 276 డెలిగేట్ల ఓట్లు ఉండేవి. నిక్కీ హేలీకి గతంలోనూ 43 ఓట్లే ఉన్నాయి. సూపర్ ట్యూస్‌డే రోజు సాధించిన ఓట్లతో కలుపుకుంటే ట్రంప్ ఇప్పటిదాకా సాధించిన డెలిగేట్ల సంఖ్య 1,040కు పెరిగింది. నిక్కీ హేలీ డెలిగేట్ల సంఖ్య 86కు పెరిగింది. మరోవైపు 81 ఏళ్ల బైడెన్ సైతం తమ డెమొక్రటిక్ పార్టీలో రాష్ట్రాల ప్రైమరీల్లో తన విజయపరంపర కొనసాగించారు. అమెరికన్ సమోవా టెరిటరీలో మాత్రం జాసన్ పామర్ చేతిలో బైడెన్ ఓటమిని అంగీకరించక తప్పలేదు. మంగళవారం జరిగిన మిగతా అన్ని రాష్ట్రాల్లో బైడెన్ విజయబావుటా ఎగరేశారు. డెమొక్రటిక్ అభ్యర్థి మొత్తం 3,934 డెలిగేట్లకు గాను కనీసం 1,968 డెలిగేట్ల ఓట్లను సాధించాల్సి ఉంటుంది. సూపర్‌ట్యూస్‌డేకు ముందు గతంలో బైడెన్‌కు 206 డెలిగేట్ల ఓట్లు ఉండేవి. సూపర్‌ట్యూస్‌డే రోజున బైడెన్ ఏకంగా 1,366 డెలిగేట్ల ఓట్లు సాధించారు. దీంతో తాజాగా మొత్తంగా బైడెన్ సాధించిన డెలిగేట్ల ఓట్ల సంఖ్య 1,572కు చేరుకుంది.

సందేశ్‌ఖాలీలో తుపాను!

బెంగాల్‌ను ముంచెత్తడం ఖాయం: ప్రధాని మోదీ

- మహిళల చేతిలో తృణమూల్‌కు పరాజయం తప్పదు
- బెంగాల్‌లో నారీశక్తి వందన్ సభలో ప్రధాని వ్యాఖ్యలు

బరాసత్/కోల్‌కతా: సందేశ్‌ఖాలీలో తుపాను మొదలైందని, అది పశ్చిమ బెంగాల్‌ను చుట్టుముట్టడం ఖాయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. అరాచకాలు, అకృత్యాలకు మారుపేరైన అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా శక్తి మట్టి కరిపించడం తథ్యమని అన్నారు. బెంగాల్ రాష్ట్రం ఉత్తర 24 పరగణాల జిల్లా కేంద్రమైన బరాసత్ పట్టణంలో బుధవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీశక్తి వందన్ సభలో ఆయన ప్రసంగించారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై నేరాలు సిగ్గుచేటన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, మహిళల భద్రతను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. బాధితుల్లో తిరుగుబాటు మొదలైందని, సందేశ్‌ఖాలీలో పుట్టిన తుఫాను రాష్ట్రాన్ని ముంచెత్తి తృణమూల్‌ను గద్దె దింపుతుందని అన్నారు. సందేశ్‌ఖాలీ అంశంలో హైకోర్టులో, సుప్రీంకోర్టులో మమత ప్రభుత్వానికి ఎదురుదెబ్బలు తగిలాయని గుర్తుచేశారు.

బాధితులకు న్యాయం చేకూరుస్తాం

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల్లో అత్యాచారాలకు, అకృత్యాలకు గురైన మహిళలకు న్యాయం చేకూరుస్తామని, తగిన భద్రత కల్పిస్తామని ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చారు. అనంతరం సందేశ్‌ఖాలీ నుంచి వచ్చిన మహిళలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐదుగురు బాధితులతో స్వయంగా మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుల అరాచకాలపై నిర్భయంగా పోరాడుతున్న సందేశ్‌ఖాలీ మహిళలను దుర్గా మాతతో పోల్చారు. బాధితుల గోడు విని ఆయన చలించిపోయారు. ఇకపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి భరోసా కల్పించారు. మరోవైపు సందేశ్‌ఖాలీ నుంచి నారీశక్తి వందన్ సభకు బస్సుల్లో వస్తున్న మహిళలను బెంగాల్ పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. బీజేపీ నాయకులు వారితో ఘర్షణకు దిగారు. కొంత మంది మహిళలు మాత్రమే సభకు రాగలిగారు.

లాలూ కుటుంబం నేరగాళ్లమయం

బేటియా: ఆర్జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులు బిహార్‌లో అతిపెద్ద నేరగాళ్లని మోదీ ఆరోపించారు. పదేళ్ల ఆర్జేడీ పాలనలో బిహార్‌ను జంగిల్‌రాజ్ మార్చేశారని మండిపడ్డారు. బిహార్‌లో పశ్చిమ చంపారన్ జిల్లాలోని బేటియాలో రూ.12,800 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. అప్పట్లో ఆర్జేడీ–కాంగ్రెస్ దుష్పరిపాలన వల్ల బిహార్ యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వారసత్వ రాజకీయాలు చేసేవారు తనపై మాటల దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి నేతలు రాముడిని కూడా కించపరుస్తున్నారన్నారు. దేశం పేదరికం నుంచి బయటపడాలంటే, మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో అతి పెద్దదిగా వ్యవస్థగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు 400 సీట్లు కట్టబెట్టాలని ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు.


బుధవారం కోల్‌కతా మెట్రోలో ప్రయాణిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

కోల్‌కతాలో అండర్ వాటర్ మెట్రో టన్నెల్ ప్రారంభం

దేశంలోనే మొట్టమొదటి జలాంతర్భాగ మెట్రో రైలు సొరంగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కోల్‌కతా మెట్రోరైల్ నెట్‌వర్క్‌లో భాగంగా హుగ్లీ నది దిగువన ఈ సొరంగాన్ని నిర్మించారు. ఎస్ప్లానాడి నుంచి హౌరా మైదాన్ స్టేషన్ వరకు మెట్రో రైలులో మోదీ ప్రయాణించారు. రైలులో తనతోపాటు ప్రయాణించిన పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అదే మార్గంలో ఎస్ప్లానాడి స్టేషన్‌కు తిరిగివచ్చారు. ఈస్ట్–వెస్ట్ కారిడార్‌లో అంతర్భాగమైన 4.8 కిలోమీటర్ల ఎస్ప్లానాడి–హౌరా మైదాన్ మెట్రో మార్గాన్ని రూ.4,960 కోట్లతో నిర్మించారు. ఈ మార్గంలో దేశంలోనే అత్యంత లోతైన రైల్వే స్టేషన్ ఉంది. ఉపరితలం నుంచి 32 మీటర్ల దిగువన హౌరా మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. కోల్‌కతాలో బుధవారం మరికొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో మొత్తం రూ.15,400 కోట్ల విలువైన మెట్రో రైలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు.


బుధవారం మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

అధికారంలోకి రాగానే కుల గణన

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత: రాహుల్

భోపాల్: రాబోయే లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన ప్రారంభిస్తామని కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. అలాగే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని అన్నారు. తమ ప్రభుత్వంలో ఈ రెండు అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని బంద్‌నవర్ పట్టణంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం తరహాలో కులగణన కూడా ఒక భారీ విప్లవాత్మకమైన ముందడుగు అవుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు కచ్చితంగా ఎవరెంత మంది ఉన్నారో కులగణన ద్వారా తెలుస్తుందని, దీని ఆధారంగా ఆయా వర్గాల కోసం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయవచ్చని తెలిపారు. ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం చేకూర్చడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. రైతన్నలకు సైతం న్యాయం చేస్తామన్నారు.

ప్రజల నమ్మకాన్ని చెత్త బుట్టలో పడేశారు

జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో అక్రమ నిర్మాణాలు, చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశంలో ప్రఖ్యాతిగాంచిన జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో అడవి మధ్యలో టైగర్ సఫారీల ఏర్పాటును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. వాటి కార్యకలాపాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సఫారీల ఏర్పాటు కోసం అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోపాటు అక్కడి భారీ వృక్షాలను నరికివేయడంపై మండిపడింది. అక్రమ నిర్మాణాలు, చెట్ల నరికివేతకు అనువుగా నిబంధనలను తుంగలో తొక్కిన 2021లో బీజేపీ ప్రభుత్వహయాంలో నాటి ఉత్తరాఖండ్ అటవీ మంత్రి హరక్ సింగ్ రావత్, నాటి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కిషన్ చంద్‌ల పనితీరును తీవ్రంగా ఆక్షేపించింది. '' ప్రజా విశ్వాసాన్ని బుట్టదాఖలుచేశారు. ఇంతటి విపరీత నిర్ణయాలు కేవలం ఇద్దరే తీసుకున్నారని అనుకోవట్లేము. ఇందులో చాలా మంది ప్రమేయం ఉండొచ్చు'' అని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని పీకే మిశ్రా, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. జాతీయ వనంలోని ల్యాన్స్‌డౌన్ ఫారెస్ట్ డివిజన్‌లో పత్రో టైగర్ సఫారీ కోసం వేల చెట్లు నరికేశారంటూ పర్యావరణవేత్త, న్యాయవాది గౌరవ్ భన్సల్ వేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. '' అధికారి కిషన్‌ను సస్పెండ్ చేయాలని అటవీ కార్యదర్శి చేసిన సిఫార్సును రావత్ పెడచెవిన పెట్టారు. పైగా కిషన్‌ను సమర్థించారు. రావత్ ఆ పదవి నుంచి దిగిపోయాకే కిషన్ సస్పెన్షన్, అరెస్ట్ చేశారు. ఈ ఘటన రాజకీయనేతలు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులు కలిసి చేస్తున్న అక్రమాలకు ప్రబల సాక్ష్యం' అని కోర్టు వ్యాఖ్యానించింది. '' ఈ ఉదంతంపై సీబీఐ ఇప్పటికే దర్యాప్తు జరుపుతోంది. ఈ ఘటనపై సీబీఐ సమగ్ర నివేదిక మూడు నెలల్లో సమర్పించాలి. తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటాం' అని కోర్టు వ్యాఖ్యానించింది. జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ రాయల్ బెంగాల్ పులులకు ఆవాసం. 1,288.31 చదరపు కి.మీ.లోని ఈ అటవీప్రాంతం పేరు. అత్యంత ఎక్కువ సంఖ్యలో పులులు సంచరించే ప్రాంతంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది.

ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాకు ఊరట

చెన్నై: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాకు మద్రాసు హైకోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాతోపాటు మరో డీఎంకే నేత చట్టసభ సభ్యులుగా కొనసాగడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. అయితే, డీఎంకే నాయకులు వ్యాఖ్యలను కోర్టు తప్పుపట్టింది. సనాతన ధర్మాన్ని హెచ్ఐవీ, మలేరియా, డెంగ్యూతో పోల్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా మాట్లాడడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమేనని తేల్చిచెప్పింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉంటూ సమాజంలో విభజన తెచ్చేలా వ్యవహరించడం ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించింది. వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది.

సీబీఐ కస్టడీకి షాజహాన్ షేక్

ఈడీ అధికారులపై దాడి కేసులో దర్యాప్తు వేగవంతం

కోల్‌కతా: సందేశ్‌ఖాలీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐ అధికారులు ఎట్టకేలకు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు వేగవంతం చేశారు. అతడిని తక్షణమే సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టు రెండుసార్లు ఉత్తర్వులు జారీ చేయడంతో పశ్చిమ బెంగాల్ సీఐడీ అధికారులు స్పందించక తప్పలేదు. బుధవారం సీబీఐ అధికారులకు అప్పగించారు. వాస్తవానికి ఈడీ అధికారులపై దాడి కేసులో దర్యాప్తును, నిందితుడు షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించాలంటూ మంగళవారమే కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. అయినా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లెక్కచేయలేదు. ఈ ఉత్తర్వును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బెంగాల్ ప్రభుత్వ పిటిషన్‌పై వెంటనే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించలేదు. మరోవైపు కలకత్తా హైకోర్టులో ఈడీ బుధవారం మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మంగళవారం నాటి ఉత్తర్వును అమలు చేయాలని, షాజహాన్ షేక్‌ను సాయంత్రం 4.15 గంటలకల్లా సీబీఐకి అప్పగించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ బృందం బుధవారం సాయంత్రం 4 గంటలకు సీఐడీ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. సీఐడీ అధికారులు సాయంత్రం 6.48 గంటలకు షాజహాన్ షేక్‌ను సీబీఐ బృందానికి అప్పగించారు. అంతకంటే ముందు అతడిని ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. కరడుగట్టిన నేరగాడిగా ముద్రపడిన షాజహాన్ షేక్‌పై సందేశ్‌ఖాలీలో దళిత, గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తీవ్రంగా స్పందించారు.

అమేథీ నుంచి రాహుల్ పోటీ?

అమేథీ: గతంలో పలుమార్లు తాను ప్రాతినిధ్యం వహించిన అమేథీ లోక్‌సభ స్థానం నుంచే ఈసారి కూడా రాహుల్ గాంధీ బరిలో దిగుతారని కాంగ్రెస్ పార్టీ అమేథీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రదీప్ సింఘాల్ చెప్పారు. ఢిల్లీలో సమావేశం తర్వాత అమేథీకి తిరిగొచ్చిన సింఘాల్ మీడియాతో మాట్లాడారు. '' అమేథీ నుంచి ఈసారి కూడా పార్టీ అభ్యర్థి రాహుల్ గాంధీయే. త్వరలోనే ఆయన పేరును ప్రకటిస్తారు'' అని అన్నారు. అయితే దీనిపై పార్టీ అధిష్ఠానం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఇంకా జరగలేదు. ఆలోపే అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి ప్రకటన వెలువడే అవకాశం లేదు. 2002 నుంచి 2019 దాకా అమేథీ నుంచి రాహుల్ గాంధీయే ప్రాతినిధ్యంవహిస్తూ వస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ అమేథీతోపాటు కేరళలోని వయనాడ్‌లోనూ పోటీకి దిగారు. అమేథీలో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే వయనాడ్‌లో విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

నిందితుడి జాడ చెప్తే రూ.10 లక్షలు

ప్రకటించిన జాతీయ దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ: బెంగళూరులో మార్చి ఒకటో తేదీన రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడి సమాచారం అందిస్తే రూ.10 లక్షల బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బుధవారం ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేసింది. కేఫ్‌లోకి అడుగుపెట్టేటపుడు ఆ వ్యక్తి క్యాప్, మాస్క్, కళ్లద్దాలు ధరించి ఉన్నాడని ఎన్ఐఏ పేర్కొంది. నిందితుడు జాడ తెలిపిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎన్ఐఏ హామీ ఇచ్చింది. ఈస్ట్ బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో జరిగిన ఈ పేలుడు ఘటనలో 10 మంది గాయపడ్డారు. శక్తివంత పేలుడు పదార్థం(ఐఈడీ) వాడటంతో కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకు అప్పగించడం తెల్సిందే. మొదట కర్ణాటక పోలీసులు కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం, పేలుడు పదార్థాల చట్టాల కింద కేసు నమోదుచేశారు. ముంబైలో నవంబర్ 26న ఉగ్రదాడి తర్వాత ప్రత్యేకంగా ఉగ్రసంబంధ ఘటనలపై దర్యాప్తు కోసం ఎన్ఐఏను 2008లో ఏర్పాటుచేశారు.

జంట సిలిండర్ల పేలుళ్లు

ఒకే కుటుంబంలో ఐదుగురి దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఇంట్లో రెండు వంటగ్యాస్ సిలిండర్లు పేలిన దుర్ఘటనలో ఒకే కుటుంబంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్ర కాలిన గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. కకోరీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హటా హజీరత్ సాహెబ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు అంటుకోవడంతో సిలిండర్లు పేలిపోయినట్లు వార్తలొచ్చాయి. మంగళవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో తొమ్మిదిమంది కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్న సమయంలో ఈ పేలుళ్లు సంభవించాయి. గాయపడిన వారినందరినీ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ ఇంటిని బాణసంచా తయారీ కోసం వినియోగించే వారు అని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. అయితే దర్యాప్తు కొనసాగుతోందని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని జిల్లా మేజిస్ట్రేట్ సూర్యపాల్ గంగ్వార్ అన్నారు.

కేజ్రీవాల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వండి

కోర్టులో మరో పిటిషన్ వేసిన ఈడీ

న్యూఢిల్లీ: వరుస సమన్లను బేఖాతరు చేస్తూ విచారణకు గైర్హాజరైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు ఢిల్లీ స్థానిక కోర్టు అనుమతి కోరుతూ ఈడీ తాజాగా మరో పిటిషన్ దాఖలుచేసింది. మూడు సమన్లకు స్పందించలేదంటూ అప్పట్లోనే ఢిల్లీ కోర్టులో ఈడీ పిటిషన్ వేయడం తెల్సిందే. దాని విచారణ మార్చి 16కు వాయిదా పడింది. తర్వాత కూడా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేసింది. 8 సమన్లు జారీ చేసినా గైర్హాజరైనందున ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాలంటూ తాజాగా మరో పిటిషన్ వేసింది. దీనిపై గురువారం విచారణ జరగనుంది.

త్రిపురలో బీజేపీ సర్కారుకు మోతా మద్దతు!

అగర్తలా: త్రిపురలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన తిప్రా మోతా పార్టీ నేరుగా అధికార బీజేపీకి మద్దతు పలుకుతున్నట్లు బీజేపీ సీనియర్ నేత ఒకరు బుధవారం ప్రకటించారు. 60 సభ్యులుండే త్రిపుర అసెంబ్లీలో మోతాకు 13 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రభుత్వానికి దాని మద్దతు ఇస్తున్న నేపథ్యంలో వారిలో ఇద్దరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశముంది. త్రిపుర ఆదివాసీల అన్ని డిమాండ్ల సాధనకు కట్టుబడి ఉంటామని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, మాణిక్ సాహా నేతృత్వంలోని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలోనే ఈ త్రిముఖ ఒప్పందం కుదిరిందని తెలుస్తోంది. ''సార్వత్రిక ఎన్నికల్లోపే బీజేపీ–ఐపీఎఫ్‌టీ కూటమి ప్రభుత్వంలో తిప్రా మోతా కలవనుంది. మంత్రుల ప్రమాణస్వీకార తేదీ త్వరలో ప్రకటిస్తాం'' అని త్రిపుర బీజేపీ చీఫ్ రజీబ్ చెప్పారు.

ఎర్రసముద్రంలో హౌతీ దాడులు.. ఇద్దరి మృతి

దుబాయ్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ మారణకాండకు తీవ్రంగా తప్పుబడుతూ అందుకు ప్రతిగా ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలను లక్ష్యంగా చేసుకున్న హౌతీ తిరుగుబాటుదారులు తమ దాడులను ఉధృతం చేశారు. దీంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హౌతీ దాడుల్లో మరణాలు సంభవించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఎర్ర సముద్ర పరిధిలోని గల్ఫ్ ఆఫ్ ఆడెన్ వద్ద ఈ ఘటన జరిగింది. బుధవారం గ్రీస్ దేశానికి చెందిన బార్బడోస్ జెండాతో వెళ్తున్న వాణిజ్యనౌక 'ట్రూ కాన్ఫిడెన్స్'పై హౌతీలు మిస్సైల్ దాడి జరపగా నౌకలోని ఇద్దరు సిబ్బంది చనిపోయారు. ఇతర సిబ్బంది పారిపోయారు. నౌకను వదిలేశామని, అది తమ అధీనంలో లేదని చెప్పారు. తమ యుద్ధనౌకలపైకి హౌతీ రెబెల్స్ నౌక మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించడంతో అమెరికా విధ్వంసక నౌకలు రెచ్చిపోయాయి. హౌతీలు ఉంటున్న యెమెన్ భూభాగంపై దాడి చేసి హౌతీ క్షిపణులు, డ్రోన్లను ధ్వంసంచేసింది. హౌతీల దాడుల్లో మరణాలు నమోదవడంతో ఆసియా, మధ్యప్రాచ్యం, ఐరోపాల మధ్య సముద్ర రవాణా రంగంలో సంక్షోభం మరింత ముదిరింది. హౌతీలపై అమెరికా దాడులపై ఇరాన్ మండిపడింది. అమెరికా ఇంధన సంస్థ షెవ్రాన్ కార్ప్‌కు చేరాల్సిన కువైట్ చమురును తోడేస్తామని హెచ్చరించింది. రూ.414 కోట్ల విలువైన ఆ చమురును తీసుకెళ్తున్న నౌకను ఇరాన్ గతేడాది హైజాక్ చేసి తమ వద్దే ఉంచుకుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 7 : మార్చి : 2024

ధరలు, నిరుద్యోగాన్ని అరికట్టాలని బుధవారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో వామపక్ష కార్యకర్తల నిరసన. కేంద్ర, రాష్ట్ర సర్కార్లు ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలని కోరారు



న్యూస్‌రీల్

మండ్య బీజేపీ టికెట్ నాదే: సుమలత



ఓ కార్యక్రమంలో ఎంపీ సుమలత

మండ్య: ప్రధాని నరేంద్ర మోదీ లాంటి నాయకుడు మనకు, మన దేశానికి ప్రధానిగా ఉండడం మన సౌభాగ్యమని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని మండ్య స్వతంత్ర ఎంపీ సుమలత అంబరీష్ చెప్పారు. మండ్య బీజేపీ టికెట్ లభిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. బుధవారం మండ్యలో ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మీడియాతో మాట్లాడుతూ మండ్య ప్రజల కోసం నిరంతరం పాటుబడ్డానని అన్నారు. మండ్య బీజేపీ టికెట్ ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, అందువల్ల ఇక్కడి నుంచి పోటీ చేస్తానని చెప్పారు. ఒకవేళ జేడీఎస్‌తో పొత్తు వల్ల మండ్య బీజేపీ టికెట్ రాకపోతే స్వతంత్రంగా పోటీలో ఉంటానని తెలిపారు. కన్నడిగుల స్వాభిమానాన్ని చాటిన కదంబ చక్రవర్తి మయూర వర్మ, ఇమ్మడి పులకేశి విగ్రహాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

అత్త పోవాలని కోడలి మొక్కు

యశవంతపుర: అత్తా కోడళ్ల మధ్య గొడవలు లేని ఇల్లంటూ ఉండదు. కానీ ఓ కోడలి కసి చాలా తీవ్రంగా ఉంది. మా అత్త తొందరగా పరలోకం చేరాలని కోడలు యాభై రూపాయల నోటుపై రాసి హుండీలో వేసింది. ఉత్తర కన్నడ జిల్లా గాణగాపుర దత్తాత్రేయ దేవస్థానంలో బుధవారం హుండీ డబ్బులను లెక్కిస్తుండగా ఆ నోటు లభించింది. మా అత్త తొందరగా చావాలంటూ రాసి ఉంది. ఆలయ సిబ్బంది నోటుని ఫోటో తీసి జన మాధ్యమంలో ఉంచారు. అత్తపై కోడలికి అంత కోపం ఎందుకు ఉందో.. అని నెటిజన్లు స్పందించారు.

పేలుడు నిందితుడు ఇతడే

- జాడ చెబితే రూ.10 లక్షల కానుక



బనశంకరి: సిలికాన్ సిటీలో వైట్‌ఫీల్డ్ కుందలహళ్లిలోని రామేశ్వరం కెఫెలో ఈ నెల 1న జరిగిన బాంబుపేలుడు కేసులో ఎన్ఐఏ బుధవారం నిందితుని ఫోటోను విడుదల చేసింది. ఇతని ఆచూకీ తెలిపిన వారికి రూ.10 లక్షలు బహుమానం ఇస్తామని ప్రకటించింది. కెఫెలో బాంబు పేలుడుకు పాల్పడ్డాడని, మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్ అని తెలిపింది. ఇతడి జాడ తెలిస్తే 080-29510900, 8904241100 నంబర్లకు కాల్ చేసి చెప్పవచ్చని, వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని తెలిపింది. కెఫెలో బాంబు పెట్టి వెళ్లిపోయిన వ్యక్తిని పోలీసులు ఇప్పటికీ పట్టుకోలేకపోయారు. అతడు దొరికితే తప్ప కేసు ముందుకు సాగదు. దీంతో ప్రజల సహకారం కోరారు.

లంచగొండి ఆర్ఐ పట్టివేత



ఆర్ఐ వినాయక్

శివమొగ్గ: ఒక మహిళ నుంచి రూ. 40 వేల లంచం తీసుకుంటూ జిల్లాలోని సొరబ పురసభ రెవెన్యూ శాఖ ఇన్స్‌పెక్టర్ వినాయక్ లోకాయుక్తకు పట్టుబడ్డారు. వివరాలు.. ఉత్తర కన్నడ జిల్లాలోని హొన్నవారకు చెందిన ఎం. ప్రతిభా నాయక్ అనే మహిళకు సొరబ తాలూకాలోని హళె సొరబ గ్రామంలో ఖాళీ స్థలం ఉంది. అది పురసభ పరిధిలో ఉంది. స్థలానికి పురసభలో ఖాతా, ఇ- స్వత్తు చేయించింది. అయితే సిబ్బంది తక్కువ విస్తీర్ణాన్ని నమోదు చేయడంతో ఆమె దానిని సవరించాలని గత నెలలో ఆర్ఐ వినాయక్‌కు అర్జీ ఇచ్చింది. ఆయన రూ.50 వేలు ముడుపులు అవసరమని సూచించాడు. దాంతో ఆమె శివమొగ్గ లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఆఫీసులో రూ. 40 వేలు తీసుకుంటూ వినాయక్ దొరికిపోయాడు. డబ్బును సీజ్ చేసి, అతనిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

త్వరలోనే బీజేపీ అభ్యర్థుల జాబితా

దొడ్డబళ్లాపురం: రెండు మూడు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పేర్లను బీజేపీ ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థుల ఖరారు కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఢిల్లీకి వెళ్లారు. రాష్ట్రంలో కొందరు ప్రస్తుత ఎంపీలకు టికెట్ దక్కదనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈసారి కొందరు కొత్తవారికి అవకాశం కల్పించవచ్చని సమాచారం. మొదట 20 ఎంపీ స్థానాల అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే ఉన్నతస్థాయి భేటీ తరువాత జాబితా విడుదల ఉండవచ్చు. దక్షిణాదిలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కర్ణాటకలో బీజేపీకి 25 మంది ఎంపీలు ఉన్నారు.

పబ్లిక్ పరీక్షలు లేనట్టే

- సర్కారు ఉత్తర్వులు హైకోర్టులో కొట్టివేత
- 5, 8, 9, పీయూసీ ఫస్టియర్ విద్యార్థులకు ఊరట!





పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైతే తదుపరి తరగతికి వెళ్లే అవకాశం ఉండదు

బనశంకరి: స్టేట్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో 5, 8, 9 తరగతులు, పీయూసీ ఫస్టియర్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి బోర్డు పబ్లిక్ పరీక్ష నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలను హైకోర్టు బుధవారం రద్దు చేసింది. ఎలాగైనా బోర్డు పరీక్షలు జరపాలన్న సర్కారుకు షాక్ తగిలింది. స్టేట్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో పై తరగతుల విద్యార్థులకు రాష్ట్రస్థాయి మండలి పరీక్ష నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులిచ్చింది.


ఏమిటీ విషయం?

సాధారణంగా ఈ తరగతుల వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు పాస్ మార్కులు రాకపోయినా తదుపరి తరగతికి పంపించడం ఆనవాయితీ. అలా కాకుండా ఎస్ఎస్ఎల్‌సీ తరహాలో పబ్లిక్ పరీక్షలను జరుపుతారు, వాటిలో పాసైతేనే పై తరగతికి వెళ్లొచ్చు, ఫెయిలైతే మళ్లీ ఆ చాన్సు ఉండదు. దీని వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుందని, ఫెయిలై చదువును విడిచిపెట్టే వారు పెరుగుతారని విద్యావేత్తలు గతంలోనే ఆందోళన వెలిబుచ్చారు.

వ్యతిరేకిస్తూ కోర్టులో కేసు..

సర్కారు నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల సంఘం హైకోర్టులో కేసు వేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల పాఠ్యాంశాలు వేర్వేరుగా ఉంటాయని, ఉమ్మడిగా పరీక్షలు రాయడం ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు కష్టమని పిటిషనర్ న్యాయవాదులు వాదించారు. విద్యార్థులందరికీ వర్తించేలా బోర్డు స్థాయి పరీక్ష నిర్వహణకు అవకాశం ఇవ్వరాదని మనవిచేశారు. న్యాయమూర్తి జస్టిస్ రవి హొసమనితో కూడిన ధర్మాసనం విచారించి, సర్కారు ఉత్తర్వులు సబబు కాదని స్పష్టం చేసింది.

ప్రభుత్వ న్యాయవాదికి చుక్కెదురు..



ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ కలికా చేతరిక కూడా పాఠ్యాంశంలో భాగమేనని, సాధారణ పాఠ్యాంశాలతోనే సిద్ధం చేశారని, ప్రశ్నాపత్రాల్లో పాఠ్యాంశాల్లో లేని ప్రశ్నలు లేవని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించడానికి అవకాశం కల్పించాలని మనవి చేసినప్పటికీ హైకోర్టు సమ్మతించలేదు. దీంతో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్ణయించిన బోర్డు పరీక్షలు రద్దయినట్లే. తీర్పుపై ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు హర్షం వ్యక్తంచేశాయి. పరీక్షల పేరుతో పిల్లలను గాభరా పెట్టరాదని తెలిపాయి.



బెంగళూరులో ఓ ప్రముఖ వైద్య కళాశాలలో బుధవారం స్నాతకోత్సవ సంబరం. అధిక పతకాలు సాధించిన ఎంబీబీఎస్ పట్టభద్రుల ఆనందహేల

పెళ్లిరోజు కానుక ఇవ్వలేదని..

- భర్తను పొడిచిన భార్య

కృష్ణరాజపురం: పెళ్ళి రోజున భర్త వజ్రాల నెక్లెస్ కాకపోయినా చిన్న బంగారం ఉంగరమైనా ఇస్తాడని ఆశిస్తే.. ఎలాంటి కానుక ఇవ్వకపోవడంతో చాకుతో పొడిచిందో భార్య. ఈ సంఘటన బెంగళూరులో బెల్లందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జున్నసంద్రలో జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ మహిళ రియా ఘోష్ కాగా, బాధితుడు పార్థ ప్రతిమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన ప్రకారం ఫిబ్రవరి 27వ తేదీన రియా ఘోష్, పార్థప్రతిమ్‌ల పెళ్లిరోజు. వారి స్వస్థలం పశ్చిమబెంగాల్ కాగా బెంగళూరుకు వలసవచ్చి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. భర్త ఏ బహుమానం ఇవ్వలేదని గొడవపడిన భార్య ఆగ్రహం పట్టలేక వంటింట్లో ఉన్న చాకుతో భర్తను కడుపులో పొడిచింది. గాయపడిన అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. బంధువు చనిపోవడం వల్ల పెళ్లి రోజున కానుకను ఇవ్వలేకపోయినట్లు బాధితుడు తెలిపాడు. దాంతో ఆమె దాడి చేసిందని వాపోయాడు.



దంపతులు రియా, పార్థ (ఫైల్)

ఎండాకాలం.. జబ్బుల సీజన్



ఫ్రూట్ సలాడ్ మంచిదే కానీ, కలుషితమైతే రోగాలు తప్పవు



నగరంలో దుమ్ముధూళి వాతావరణం మరో సమస్య

- బెంగళూరులో పెరిగిన శ్వాసకోశ సమస్యలు
- ఆస్పత్రులకు జనం క్యూ
- కలుషిత పదార్థాలు, దుమ్ముధూళితో ఇబ్బంది



బనశంకరి: ఈసారి వర్షాలు తగ్గడంతో నీటి కొరత తీవ్రంగా నెలకొంది. శుభ్రమైన మంచి నీటికి కటకట ఏర్పడింది. సిలికాన్‌సిటీలో వాతావరణ పరిస్థితులే మారిపోగా జనవరి నుంచి వేసవి వాతావరణం పీడిస్తోంది. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో నగరవాసులు అల్లాడుతున్నారు. మరోపక్క వేడి గాలి, దుమ్ము ధూళి వల్ల నగరవాసుల్లో గొంతునొప్పి సమస్య వ్యాపిస్తోంది. ప్రారంభంలో గొంతు నొప్పి ఏర్పడి తరువాత జలుబు, దగ్గు, తలనొప్పి, చేతులు కాళ్లు నొప్పులతో జ్వరం వస్తోంది.

చల్లని పదార్థాలతో..

నిత్యం పనుల మీద బయటికి వెళ్లే ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం చల్లని పానీయాలు, చెరుకు రసం, మజ్జిగ వంటి ద్రవాలు, ఐస్‌క్రీమ్, పండ్ల సలాడ్ వంటివి ఆరగిస్తారు. నగరంలో వీధుల్లో ఎక్కడ చూసినా వీటిని విక్రయిస్తుంటారు. అయితే ఇటువంటి పదార్థాలు సులభంగా గొంతునొప్పి, జలుబుకు కారణమవుతాయి. బెంగళూరు విక్టోరియా ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగంలో నిత్యం 25-30 మంది ఈ జబ్బులతో వస్తున్నారు. కేసీ జనరల్ ఆసుపత్రి, ఇందిరాగాంధీ చిన్నపిల్లల ఆసుపత్రి, వాణి విలాస్ ఆసుపత్రుల్లోనూ ఈ రోగుల తాకిడి పెరిగినట్లు వైద్యులు తెలిపారు.

దుమ్ము ధూళి బెడద

అలర్జీ సమస్య ఉండేవారికి దుమ్ము ధూళి వాతావరణం చాలా ప్రమాదం. వాహనాలు, పరిశ్రమల పొగ రసాయనాల వల్ల అలర్జీ తలెత్తుతుంది. రోగనిరోధక శక్తి తక్కువ ఉండేవారిలో వేగంగా విస్తరిస్తుంది. దీంతో బయటకు వెళ్లేవారు మాస్కు ధరించడం, శుభ్రత పాటించడం ముఖ్యం. ఎక్కడబడితే అక్కడ తింటూ ఉంటే ఆరోగ్యానికి ఇబ్బందేనని వైద్యులు తెలిపారు.

స్ట్రా వాడొద్దు..

కొబ్బరి నీళ్లు, జ్యూస్, మజ్జిగ తో పాటు చల్లని పానీయాలను సేవించేటప్పుడు చాలా వరకు స్ట్రా వినియోగిస్తారు. కానీ ఇది ప్రమాదకరం, స్ట్రాలో అతి సూక్ష్మమైన ధూళి కణాలు ఉండొచ్చు, బ్యాక్టీరియా కూడా చేరవచ్చు. వీటి వినియోగంతో గొంతు నొప్పి సమస్యలు వచ్చే ప్రమాదముంది. స్ట్రా లేకుండా పానీయాలు తాగడం ఉత్తమం.

నిర్లక్ష్యం చేయరాదు..

వేసవిలో బయటికి వెళ్లినప్పుడు ధూళి నుంచి కాపాడుకోవాలి. తరచూ మంచినీరు తాగాలి. రోడ్ల మీద తినేటప్పుడు జాగ్రత్త పాటించాలి. నిర్లక్ష్యం చేస్తే గొంతు నొప్పి వైరస్ శ్వాసకోశానికి ప్రబలే అవకాశం ఉంది. సొంత వైద్యం చేసుకోకుండా ఆస్పత్రికి వెళ్లాలని బెంగళూరు వైద్య పరిశోధనా సంస్థ ఈఎన్‌టీ చీఫ్ డాక్టర్ కార్తీక్ శామణ్ణ తెలిపారు.



ఉద్యోగ భద్రత కల్పించాలని వసతి పాఠశాలల గెస్ట్ టీచర్ల ఆందోళన. బెంగళూరు స్వతంత్ర ఉద్యానంలో ధర్నా నిర్వహించారు

ఇంటి ముందే హత్యాకాండ

దొడ్డబళ్లాపురం: పాతకక్షలతో ఒకరిని హత్య చేసిన సంఘటన హారోహళ్లి తాలూకా గళకమలె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామవాసి రవికుమార్ (26) బెంగళూరులో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ, ఇటీవలే ఆటో అమ్మేసి ఊరికి వచ్చాడు. మంగళవారం రవికుమార్ ఇంటికి వచ్చిన కొందరు దుండగులు రవి ఎక్కడున్నాడు? ఈరోజు చంపేస్తాం అని గొడవ చేసారు. రాత్రి 11 గంటల వరకూ ఇంటి వద్దే కాపుకాచిన దుండగులు రవికుమార్ ఇంటి వద్దకు రాగానే కత్తితో దాడిచేసి గొంతు, చెవి కోసి పరారయ్యారు. గ్రామస్తులు తక్షణం రవిని కగ్గలీపుర ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. తిమ్మరాజు, అంజని, హేమంత్, బాబు అనే నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యతో గ్రామంలో భయాందోళన నెలకొంది.

ఎస్ఐపై సస్పెన్షన్ తొలగింపు

దొడ్డబళ్లాపురం: ఇటీవల రామనగర ఐజూరులో ఒక గొడవలో 40 మంది లాయర్లపై కేసు నమోదు చేయడంతో వకీళ్లు భారీఎత్తున ధర్నాలు చేయడం తెలిసిందే. వారి డిమాండ్ మేరకు ఎస్ఐ సయ్యద్ హుసేన్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ సస్పెన్షన్‌ను 1వ తేదీన ఐజీపీ బీఆర్ రవికాంతేగౌడ తొలగించారు. ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని చెన్నపట్టణ డీఎస్పీని జిల్లా ఎస్పీ ఆదేశించారు. సీసీ కెమెరా చిత్రాలు, ప్రత్యక్ష సాక్షుల విచారణ ద్వారా ఎస్ఐ తప్పు లేదని నివేదిక ఇవ్వడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు తెలిసింది.

క్యాంటర్ బోల్తా, ముగ్గురి మృతి

యశవంతపుర: క్యాంటర్ బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన గదగ జిల్లా ముండరగి తాలూకా హళ్లిగుడి వద్ద జరిగింది. ప్రమాదంలో నవీన్ కుంభార్ అనే యువకుడు అక్కడికక్కడే మరణించాడు. నాగప్ప కాళి (23), గంగప్ప అక్కి (22)లకు బలమైన గాయాలు కాగా, జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. వీరందరూ ధారవాడ జిల్లా కుందగోళ తాలూకా హిరేనర్తి వాస్తవ్యులు. పని మీద క్యాంటర్‌లో బయల్దేరగా అతివేగంతో వెళ్తూ బోల్తా పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి బయట పడి పరారయ్యాడు.

అయ్యో పాపం మొసలి



చనిపోయిన మొసలి

మైసూరు: గుర్తు తెలియని వాహనం మీద నుంచి వెళ్లడంతో ఓ మొసలి ప్రాణాలు విడిచింది. ఈ సంఘటన మైసూరు నగరంలోని పాత కేసరెలో కామనకెరె హుండి చెరువు వద్ద జరిగింది. మంగళవారం రాత్రి చెరువులో నుంచి మొసలి రోడ్డు మీదకు రాగా వాహనం దూసుకెళ్లి ఉంటుందని అనుమానిస్తున్నారు. బుధవారం ఉదయం చచ్చి పడి ఉన్న మొసలిని చూసి స్థానికులు అటవీ సిబ్బందికి తెలిపారు. వారు పరిశీలించి కళేబరాన్ని తీసుకెళ్లారు. ఇటీవల నగర శివార్లలో వాహనం ఢీకొని అరుదైన పునుగు పిల్లి చనిపోవడం తెలిసిందే.

చిన్నారిని కడతేర్చి తల్లి ఆత్మహత్య

బనశంకరి: కుటుంబ కలహాలతో ఓ తల్లి కర్కోటకురాలిగా మారింది. ఏడాదిన్నర వయసున్న కుమార్తెను తన చేతులతోనే కడతేర్చి పేగు బంధాన్ని తెంచుకుంది. ఆపై తాను ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన ఐటీ సిటీ బన్నేరుఘట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. శ్యానుబోగనహళ్లి నివాసి ఉషారాణి(21)కి షణ్ముగప్రియ అనే ఏడాదిన్నర వయసున్న కుమార్తె ఉంది. ఉషారాణి భర్త ఆటోడ్రైవర్ మాయవలన్. భర్తతో గొడవ పడి చిన్నారికి చీరతో ఉరివేసి, అదే చీరతో ఆమె కూడా ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖాతాదారుల సొమ్ము స్వాహా

- చిక్కలో బ్యాంకు ఉద్యోగిని స్కాం

చిక్కబళ్లాపురం: బ్యాంకులో డబ్బులు భద్రంగా ఉంటాయని చాలామంది అక్కడే దాచుకుంటారు. అకౌంట్లలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉంచేస్తారు. కానీ కొందరు ఘరానా ఉద్యోగులు జనం సొమ్మును స్వాహా చేయడం పరిపాటిగా మారింది. వివరాలు.. చిక్కబళ్లాపురంలో బిబి రోడ్డులో ఉన్న ఎస్‌బిఐ బ్యాంకులో ఇలాగే జరిగింది. ఖాతాదారుల అకౌంట్ల నుంచి ఆర్. రశ్మి అనే ఒక మహిళా ఉద్యోగిని రూ. 27 లక్షల 69 వేలను భర్త సతీష్ కుమార్, తల్లిదండ్రులు, బంధువులు మాలాశ్రీ, పుష్పలత, శిల్ప, శ్రీనిధి, దేవిక, జ్యోతమ్మ, లక్ష్మి, లోకేశ్, రత్నమ్మ, మీనాక్షి అనేవారి ఖాతాలకు బదిలీ చేసింది. 2014 నుంచి 2019 వరకు ఈ దందా కొనసాగింది. కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసి ఆమె జనం డబ్బును యథేచ్ఛగా బంధువులకు మళ్లించింది. ఖాతాల్లో డబ్బులు మాయమైనట్లు ఇటీవల గుర్తించిన కొందరు డిపాజిటర్లు బ్యాంకు మేనేజర్ ఇశాని చట్నోరాజ్ ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన చిక్కబళ్లాపురం నగర పోలీస్ స్టేషన్‌లో రశ్మి బాగోతంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రెండు ఇళ్లు దగ్ధం

మైసూరు: మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని కల్మళ్ళి గ్రామంలో అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు కాలిపోయాయి. బసవరాజప్ప, ప్రేమమ్మ రెండు ఇళ్ళు పక్క పక్కనే ఉంటాయి. మంగళవారం అర్ధరాత్రి కరెంటు వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఇళ్లలోనివారు బయటకు పరుగులు తీశారు. కొంతసేపటికే రెండు ఇళ్లు కూడా కాలిపోయాయి. బట్టలు, ధాన్యం, విలువైన సొత్తు బూడిదైంది. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కొన్నిగంటల తరువాత ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 80 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు విలపించారు.

బాంబు పేలుళ్ల కారకులను బంధించాలి



ర్యాలీగా వెళ్తున్న బీజేపీ శ్రేణులు



అరెస్టు చేస్తున్న పోలీసులు

తుమకూరు: బాంబుపేలుళ్లకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు ఉద్యమించాయి. తుమకూరు నగర బీజేపీ ఎమ్మెల్యే జ్యోతిగణేష్, జిల్లా అధ్యక్షుడు హెబ్బాకరవిలు బుధవారం తుమకూరులో ఆందోళనకు దిగారు. ధర్నాలో పాల్గొనేందుకు భజరంగదళ్ నాయకుడు పుత్తూరు మురళీకృష్ణ రాగా పోలీసులు అతన్ని అడ్డుకొని అరెస్ట్ చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ బీజేపీ శ్రేణులు కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకొని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



తనిఖీలు ముమ్మరం

బెంగళూరులో హోటల్లో పేలుడు తరువాత బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు పెరిగాయి. బుధవారం మెజిస్టిక్ కెంపేగౌడ బస్టాండులో సోదాలు చేస్తున్న పోలీసులు. రద్దీ ప్రదేశాలలో గస్తీ కూడా పెరిగింది

క్లుప్తంగా

పగిలిన తాగునీటి పైపు లైన్

- మూడు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- నానాఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు



తాగునీటి పైపులైన్‌తో పగిలి చుట్టు పక్కల పొలాల్లోకి చేరిన నీరు

రాయచూరు రూరల్: నగరానికి తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్ యరమరస్ పంప్ హౌస్ వద్ద పగిలి పోవడంతో మంగళవారం సాయంత్రం నీటి సరఫరా నిలిచిపోయింది. నీరు చుట్టు పక్కల పొలాలు, పరిసరాల్లోకి చేరాయి. కృష్ణా నది నుంచి నిర్మించిన రెండో దశ తాగునీటి పథకం పైపు లైన్ లీక్ కావడంతో ఆ నీరు వృథాగా పోతున్నాయి. నగరసభ కమిషనర్, నీటి సరఫరా అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు. వానలు లేక నదుల్లో నీరు లేకపోవడంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి పైపు లైన్ పగిలి రోడ్డు పక్కన నీరు వృథాగా ప్రవహిస్తున్నా అడిగేవారు కరువయ్యారు.

11, 12 తేదీల్లో ఆనెగుంది ఉత్సవం



లోగో విడుదల చేస్తున్న మంత్రి తంగడిగి, ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి

గంగావతి: ఆనెగుంది ఉత్సవాన్ని ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించాలని తీర్మానించారు. అంజనాద్రి బెట్ట వద్ద వాహనాల పార్కింగ్ కోసం జరిగిన వేలంలో రూ.24.95 లక్షలు పలికింది. 23 మంది వేలంలో పాల్గొనగా, శివపురకు చెందిన గోపి రూ.24.95 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారు. ఆయన వరుసగా మూడో సారి ఈ పార్కింగ్ వేలాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది రూ.13 లక్షలకు ఈయన పాడగ ఈ ఏడాది అంతకన్నా రెట్టింపు ధరకు పాడారు.

లోగో విడుదల

ఆనెగుంది ఉత్సవం లోగోను కొప్పళ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడిగి విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ ఆనెగుంది ఉత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా ప్రజలు సహాయ సహకారాలను అందించి విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి కూష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, కొప్పళ జిల్లాధికారి నళిన్ అతుల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని జంగ్లి రాంపుర గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. 2022–23వ ఏడాది కళ్యాణ కర్ణాటక ప్రదేశ అభివృద్ధి మండలి మెగా మైక్రో పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతనంగా నిర్మించారు. దీనిని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శిశు అభివృద్ధి పథకం అధికారి ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగపు అధికారి ఈరమ్మ, జీపీ పీడీఓ శ్రీనివాస్ పత్తార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని ఈరమ్మ, సహాయకురాలు పార్వతిబాయి, జీపీ సభ్యులు బాబురెడ్డి, దండప్ప రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. లాయర్ మృతి



గుంతలో పడిన కారు (ఇన్‌సెట్‌లో) మృతుడు ముబారక్(ఫైల్)

చింతామణి: కారు బోల్తాపడి లాయర్ మృతి చెందిన ఘటన బెంగళూరు–మదనపల్లి రోడు తాడిగోల్ వద్ద బుధవారం జరిగింది. ముబారక్ (33) అనే వ్యక్తి చింతామణిలో లాయర్‌గా పనిచేస్తున్నాడు. పట్టణంలోని ట్యాంక్‌బండ్ వద్ద నివాసం ఉంటున్నాడు. ఈయన కారులో గౌనిపల్లి వెళ్తుండగా తాడిగోల్ వద్ద వాహనం అదుపు తప్పి గుంతలో పడింది. కారు అద్దాలు బద్దలై తలలోకి చొచ్చుకెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని గౌనిపల్లి పోలీసులు తెలిపారు.

బోర్డులు కన్నడలోనే ఉండాలి

మైసూరు: దుకాణదారులు, హోటల్స్, రెస్టారెంట్ యజమానులు బోర్డులను కన్నడలోనే ఏర్పాటు చేసుకోవాలని కన్నడ చళువళి వాటాళ్ పార్టీ అధ్యక్షుడు వాటాల్ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన మైసూరులో విలేకరులతో మాట్లాడారు. 60– 40 సైజులో బోర్డులు ఉండాలని, లేని పక్షంలో జరిమానాలు తప్పవని హెచ్చరించారు. కన్నడలోనే బోర్డులు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారి చేసిందన్నారు.

పౌష్టికాహార లోపం.. భవితకు శాపం

- జిల్లాలో 1333 మంది పిల్లల్లో ఎదుగుదల లేమి
- స్త్రీశిశు సంక్షేమశాఖ డీడీ నారాయణస్వామి వెల్లడి



అపౌష్టికత బారిన పడిన చిన్నారులు

కోలారు: గర్భావస్థలో ఉన్న సమయంలో పౌష్టిక ఆహార కొరత, అవధి పూర్వ జననాలు తదితర కారణాల వల్ల జిల్లాలో 1333 మంది పిల్లలు అపౌష్టికతతో బాధపడుతున్నారని స్త్రీశిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణస్వామి తెలిపారు. జిల్లాలోని ఆరు తాలూకాల్లో కలిపి 109 మంది పిల్లల్లో తీవ్ర అపౌష్టికత ఉండగా 1224 మంది పిల్లలు సాధారణ అపౌష్టికతను కలిగి ఉన్నారన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అందించిన వివరాల ప్రకారం 2023 డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాలో మొత్తం 84,671 మంది పిల్లల బరువులను పరీక్షించారన్నారు. వారిలో 1,333 మంది పిల్లల్లో అపౌష్టికత కనిపించిందన్నారు. మొత్తం పిల్లల ప్రమాణంతో పోలిస్తే జిల్లాలో 1.57 శాతం మంది పిల్లల్లో అపౌష్టికతను నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను వెచ్చించి వివిధ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు.

క్షీణించిన శారీరక ఎదుగుదల

అయితే పిల్లల శారీరక ఎదుగుదల మాత్రం అనుకున్నంత ప్రమాణంలో లేదన్నారు. పెరుగుతున్న బాల్యవివాహాలు, సామాజిక ఆర్థిక కారణాలు జిల్లాలో పిల్లల అపౌష్టికత పెరుగుదలకు కారణమవుతున్నాయన్నారు. పిల్లల్లో అపౌష్టికత నివారణ జిల్లా యంత్రాంగానికి సవాలుగా పరిణమించిందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు తాలూకాలోనే అపౌష్టికత ఎక్కువగా కనిపిస్తోందన్నారు. తాలూకాలో 576 మంది పిల్లలు తీవ్ర, సాధారణ అపౌష్టికతను కలిగి ఉన్నారన్నారు. అనంతర స్థానం శ్రీనివాసపుర తాలూకాదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అపౌష్టికత కలిగిన పిల్లలపై దృష్టి పెట్టారన్నారు. జిల్లాలో ప్రతి తాలూకాకు ఒకరు చొప్పున నోడల్ అధికారిని నియమించారన్నారు,. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువును కొలుస్తున్నారన్నారు. అపౌష్టికత కలిగిన పిల్లలకు పౌష్టికాహారం ఇస్తున్నామన్నారు. పిల్లల్లో అపౌష్టికత, రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించి నియంత్రించడానికి సముదాయ ఆరోగ్య అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు.

అపౌష్టికతతో చిన్నారుల మృత్యువాత

వయస్సు, ఎత్తుకు తగిన బరువు, చర్మం ఆధారంగా పిల్లల్లో అపౌష్టికతను గుర్తిస్తున్నారన్నారు. తీవ్ర అపౌష్టికతతో ఐదేళ్లలోపు వయస్సు పిల్లలు మరణించే అవకాశం ఉందన్నారు. కోవిడ్ తరువాత అపౌష్టికతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి విద్యార్థులకు పౌష్టిక ఆహారంగా రాగిమాల్ట్ ఇచ్చే కార్యక్రమాన్ని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వెన్నతో కూడిన పాలు, కోడిగుడ్డు, అరటి పండు, వేరుశెనగ చిక్కీ అందిస్తోందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ పిల్లలకు కూడా పౌష్టిక ఆహారం అందిస్తున్నారన్నారు. అపౌష్టికతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించే కార్యక్రమం నిరంతరంగా జరుగుతోందన్నారు. పిల్లల్లో అపౌష్టికత కనిపిస్తే తగిన చికిత్సను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతి



సంతోష్(ఫైల్)

యశవంతపుర: జీపు ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన మంగళూరు–కాసరగోడు జాతీయ రహదారిపై జరిగింది. మృతుడిని కోల్క గ్రామానికి చెందిన సంతోష్‌బెళ్లాడ(45)గా పోలీసులు గుర్తించారు. అరటి పండ్ల వ్యాపారైన సంతోష్ మంగళవారం సాయంత్రం పనులు ముగించుకొని బైకులో ఊరుకు బయల్దేరాడు. ఓ వ్యక్తి గంజాయి మత్తులో జీపును నడుపుతూ తొలుత బైక్‌ను, తర్వాత కారును ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయలు కావటంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఉళ్లాల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దెయ్యం ఆవహిస్తోందని ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న రుషభేంద్ర

మైసూరు: తనకు దెయ్యం ఆవహించి హింసిస్తోందని ఆవేదనతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన మైసూరులో జరిగింది. మార్బళ్లి గ్రామానికి చెందిన రుషభేంద్ర(21) మైసూరులో ఉంటూ పీయూసీ చదువుతున్నాడు. తనకు దెయ్యం ఆవహించి హింసకు గురి చేస్తోందని నాలుగైదు సంవత్సరాలుగా తన బంధువులతో చెప్పుకొని బాధపడేవాడు. ఈ సమస్యకు పరిష్కారం లభించక మనోవేదనకు గురై చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కువెంపు నగర పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

దళితులు సీఎం కాలేక పోతున్నారు

యశవంతపుర: కాంగ్రెస్ పార్టీలో దళిత సీఎం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. దళితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి దక్కడం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప ఆవేదన వ్యక్తం చేశారు. బెంగళూరులో జరిగిన దళిత వర్గాల ఉద్యోగుల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఓట్లు మనవి, పదవులు మరొకరివి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డాక్టర్ పరమేశ్వర, ప్రియాంకఖర్గే, నేను సీఎం పదవులకు ఎంపిక కాలేకపోతున్నామన్నారు.

యువత నాటక రంగంలోకి రావాలి



నాటకంలోని ఓ సన్నివేశం

విజయపుర(బెంగళూరు గ్రామీణ): పౌరాణిక నాటకాలు అంతరించే దశలో ఉన్నాయని, యువత నాటకరంగంపై ఆసక్తి పెంచుకొని ఆ రంగానికి జీవం పోయాలని విద్యాశాఖ డైరెక్టర్ ఎ.ఎం. నారాయణ స్వామి అన్నారు. విజయపుర పట్టణంలోని రాజీవ్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ సంవాదం కన్నడ పౌరాణిక నాటకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వివిధ పాత్రలను పోషించి భళా అనిపించారు.

త్వరలో ఖాళీ వైద్య ఉద్యోగాల భర్తీ

- మంత్రి దినేష్ గుండూరావ్



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న మంత్రి దినేష్ గుండూరావ్ తదితరులు

కోలారు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావ్ తెలిపారు. బుధవారం బంగారుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 12 పడకల ఆస్పత్రి నూతన భవనం, కేజీఎఫ్ ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన బీపీహెచ్ ల్యాబ్, సెమీ కార్డియాక్ టెలి యూనిట్, బెమెల్‌లో నిర్మించిన ఆక్సిజన్ సహిత అంబులెన్స్‌లు, ముళబాగిలు వైద్య సిబ్బందికి వసతి గృహాల సముదాయం ప్రారంభం తదితర అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోను వైద్యుల కొరత లేకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ వైద్య సౌకర్యాలను అందించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమన్నారు. కాంట్రాక్టు పద్ధతిపై వైద్యులను నియమించే ప్రక్రియ సాగుతోందన్నారు. బంగారుపేటి ప్రభుత్వ ఆస్పత్రిలో 12 పడకల నూతన భవనాన్ని ప్రారంభించామన్నారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలను అందిస్తామన్నారు. రోగులకు ఉత్తమ వైద్య సేవలందించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆస్పత్రిలో సెమీ కార్డియాక్ టెలి యూనిట్‌లో గుండెపోటు సంభవించినప్పుడు వెంటనే రోగికి అవసరమైన వైద్య సేవలను అందించవచ్చన్నారు. బంగారుపేటి తాలూకా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముళబాగిలు తాలూకాలో రూ.25 కోట్ల వ్యయంతో తల్లిబిడ్డల ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు.కార్యక్రమంలో ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, బంగారుపేటె ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి, కేజీఎఫ్ ఎమ్మెల్యే రూపా శశిధర్, సీఈఓ పద్మ బసవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్ నినాదాలపై బీజేపీ రాజకీయం

అసెంబ్లీ ప్రాంగణంలో కొంతమంది పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేయడాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావ్ తెలిపారు. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన సమయంలో విలేకరులతో మాట్లాడారు. శాసనసభ ప్రాంగణంలో పాకిస్తాన్ నినాదాలు చేయడంపై తమకు కూడా బాధ ఉందన్నారు. ఇలా చేసిన వారు ఎలాంటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నినాదాలు చేసిన వారిని ఇప్పటికే అరెస్టు చేశామన్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సమర్థించుకోలేదన్నారు. సాక్ష్యం కోసం ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం వేచి చూడాల్సి వచ్చిందన్నారు. అందుకే నిందితులను అరెస్టు చేయడం ఆలస్యమైందన్నారు. ముఖ్యమంత్రితో పాటు మరికొందరికి బాంబు బెదిరింపు రావడంపై కొంతమంది రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిని వదిలేది లేదన్నారు. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు.

పునీత్ పేరిట హృదయజ్యోతి పథకం ప్రారంభం

కేజీఎఫ్: దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ పేరు మీద హృదయజ్యోతి పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తాలూకా కేంద్రాల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావ్ తెలిపారు. బుధవారం కేజీఎఫ్ ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. దివంగత నటుడు పునీత్ రాజ్‌కుమార్ గుండెపోటుతో మరణించాడు. ఆయన స్మృత్యర్థం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రతి తాలూకా కేంద్రంలోను హృదయజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా హృదయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచిత చికిత్స అందిస్తారన్నారు. వారం లోగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని ఆరోగ్య కేంద్రాల్లో 40 శాతం వైద్యుల కొరత ఉందన్నారు. ప్రభుత్వం త్వరలో సిబ్బంది నియామకాలు చేపడతామన్నారు. కేజీఎఫ్ ప్రభుత్వ ఆస్పత్రిలోను వైద్యుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ కేజీఎఫ్‌లో గని కార్మికులు సిలికాసిస్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. వీరి చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించాలన్నారు.

500 కేపీఎస్ పాఠశాలల అప్‌గ్రేడ్



పనులను ప్రారంభిస్తున్న మంత్రి మధుబంగారప్ప

మాలూరు: రాష్ట్రంలో వచ్చే సంవత్సరంలోగా రూ.2500 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి 500 పాఠశాలలను కేపీఎస్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామని రాష్ట్ర ప్రాథమికోన్నత విద్యా శాఖా మంత్రి మధు బంగారప్ప తెలిపారు. బుధవారం తాలూకాలోని మాస్తి గ్రామ బస్టాండు వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో నూతన బస్టాండు నిర్మాణ పనులకు భూమిపూజ, ఒసాట్ సంస్థ ఆధ్వర్యంలో మాస్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన తరగతి గదుల నిర్మాణ పనులను నెరవేర్చి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రగతికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పాఠశాలల్లో 8వ తరగతి నుంచి మాత్రమే కోడిగుడ్డు అందించేదన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి తాము 1 నుంచి 10వ తరగతి వరకు అందరు విద్యార్థులకు కోడిగుడ్డు అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గ్రామ పంచాయతీకి ఒకటి ప్రకారం సుమారు 3 వేల పాఠశాలను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కేపీఎస్ పాఠశాలలకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో కన్నడ, ఇంగ్లిష్ మీడియంల్లో దేన్నయినా చదవవచ్చన్నారు. పాఠ్యపుస్తకాల పునః రచన చేయాలనే ఒత్తిడి ఉంది. ఇది పిల్లల విద్యాభ్యాసంపై ప్రభావం చూపకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో 12,500 మంది ఉపాధ్యాయులను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంజేగౌడ, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బస్సు ఢీకొని సైక్లిస్టు మృతి

మైసూరు: వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన చామరాజనగర జిల్లాలోని కొళ్లేగాల తాలూకాలోని కామగెరె గ్రామం మెయిన్ రోడ్డులో జరిగింది. నింగప్ప (60) అనే వృద్ధుడు సైకిల్ తొక్కుకుంటూ వెళుతుండగా నాగమంగల డిపోకు చెందిన బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. అతడు గాయాలతో అక్కడికక్కడే చనిపోయాడు. గ్రామీణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

సీసీ కెమెరాలో యాసిడ్‌దాడి నిందితుడు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కడబలో ముగ్గురు విద్యార్థినులపై యాసిడ్ దాడి చేసిన అబీన్ కదలికలు అక్కడి సీసీ కెమెరాలలో రికార్డ్ అయ్యాయి. ఆదివారం నిందితుడు అబీన్ కేరళ నుంచి రైల్లో మంగళూరుకు వెళ్లాడు. సోమవారం కడబకు వచ్చి ఒక బేకరి వద్ద మొబైల్‌ఫోన్‌ని చార్జ్ చేసుకున్నాడు. అక్కడే యాసిడ్ సీసాని జేబులో పెట్టుకున్నాడు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ యూనిఫాం వంటి డ్రస్ వేసుకుని కాలేజీలోకి వెళ్లాడు. కాగా, బాధిత అమ్మాయిలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి



ప్రారంభిస్తున్న నిఖిల్ కుమారస్వామి తదితరులు

కోలారు: లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, జేడీఎస్ కలిసి పోటీ చేస్తున్నందున ఇరు పార్టీల ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జేడీఎస్ రాష్ట్ర యువ అధ్యక్షుడు నిఖిల్ కుమార స్వామి తెలిపారు. బుధవారం నగర సమీపంలోని ప్రైవేటు కళ్యాణ మంటపంలో నిర్వహించిన జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. రెండు మూడు రోజుల్లో కోలారు అభ్యర్థిని కూడా ప్రకటిస్తారన్నారు. అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఉమ్మడి అభ్యర్థి ఎవరైనా ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు అభ్యర్థి విజయం కోసం శ్రమించాలన్నారు. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య సమన్వయం పెరగాలని సూచించారు. ఇది కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో కూడా కొనసాగాలన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో జరిగిన కొన్ని తప్పుల వల్ల ఎన్నికల్లో వెనుకబడ్డామన్నారు. ఉమ్మడి అభ్యర్థి ఎవరనే దానిపై చర్చలు జరుగుతున్నాయని, త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ వారం చివరలో అభ్యర్థి ప్రకటన జరిగే అవకాశం ఉందన్నారు. అభ్యర్థి ఎవరైనా విజయం కోసం అందరం కలిసి పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. మోదీని మళ్లీ ప్రధానిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకే తల్లి బిడ్డల్లా కలిసి పని చేయాలన్నారు. జేడీఎస్ నాయకులు సీఎంఆర్ శ్రీనాథ్, బణకనహళ్లి నటరాజ్, తాలూకా అధ్యక్షుడు బాబు మౌని, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గంగాజలం పంపిణీ

బనశంకరి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలోని బళేపేటే శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టి గంగజలాన్ని పంపిణీ చేశారు. అలాగే 40 వేల లీటర్ల పవిత్ర గంగాజలాలను రాష్ట్రంలోని 3,700 ఆలయాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తులకు తీర్థరూపంలో గంగాజలం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

తెలుగు పాఠశాలలను రక్షించుకోవాలి



మాట్లాడుతున్న అభివృద్ధి సమితి నాయకులు

యశవంతపుర: బెంగళూరులోని ప్రవాసాంధ్రులు తెలుగు భాషకు ప్రాధాన్యత ఇస్తూ తమ పిల్లలను తెలుగు స్కూళ్లలో చేర్పించాలని యలహంక నీలకంఠేశ్వర తెలుగు–కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల కార్యదర్శి వై. వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. బుధవారం పాఠశాల అవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి తెలుగు విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. తెలుగు పాఠశాలలు మూతపడకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు జీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు కె నాగరాజు, కోశాధికారి చంద్రశేఖర్, శ్రీనాథ్, విజయకుమారి, హరీశ్, నేతకార్మికుల సంఘం అధ్యక్షుడు డీ చిన్నప్ప, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు రాణి, నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...


రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం కనక సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివృత్త ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. నివృత్త ఉద్యోగులు వ్యాయామ, మానసిక ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టి సమాజానికి మార్గదర్శనం చేయాలన్నారు. రూ.20 కోట్లతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటికే రూ.5 కోట్లను విడుదల చేశారన్నారు. మిగిలిన రూ.5 కోట్లను పట్టణ సమీపంలోని అమాని చెరువు అభివృద్ధికి వెచ్చిస్తారన్నారు. చెరువు కట్టపై వ్యాహ్యాళికి అనుకూలంగా రహదారిని నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పట్టణ సమీపంలోని మదనపల్లి రోడ్డులో 5 వేల ఎకరాల పారిశ్రామికవాడను నిర్మిస్తామన్నారు. పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి. నారాయణరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దగంగ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్

తుమకూరు: తుమకూరు నగరంలోని బీహెచ్ రోడ్డులో ఉన్న శ్రీ సిద్ధగంగా విజ్ఞాన, వాణిజ్య డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ బోర్డు(న్యాక్) ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ వీరభద్రస్వామి తెలిపారు. ఫిబ్రవరి 21,22 తేదీల్లో న్యాక్ బృందం కళాశాలను సందర్శించి బోధన, విద్యార్థుల ప్రగతి, ఉత్తీర్ణత తదితర అంశాలను పరిశీలించి నాలుగవ సారి న్యాక్ ఏగ్రేడ్‌కు ఎంపిక చేసిందన్నారు.

విద్యుత్ సరఫరా మెరుగునకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: అస్తవ్యస్త విద్యుత్ సరఫరాను ఖండిస్తూ రైతుసేన కార్యకర్తలు బుధవారం బెస్కాం కార్యాలయం ముందు ధర్నా చేశారు. రైతు సేన తాలూకా అధ్యక్షుడు తొరగినదొడ్డి మంజునాథ్ మాట్లాడుతూ బెస్కాం సిబ్బంది విద్యుత్ సక్రమంగా సరఫరా చేయక పోవడం వల్ల రైతుల పంటలు ఎండుతున్నాయన్నారు. గతంలో రాత్రివేళలో 6 గంటలు విద్యుత్ సరఫరా చేసేవారు. అయితే ఇప్పుడు రాత్రివేళలో కూడా విద్యుత్ సక్రమంగా సరఫరా చేయపోవడం వల్ల రైతుల పంటలు దెబ్బ తింటున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతుల పంప్‌సెట్లకు సింగల్ ఫేస్, త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను గుర్తించి వెంటనే సరిచేయాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం బెస్కాం ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. తుమటగెరె అమరేష్, మరియప్ప, శ్రీనివాస్, మంజునాథ్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో భగవంతుడిని చూడాలి



వంట సిబ్బందికి వస్త్రాలు అందిస్తున్న దాత ధర్మేశ్

శ్రీనివాసపురం: అక్షర దాసోహ సిబ్బంది పాకశాలలో స్వచ్ఛతను కాపాడాలని, వంట సిబ్బంది పిల్లల్లో దేవుడిని చూస్తూ వారికి రుచికరమైన భోజనం వడ్డించాలని దాత ధర్మేష్ తెలిపారు. బుధవారం తాలూకాలోని బట్టరహళ్లి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్లస్టర్‌లోని 30 మంది అక్షర దాసోహ వంట సిబ్బందికి నూతన వస్త్రాలను అందించి ఆయన మాట్లాడారు. వంట సిబ్బంది పిల్లలకు మాతృహృదయంతో భోజనం వడ్డించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణప్ప మాట్లాడుతూ దాత ధర్మేష్ ప్రతి నెలా తన జీతంలో రూ.10 వేలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి గత 20 ఏళ్లుగా వెచ్చిస్తున్నారన్నారు. సాహిత్య, సంగీత, క్రీడా రంగాలకు కూడా సహాయ హస్తాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ గంగాధర్, ఉపాధ్యాయుడు చంద్రప్ప, పరమేష్, మునిస్వామి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి సాధించాలి



మాట్లాడుతున్న కేవీ శంకరప్ప

కోలారు: యువత వృత్తి విద్యను పొంది స్వయం ఉద్యోగం సాధించడం ద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్కౌట్స్ జిల్లా కమిషనర్ కేవీ శంకరప్ప అన్నారు. బుధవారం జిల్లా స్కౌట్స్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యూటీషియన్ శిక్షణా సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే అవసరమైన వృత్తి శిక్షణను పొందడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో సహాయకారి అవుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగం కల్పించడం సరికాదు. తమ ప్రతిభకు అనుగుణంగా ఉద్యోగాలు తామే సంపాదించుకోవాలని లేదా స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ యువశక్తి ఉత్తమ దారిలో సాగే విధంగా తగిన కౌశల్యాలను నేర్పిస్తుందన్నారు. ఇందుకోసం వివిధ శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు శివకుమార్‌గౌడ, జిల్లా మహిళా సంరక్షణా కేంద్ర అధ్యక్షురాలు మంగళ గౌడ, పదాధికారులు సురేష్, ఉమాదేవి పాల్గొన్నారు.

నిప్పుకణికలా సిలికాన్ సిటీ







బుధవారం బెంగళూరులోని కేఆర్ మార్కెట్‌లో గొడుగు సహాయంతో వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

- భగ్గుమన్న సూర్యభగవానుడు
- ఐదోసారి రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రత నమోదు
- 2013 మార్చి 30న గరిష్ట ఉష్ణోగ్రత 36.6 డిగ్రీల సెల్సియస్
- 2024 మార్చి 5న 36 డిగ్రీలు
- విలవిలలాడుతున్న నగరవాసులు

బనశంకరి: నెత్తిపై నిప్పులు పోసినట్లుగా బెంగళూరులో ఎండలు దంచి కొట్టాయి. వందలాది ఉద్యానవనాలతో కూల్ సిటీగా పేరు పొందిన సిలికాన్ సిటీలో సూర్యభగవానుడు భగ్గుమన్నాడు. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. నడినెత్తిన వేడి..కాళ్ల కింద వేడి వెరసి నగరవాసులు సిటీ రోడ్లపైకి అడుగు పెట్టాలంటే జంకుతున్నారు. ఈ వేసవి తాపాన్ని ఎలా తట్టుకోవాలో తెలియక బెంబేలెత్తుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు.

పదేళ్లలో ఐదోసారి సూర్యతాపం

మార్చి 5వ తేదీ 36 డిగ్రీల సెల్సియస్ మేర గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇంత ప్రమాణంలో పదేళ్లలో ఇలా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇది ఐదోసారి అని బెంగళూరు ప్రాదేశిక కార్యాలయ శాస్త్రవేత్త వాతావరణశాఖ నిపుణుడు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. 2017లో మార్చిలో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 2–3 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రత. 2013 మార్చి 31న 36 డిగ్రీలు, 2020 మార్చి 31న 36.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుతం ఐదోసారి అంటే మంగళవారం బెంగళూరులో రెండు చోట్ల 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

ఇంకా రెండు రోజులు ఎండలు

మండే ఎండలు ఇంకా రెండురోజులు కొనసాగి అనంతరం తగ్గుతాయని డాక్టర్ ప్రసాద్ తెలిపారు. 34–35 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుందని, దీనికంటే అధిక ఉష్ణోగ్రత ఉండదని, వచ్చేవారం ఉష్ణోగ్రత మరింత తగ్గుతుందని తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని తెలిపారు. బెంగళూరులో మార్చిలో 14.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇంతవరకు వరుణుడు కరుణించలేదు. గత ఏడాది ఇదే నెలలో 9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇక ఉత్తర ఒళనాడులో మార్చి, ఏప్రిల్, మేనెలల్లో గరిష్ట ఉష్ణోగ్రత కంటే 2 నుంచి మూడు డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రత అప్పుడప్పుడు కొన్ని రోజులు నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి చివరివారంలో రాష్ట్రంలో వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 36 డిగ్రీలు, బెంగళూరు హెచ్ఏఎల్ పరిధిలో 34.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది.

ఏడాది	తేదీ	ఉష్ణోగ్రత
2013	మార్చి 30	36.6 డిగ్రీల సెల్సియస్
2014	మార్చి 31	36
2017	మార్చి 26	37
2020	మార్చి 31	36.1
2024	మార్చి 5	36

క్లుప్తంగా

మురుగమల్ల దర్గా హుండీ లెక్కింపు



హుండీద్వారా లభించిన నగదుతో ట్రస్టీలు

చింతామణి: తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మురుగమల్ల గ్రామంలో హజరత్ సయ్యద్ హుసేన్ షా వలీ దర్గా హుండీని లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా లక్షా 82వేల ఆదాయం లభించినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. ఆ మొత్తాన్ని కెనరా బ్యాంకులో డిపాజిట్ చేశారు. ముతువల్లి ఫయాజ్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు అన్వర్‌ఖాన్ పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

దొడ్డబళ్లాపురం: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిని మారణాయుధాలతో వెంబడించి హత్య చేయడానికి ప్రయత్నించిన నలుగురిని రామనగర తాలూకా ఐజూరు పోలీసులు అరెస్టు చేసారు. మహాలింగ అనే వ్యక్తి భార్యతో మాట్లాడుతూ ఇంటి ముందు నిలబడి ఉండగా వాహనంలో వచ్చిన దుండగులు మారణాయుధాలతో దాడికి ప్రయత్నించారు. మహాలింగ తప్పించుకుని పరుగులు తీశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురు నిందితులను అరెస్టు చేశారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

జూదరుల అరెస్టు

పేకాట స్థావరంపై దాడి చేసిన కుదూరు పోలీసులు 5 మంది జూదరులను అరెస్టు చేశారు. తిప్పసంద్ర గ్రామం వద్ద పేకాట ఆడుతున్నారని తెలిసి దాడిచేశారు. లక్ష్మణ్, గంగాధర్, వెంకటాచలయ్య, రమేశ్, హుచ్చేగౌడ అనే 5 మందిని అరెస్టు చేసి రూ.21 వేలు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తాగునీరు విడుదల చేయాలని ధర్నా



కాడా కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

మైసూరు : కావేరి, కబిని జలాశయం చుట్టుపక్కల ఉన్న చెరువులు, కుంటలకు నీరు విడుదల చేసి ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్‌చేస్తూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం సమాఖ్య నాయకులు బుధవారం మైసూరులోని కాడా కార్యాలయం ముందు ధర్నా చేశారు. చెరువులు,కుంటలు ఎండిపోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాహంతో పశువులు అల్లాడిపోతున్నాయన్నారు. జలాశయాలనుంచి చెరువులకు నీరు విడుదల చేసి నీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గంట పార్కింగ్ ఫీజు రూ. వెయ్యి



పార్కింగ్ స్థలం వద్ద పెట్టిన బోర్డు

యశవంతపుర: బెంగళూరులోని ఒక మాల్‌లో కారు పార్కింగ్‌కు గంటకు ఎంతో తెలిస్తే గుండె పగిలిపోతుంది. గంటకు వెయ్యి రూపాయలు చెల్లించాలని మాల్‌లో బోర్డు పెట్టారు. మాల్‌లోకి వెళ్లిన ఇశాన్‌వైశ్ అనే వ్యక్తి ఆ బోర్డును ఫొటో తీసి ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. అయితే ఈ ఫొటో ఎప్పుడు తీశాడనేది స్పష్టత లేదు. 2015లో రెండు గంటలకు రూ.40 నుంచి రూ.వంద వరకు ఉండేది. కారు వాష్‌కంటే పార్కింగ్ ధరలు ఎక్కువ ఉన్నాయని నెటిజన్లు వాపోతున్నారు.

అనుమానాస్పద బ్యాగ్‌తో కలకలం



తనిఖీ చేస్తున్న పోలీసులు

యశవంతపుర: కలబురగి పట్టణంలోని సిటీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్ కాసేపు కలకలం సృష్టించింది. ఎవరో అక్కడ ఉంచి వెళ్లిన సదరు బ్యాగ్‌ను బుధవారం ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబ్‌స్క్వాడ్ రంగంలోకి దిగి తనిఖీలు చేయగా, అందులో డబ్బు దాఖలాలు రాసిన పేపర్లు బయట పడ్డాయి. ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ప్రయాణికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కరెంటు తీగల రాపిడితో గడ్డివాములు దగ్ధం



కాలిపోతున్న గడ్డి వాములు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకదళం సిబ్బంది

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా వడ్డరహళ్లి గ్రామంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకొని గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన తిమ్మేగౌడ పశువుల మేత కోసం గ్రాసం సేకరించి వాము ఏర్పాటు చేశాడు. వాములపై వెళ్లిన విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో గాలికి ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు రాజుకుని గడ్డి వాములపై పడి మంటలు చెలరేగాయి. క్షణాల్లో వాములు తగలబడిపోయాయి. అగ్నిమాపకదళం సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. విద్యుత్ లైన్ల రాపిడి వల్ల ఇళ్లల్లోని ఎలక్ట్రిక్ పరికరాలు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు కూడా కాలిపోయాయని గ్రామస్తులు తెలిపారు. బెస్కాం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠ్యాంశాల మార్పు వివాదానికి తెర

బనశంకరి: గత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వివాదాస్పదంగా మారిన పాఠ్యాంశాల అంశానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరదించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2024–25 విద్యాసంవత్సరం పాఠ్యపుస్తకాలను డాక్టర్ మంజునాథ్ హెగ్డే నేతృత్వంలోని కమిటీ పరిష్కరించింది. పాఠశాల విద్యాశాఖ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. 6వతరగతి సమాజా విజ్ఞాన పౌరత్వ పాఠ్యాంశాన్ని లింగసమానతతో పరిష్కరించారు. 8వ తరగతి చరిత్ర సనాతన ధర్మ అనే అధ్యాయంలో కొన్ని అంశాలు చేర్చారు. 9వ తరగతి చరిత్రలో కనకదాసు, పురంధరదాసు అంశాలను చేర్చారు.10వ తరగతి చరిత్రలో సార్వజనిక పాలన అనే కొత్త అధ్యాయాన్ని చేర్చారు.1నుంచి 5వ తరగతి కన్నడ కేవీ తిరుమలేశ్, వీజీ. భట్టర మక్కళ పాఠ్యాంశం చేర్చారు. కంబార-సీమే, కర్నాడ్-అధికార, దేవిదాస-చక్రగ్రహణ, మరియ ప్రభట్ట-నమ్మభాషె, దేవనూరుమహదేవ-ఎదిగెబిద్ద అక్షర, అక్కమహాదేవి వచనాలు చేర్చారు. 9-10వ తరగతి కన్నడలో తొలగించిన నాగేశ్‌హెగ్డే , పీ.లంకేశ్, శ్రీనివాస ఉడుపి అంశాలను కొత్తగా చేర్చారు.

శ్మశాన, ఆలయ భూములు కాపాడండి

కృష్ణరాజపురం: మహదేవపుర నియోజకవర్గం వర్తూరు సమీపంలో బోగనహళ్లిలో శ్మశాన, ఆలయ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని ఆరోపిస్తూ కర్ణాటక దళిత రక్షణ వేదిక నాయకులు బుధవారం మహదేవపుర బీబీఎంపీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోరహూణసు వెంకటేష్ మాట్లాడుతూ సర్వే నంబర్ 33/1లో ఉన్న సుమారు ఎకరం 39 గుంటల శ్మశాన స్థలంలో స్థానికులు అంత్యక్రియలు నిర్వహించేవారన్నారు. అంత్యక్రియల అనంతరం పక్కనే ఉన్న అంగాల పరమేశ్వరి ఆలయంలో పూజలు చేసేవారన్నారు. అయితే కొందరు వ్యక్తులు శ్మశాన, ఆలయ స్థలాలను కబ్జా చేశారన్నారు. అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు.

శివరాత్రికి శివబాలయోగి ఆశ్రమం ముస్తాబు



కొలువుదీరిన మరకత శివలింగం

బనశంకరి: పరమశివుడికి పవిత్రమైన మహాశివరాత్రికి జేపీ.నగర మూడోఫేజ్ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమం ముస్తాబైంది. ఇక్కడ వెలసిన మరకత శివలింగానికి ఈనెల 8వ తేదీన అభిషేకం, అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆశ్రమ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. అనంతరం మరకత శివలింగం దర్శనానికి భక్తులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం 3.30 గంటలకు వాసవీ మహిళామండలి భక్తిగీతాల ఆలాపన ఉంటుందన్నారు. 4 గంటలకు చక్రభజన మండలి భక్తిగీతాలు, 5 గంటలకు ఎస్ఎల్‌వీబీఎం భజన మండలి భక్తిగీతాలు, 6 గంటలకు స్వరమాధురి బృందం భరతనాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. రాత్రి 6–40 గంటలకు శ్వేతశ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో యక్షగానం, 7.45 గంటలకు రత్నమాల పురంధర్ బృందం భక్తిగీతాల ఆలాపన, 10 గంటలకు విశ్వభారతి నాట్యశాల విద్యార్థుల భరతనాట్యం, 12 నుంచి 1.30 వరకు భూకైలాస్ నాటకం, సింధూ భైరతి కళాబృందం ప్రదర్శనతో పాటు భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందని ఆయన తెలిపారు.

సమన్వయంతో సైబర్‌నేరాలకు అడ్డుకట్ట



ఒప్పందపత్రం అందుకుంటున్న హోంమంత్రి పరమేశ్వర్, డీజీపీ అలోక్‌మోహన్ తదితరులు

బనశంకరి: హెచ్చుమీరుతున్న సైబర్‌నేరాలకు అడ్డుకట్ట వేయడానికి దర్యాప్తు సంస్థలు అధికంగా శ్రమించాల్సి వస్తోందని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ అన్నారు. సైబర్‌నేరాల నియంత్రణపై బుధవారం ఏర్పాటు చేసిన సైబర్‌నేరాలు–దర్యాప్తు టెక్‌సమ్మిట్‌ను హోంమంత్రి ప్రారంభించి మాట్లాడారు. సైబర్‌నేరాలపై సమరం సాగించడానికి పోలీసులు, దర్యాప్తు సంస్థలు సాంకేతిక పరిజ్ఞాన వినిమయం, పరస్పర సహకారం ముఖ్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేటుగాళ్లు రానున్న రోజుల్లో విసిరే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే విషయంపై చర్చించారు. ఏఐ వినియోగం, ఎల్.ఓ.టి, వాహన ఫొరెనిక్స్, మాల్‌వేర్ విశ్లేషణపై చర్చించారు. సీఐడీ, ఇన్ఫోసిస్ ప్రతిష్టాన, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం చేసుకున్నారు. సెంటర్‌ఫర్ సైబర్ ఇన్వెస్టిగేషన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ వ్యవస్థను కొనసాగిస్తామని తెలిపారు. డీజీపీ అలోక్‌మోహన్, హోంశాఖ అదనపు ప్రధానకార్యదర్శి ఉమాశంకర్, సీఐడీ డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం, నగర పోలీస్ కమిషనర్ దయానంద, ఏడీజీపీలు సీమంత్‌కుమార్‌సింగ్, ఉమేశ్‌కుమార్, ఇన్ఫోసిస్ సునీల్‌కుమార్‌దరేశ్వర్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మేఘాలయ, తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, హరియాణా, ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ, బిహార్, అసోం రాష్ట్రాలకు చెందిన పోలీస్ అధికారులతో పాటు ఎన్ఐఏ, సీబీఐ అధికారులు పాల్గొన్నారు.

భక్తిప్రదం జ్యోతిర్లింగ రూపం



మైసూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మైసూరు నగరంలోని విజయనగర రైల్వే లేఔట్‌లోని క్రీడా మైదానంలో ఐదురోజుల ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ఆరంభమైంది. బ్రహ్మ కుమారీస్ రాజయోగిని బీ.కే. లక్ష్మీజి అర్జున, అవధూత మహరాజ్, కేవీ శ్రీధర్‌లు ప్రారంభించారు. పలు రకాల శివలింగాలను ఏర్పాటు చేశారు. భక్తులు విశేషాలు తెలుసుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల భక్తి నృత్య ప్రదర్శనలు అలరించాయి. అలాగే టెలిస్కోప్ ద్వారా నక్షత్రాలు, గ్రహాలను తిలకించారు.





హోసూరు వార్తలు..

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కెలమంగలం: కెలమంగలం సమితి బైరమంగలం పంచాయతీ అగ్గొండపల్లి ప్రాంతంలో కొద్ది రోజులుగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం కల్పించారు. రైతుల మోటార్లు పాడవుతున్నాయని ఆ ప్రాంత సహకార సంఘ అధ్యక్షుడు మునిరెడ్డి, బాధిత రైతులు ఎమ్మెల్యే టి. రామచంద్రన్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖాధికార్లతో చర్చించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

మామిడికి దళారుల బెడద



నిండుగా పూత పూసిన మామిడి తోట

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా మామిడి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ఈ ప్రాంతంలో రైతులు ఉత్పత్తి చేసే మామిడి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలో రైతులు పండించే సేలం, బెంగళూరు, బాదామి, మలగూబ తదితర రకాల మామిడి పండ్లను మామిడి రసాల పరిశ్రమలకు విక్రయిస్తారు. వ్యాపారులు మామిడి తోటలను గుత్తగా కొనుగోలు చేసి దిగుబడిని తరలిస్తారు. దీని వల్ల రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువ వస్తోందని వాపోయారు. మరోవైపు మామిడి పూత పూసినప్పటి నుంచి చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేయడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి తగ్గడం వంటి నష్టాలను ఎదుర్కొంటున్నామని సాగుదారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే మామిడి పంటను మద్దతు ధరతో కొనాలని, దళారీల బెడదను తొలగించాలని కోరారు.

తోపుడు బండ్ల పంపిణీ

హోసూరు: కార్పొరేషన్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులకు బుధవారం మేయర్ ఎస్.ఏ.సత్య నేతృత్వంలో తోపుడుబండ్లను అందజేశారు. తమ ఉపాధికి సాయం చేయాలని వ్యాపారుల డిమాండ్ మేరకు మేయర్ రూ. 31.40 లక్షల విలువ చేసే 40 బళ్లను కార్పొరేషన్ కార్యాలయంలో వ్యాపారులకు అందజేశారు. వీరిలో కాయగూరలు, హోటల్, పూల వ్యాపారులు ఉన్నారు. ఉపమేయర్ ఆనందయ్య, కార్పొరేటర్లు నాగరాజ్, చెన్నవీరప్ప, ఇంద్రాణి, మల్లికాదేవి తదితరులు పాల్గొన్నారు.

భారీ శబ్దంతో బెంబేలు

హోసూరు: హోసూరు ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం భయంకరమైన శబ్దం రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొన్నిరోజుల క్రితం బెంగళూరులో హోటల్లో బాంబు పేలుడు జరిగిన సంగతి తెలిసిందే. దీంతో అటువంటిదే ఏమైనా జరిగిందా అని ప్రజలు కలవరానికి గురయ్యారు. భీకర శబ్దానికి మహిళలు, పిల్లలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోని వస్తువులు కిందపడ్డాయి. ఇది ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన శబ్దమని, ప్రజలు భయపడవలసిన పని లేదని అధికారులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

క్రిష్ణగిరి: పరీక్షల్లో మార్కులు తగ్గినందుకు తల్లిదండ్రులు మందలించడంతో యువతి ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు కావేరిపట్టణం సమీపంలోని సహదేవన్ కొటాయ్ గ్రామానికి చెందిన లక్ష్మణన్ కూతురు జ్యోతి (21) ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇటీవల పరీక్షల్లో మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన జ్యోతి మంగళవారం పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు గమనించి చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫలించక మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నగల షాపు దొంగ అరెస్టు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లిలో నిర్వహిస్తున్న నగల దుకాణంలో దోపిడీకి యత్నించిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఆ దుకాణం సెలవు కావడంతో మూసి ఉంచారు. దొంగ వెల్డింగ్ యంత్రంతో షట్టర్‌ను కట్ చేసి లోనికి చొరబడుతుండగా చూసిన స్థానికులు షాపు యజమానికి సమాచారమిచ్చారు. అతను చేరుకుని స్థానికుల సాయంతో దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడు పోచ్చంపల్లి సమీపంలోని వీరమలై గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ అని, పలుచోట్ల చోరీలు చేసినట్ల తెలిసింది. అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న మూడు తులాల బంగారు నగలను స్వాధీనపరుచుకొన్నారు.

బ్యాంకు దోపిడీకి యత్నం



మరుగుదొడ్డికి రంధ్రం వేసిన దృశ్యం

మైసూరు: బ్యాంకు దోపిడీకి దుండగులు యత్నించి విఫలమయ్యారు. ఈఘటన మైసూరు జిల్లా టి.నరిసిపుర తాలూకా దొడ్డబాగిలు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంకు బ్రాంచ్ ఉంది. బ్యాంకులో దోపిడీకి పథకం వేసిన దుండగులు బ్యాంకు భవనం పక్కన మరుగుదొడ్డికి రంధ్రం వేశారు. సీసీకెమెరాలను కూడా ధ్వంసం చేశారు. అయితే బ్యాంకు భవనం లోపలకు వెళ్లేందుకు సాధ్యం కాక వెనుదిరిగారు. బుధవారం ఈ ఘటన వెలుగు చూడటంతో పోలీసులు వచ్చి పరిశీలించారు.

దోపిడీ గ్యాంగ్ పట్టివేత



నవీన్‌కుమార్, ఆనంద్, మణికంఠ

గౌరిబిదనూరు: పాదచారులను, వాహనదారులను నిలువుదోపిడీ చేస్తున్న గ్యాంగ్ పట్టుబడింది. పట్టణంలోని వినాయకనగర్‌కు చెందిన రాజు కుమారుడు నవీన్‌కుమార్(24), వెంకటేశ్ కుమారుడు ఆనంద్(26), సురేశ్ కుమార్ కుమారుడు మణికంఠ(29)ను పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు చైన్‌స్నాచింగ్ కేసులకు సంబంధించి సుమారు రూ. 4.50 లక్షల విలువైన బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. నవీన్, ఆనంద్‌పై బెంగుళూరులోని కుమారస్వామి లేఔట్, ఆర్ ఆర్ నగర్, జేసీ నగర్, బసవనగుడి, శంకరపురం, బయ్యప్పనహళ్లి పోలీసుస్టేషన్లలో దోపిడీకేసులు నమోదయ్యాయని టౌన్ ఎస్ఐ తెలిపారు. ధనుష్, అక్రంబాషా అనే దుండగులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

మరో ఇద్దరి అరెస్ట్



సూరీ లంకేశ్

గౌరిబిదనూరు: హిందూపురం– బెంగళూరు రహదారిపై దొడ్డకురుగోడు చెరువు కట్టపై దోపిడీలకు పాల్పడేందుకు దొంగల ముఠా పొంచి ఉండగా రూరల్ పోలీసులు దాడి చేశారు. తాలూకాలోని రమాపురం గ్రామానికి చెందిన రౌడీషీటర్ చిక్కవీరప్పకుమారుడు సూరి(28), కల్లినాయకన హళ్లికి చెందిన నందీశప్పకుమారుడు లంకేశ్(26)ను అరెస్ట్ చేశారు. బొమ్మశెట్టి హళ్లికి చెందిన అరుణ్ కుమార్(23), మరో ఇద్దరు ఉడాయించారు. నిందితుల నుంచి కత్తులు, పగ్గం, లాంగ్, మచ్చుకత్తి స్వాధీనం చేసుకున్నారు.

10న హొసకోటెకు సీఎం రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ

కృష్ణరాజపురం: హొసకోటెకు ఈనెల 10న సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ విచ్చేస్తారని, ఈ సందర్భంగా రూ.500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ తెలిపారు. పట్టణంలోని శ్రీ చెన్నబైరెగౌడకు చెందిన క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభలో సీఎం, డిప్యూటీ సీఎం పాల్గొంటారని తెలిపారు.

పర్యాటకులకు బీఎంటీసీ ప్యాకేజీ

చిక్కబళ్లాపురం: జిల్లాలో వేసవిలో పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను సందర్శించుకునేవారి కోసం బీఎంటీసీ ప్యాకేజీ ప్రకటించింది. చిక్కబళ్లాపురం సమీపంలో ఏర్పాటైన ఈశా ఫౌండేషన్‌లో 112 అడుగుల శివుడి విగ్రహం, భోగనందీశ్వర ఆలయం, కణివె బసవణ్ణ ఆలయం, ముద్దేనహళ్లి సర్ ఎంవీ మ్యూజియం, రంగస్థల రంగనాథస్వామి ఆలయం దర్శనానికి ఒకరికి టికెట్ ధర రూ. 500గా నిర్ణయించింది. కెంపేగౌడ బస్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బస్సు బయల్దేరి రాత్రి 9.30 గంటలకు మెజిస్టిక్ చేరుకుంటుంది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 8,9 తేదీలతోపాటు ప్రతి ఆదివారం ఈ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

17న ఘంటసాల వర్ధంతి

హోసూరు: హోసూరులోని ఆంధ్రసాంస్కృతిక భవనంలో ఈ నెల 17వ తేదీ అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక సంగీత స్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మిత్రబృందం, ఆంధ్రసాంస్కృతిక సమితి సంయుక్త ప్రకటనలో పేర్కొంది. గాయనీ గాయకులు చంద్రతేజ, మహాలక్ష్మి, ఎస్.టి.రాజు, జానకీరామ్, నాగభూషణం, మునిరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు. తెలుగు భాషాప్రియులు, ఘంటసాల, ఎస్పీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పలు అంగళ్లు సీజ్

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని గాంధీ విగ్రహం ప్రాంతంలో లైసెన్స్ పన్ను చెల్లించని దుకాణాలపై కార్పొరేషన్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి సీల్ వేశారు. నేతాజీరోడ్డు, గాంధీరోడ్డు, చెరువు వీధి, బస్టాండు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని తెలిపి బుధవారం ఉదయం తొలగింపు చర్యలను చేపట్టారు. అలాగే ప్రభుత్వానికి పన్నులు చెల్లించక నడుపుతున్న 10 దుకాణాలను కూడా సీల్ వేశారు. దీంతో అధికారులు, వ్యాపారుల మధ్య వాగ్వివాదాలు జరిగాయి.


జింక మాంసం రవాణా... వేటగాళ్ల అరెస్ట్

మైసూరు : జింకను చంపి మాంసం రవాణా చేస్తున్న వన్యప్రాణుల వేటగాళ్లు పట్టుబడ్డారు. చామరాజనగర జిల్లా హనూరు బసప్పన దొడ్డి గ్రామానికి చెందిన ఇర్ఫాన్, వహీద్, అంబికాపురకు చెందిన కుమారస్వామి, అప్పు, కాంచళ్లి గ్రామానికి చెందిన యశ్వంత్, కురుబరదొడ్డి గ్రామానికి చెందిన సయ్యద్ ఆరిఫ్‌లను కోణనకెరె వద్ద అరెస్ట్ చేశారు. వీరంతా జింక మాంసం తరలిస్తుండగా పక్కా సమాచారంతో ఏసీఎఫ్ చంద్రశేఖర్ పాటిల్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది దాడి చేశారు. నిందితుల వద్ద నుంచి జింక మాంసం స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

బీసీలను నిలువునా ముంచిన చంద్రబాబు

మంత్రి వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్: బీసీలకు 2014 ఎన్నికల్లో 142 హామీలిచ్చి ఒక్కటీ చంద్రబాబు అమలు చేయకుండా వారిని నిలువునా ముంచాడని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలను చంద్రబాబు తన హయాంలో బానిసలుగా చూశారని మంత్రి ధ్వజమెత్తారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించే అర్హత టీడీపీ, జనసేనకు లేదని, ఆ డిక్లరేషన్ చూశాక బీసీలే ఆ పార్టీలను తిప్పికొడతారని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న బాబు బీసీలను ఎదగనివ్వలేదని, అసలు బీసీలకు ఎన్ని సీట్లిచ్చారని ప్రశ్నించారు? బీసీలు కేవలం కుల వృత్తి చేసుకోవాలని, జడ్జీలుగా పనికి రారని చంద్రబాబు అన్నారని మంత్రి గుర్తు చేశారు. ఎమ్మెల్యే, మంత్రులు, ఎంపీ స్థానాల్లో సీఎం జగన్ బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని, ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి బీసీలకు న్యాయం చేశారని ప్రశంసించారు. స్థానిక సంస్థల నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం వరకు రిజర్వేషన్ అమలు చేసిన నేత సీఎం జగన్ ఒక్కరేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175/175 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తథ్యమని మంత్రి వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు.

జిత్తులమారి నక్క చంద్రబాబు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): అధికారం కోసం ఎత్తులు వేసే జిత్తులమారిన నక్క చంద్రబాబు అని, అతను చెప్పే బుడబుక్కల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారం కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు ఎంతకైనా తెగించగలడని, అందుకు ఎన్టీఆర్ వెన్నుపోటే నిదర్శనమని గుర్తుచేశారు. పేదల అభివృద్ధిని పక్కన పెట్టి పెత్తందారులతో చేతులు కలిపిన మాంత్రికుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలు అందించి జనం గుండెల్లో నిలిచిన జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిత్యం పోరాటం చేస్తున్న సీఎం జగన్‌ను ఎదుర్కోలేక పొత్తులతో గుంపులుగా వస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రభుత్వంపై పచ్చ మీడియాలు విషం చిమ్మినా, టీడీపీ–జనసేన కలిసి వచ్చినా జగనన్న విజయాన్ని ఆపలేరని ఆయన తేల్చిచెప్పారు.

బీసీల ఓట్ల కోసం బాబు, పవన్ కొత్త డ్రామా

ఎంపీ భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ (తూర్పు గోదావరి): బీసీ డిక్లరేషన్ పేరుతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కొత్త డ్రామాకు తెర తీశారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. బుధవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరిలో జయహో బీసీ సభలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ సంయుక్తంగా కల్లబొల్లి కబుర్లతో బీసీలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. సీఎం జగన్ బీసీలకు రాజకీయ పదవులు ఇవ్వడంలో ముందున్నారన్నారు. గత టీడీపీ హయాంలో బీసీలకు చేసిన సంక్షేమం, వైఎస్సార్‌సీపీ హయాంలో జగనన్న చేసిన సంక్షేమంపై బహిరంగంగా చర్చించేందుకు చంద్రబాబు సిద్ధం కావాలంటూ సవాల్ విసిరారు. చంద్రబాబు 3 శాతం ఉన్న కమ్మ సామాజిక వర్గానికి 21 సీట్లు, 55 నుంచి 60 శాతం ఉన్న బీసీలకు 18 సీట్లు ప్రకటించారని ఇది చూస్తే బీసీల పట్ల ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. జగనన్న ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. ఒక లక్షా 70 వేల కోట్లు బీసీ మహిళల బ్యాంకు అకౌంట్లలో నేరుగా జమ చేశారని వివరించారు. స్థానిక సంస్థల్లో ఇప్పటికే జగనన్న 33 శాతం కంటే ఎక్కువే బీసీలకు అవకాశం కల్పించారన్నారు. దీనిపై చర్చకు చంద్రబాబు వస్తే నిరూపిస్తానని భరత్‌రామ్ అన్నారు.

టీడీపీ చీరల వల



బి.కొత్తకోట: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం మొదలుపెట్టారు. ఇంటింటికి వెళ్లి బహుమతుల వల వేస్తున్నారు. రెండురోజులుగా ప్రచారం ముసుగులో గుట్టుగా సాగిస్తున్న ఈ వ్యవహారం బుధవారం వెలుగులోకి వచ్చింది. అభ్యర్థి జయచంద్రారెడ్డి తరఫున ఆయన కుటుంబీకులు ములకలచెరువు మండలంలో ఇంటింటికి వెళ్లి మహిళలకు చీరలు ఇస్తున్నారు. ఆ చీర ఉన్న అట్టపెట్టెలో టీడీపీ ప్రచార పథకాల వివరాలు, అభ్యర్థి ఫొటో కూడా ఉంచారు. ములకలచెరువులోని రాజీవ్‌కాలనీ, పాత ములకలచెరువులో చీరల పంపిణీ వెలుగులోకి వచ్చింది. నియోజకవర్గంలో పలుచోట్ల చీరల్ని నిల్వచేసినట్లు అనుమానిస్తున్నారు.


మడతబెట్టిన హామీలకు డిక్లరేషన్ రూపం..

బీసీల కోసం మరో వేషం

▶ మొదటి పేజీ తరువాయి

అగ్రప్రాధాన్యం ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఏ పార్టీ అయినా.. గత ప్రభుత్వం కంటే ఎక్కువ మేలు చేస్తామని హామీలిస్తుంది. కానీ నమ్మిన వాళ్లను వెన్నుపోటు పొడవడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు మాత్రం బీసీలకు అంతకంటే తక్కువ ఖర్చు చేస్తానని చెప్పి నవ్వుల పాలయ్యారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కాపీ కొట్టి డిక్లరేషన్ అంటూ విడుదల చేయడం ఆ పార్టీ శ్రేణుల్ని ఆశ్చర్యపరిచింది. చంద్రబాబు కాపీల్లో మచ్చుకు కొన్ని బీసీ కార్పొరేషన్లు.. కుల ధ్రువీకరణ పత్రాలు.. కుల గణన.. పెన్షన్‌లు..

మళ్లీ మోసం చేసేందుకు బాబు రెడీ



వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఇంతవరకు 1.78 లక్షల కోట్లను బీసీలకు ఇచ్చారు. అందులో డీబీటీ(డైరెక్ట్ టు బెనిఫిషియర్) ద్వారా నేరుగా బీసీల బ్యాంక్ అకౌంట్లలోకి 1,27,730 కోట్లను వివిధ పథకాల ద్వారా జమ చేశారు. మరో రూ.50,657 కోట్లు నాన్–డీబీటీ కింద ఆ వర్గాలకు అందించారు. మొత్తం కలిపి రూ.1,78,387 కోట్లను బీసీలకు ఇచ్చారు. అయితే బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఏడాదికి రూ.30 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చంద్రబాబు మంగళవారం జరిగిన సభలో గొప్పగా చెప్పారు. అంటే వైఎస్ జగన్ ఇచ్చిన దాని కంటే తగ్గించి చేస్తామని బీసీ డిక్లరేషన్ ద్వారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో కలిసి హామీ ఇవ్వడం విశేషం. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ వైఎస్ జగన్ ఇప్పటికే అమలు చేస్తున్నారు. నిజానికి ఇదే డిక్లరేషన్‌ను గతంలోనూ ప్రకటించిన చంద్రబాబు అమలు చేయకుండా బీసీలను మోసం చేశారు. మళ్లీ వారిని మోసం చేసేందుకు కొత్త బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి తమ డొల్లతనాన్ని బయటపెట్టుకున్నారు.

ఇంటికే కుల ధ్రువీకరణ పత్రాలు కనిపించలేదా?

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని గొప్పగా చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇస్తున్న కుల ధ్రువీకరణ పత్రాలు శాశ్వతమైనవే. వైఎస్ జగన్ దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడంతో రెవెన్యూ శాఖ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తోంది. అది తెలిసీ బీసీలకు చేయడానికి ఏం హామీలు లేవన్నట్లు కాపీ కొట్టారు. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ప్రతి ఎన్నికల్లోనూ బాబు హామీ ఇస్తూనే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ఆ హామీలతో బీసీలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఐదేళ్లుగా వలంటీర్లతో ఇంటికే పెన్షన్ అందిస్తుండగా.. బాబు మాత్రం ఇప్పుడు కొత్త బిచ్చగాడిలా వలంటీర్లతో ఇంటికే పెన్షన్ అందిస్తామని చెప్పడం కొసమెరుపు.

చివరికి స్లోగన్ కూడా కాపీనే..

టీడీపీ బీసీ డిక్లరేషన్ రూపకల్పన మొక్కుబడి తంతు అని బాబు నిరూపించుకు న్నారు. ఈ డిక్లరేషన్ కోసం కనీసం ఒక స్లోగన్‌ను కూడా చంద్రబాబు, టీడీపీ ఇవ్వలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల క్రితం ఇచ్చిన 'బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్ బోన్ క్లాస్' అనే స్లోగన్‌ను కాపీ కొట్టి తమ డిక్లరేషన్‌లో పెట్టుకోవడం బీసీల పట్ల ఆ పార్టీకి ఉన్న నిర్లిప్తత, భావ దారిద్ర్యాన్ని తేటతెల్లం చేసింది. బీసీల పార్టీ అని డబ్బా కొట్టుకుంటూ కనీసం వారికి ఒక కొత్త స్లోగన్ కూడా చెప్పలేని స్థితిలో బాబు, ఆయన పరివారం ఉంది.

2012 బీసీ డిక్లరేషన్ ఏమైంది బాబూ!

- బీసీ డిక్లరేషన్ పేరుతో గతంలో వందకు పైగా ఇచ్చిన హామీల్లో చంద్రబాబు ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదు.
- 2012లో 19 ప్రధాన హామీలతోపాటు చేతి వృత్తులు, కులాల వారీగా మొత్తం 119 హామీలిస్తూ బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయలేదు. డిక్లరేషన్ అమలు పేరుతో ఏకంగా 56 కమిటీలు వేసి కాలయాపన చేశారు. కత్తెరలు, ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి అదే ఆదరణ అంటూ డబ్బాలు కొట్టుకున్నారు. చివరికి దాన్ని ఒక కుంభకోణంగా మార్చారు. ఇప్పుడు ఆ కుంభకోణాన్ని మళ్లీ తీసుకు వస్తానని ప్రకటించడం విశేషం.
- బీసీలకు వంద అసెంబ్లీ సీట్లు ఇస్తానని డిక్లరేషన్‌లో ప్రకటించిన చంద్రబాబు 2014లో సగం సీట్లు కూడా ఇవ్వలేదు. 2019 ఎన్నికల్లో కేవలం 43 సీట్లతో సరిపెట్టాడు. తాజాగా ప్రకటించిన తొలి జాబితాలో కేవలం 18 సీట్లు బీసీలకు కేటాయించి వంచన చేశాడు.
- రూ.10 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తానన్న చంద్రబాబు ఆ హామీ గాలికి వదిలేశారు. ఐదేళ్లలో రూ.50 కోట్లు సబ్‌ప్లాన్‌కు కేటాయించాల్సి ఉండగా అందులో సగం నిధులు కూడా కేటాయించలేదు.

కొత్తగా మళ్లీ కార్పొరేషన్లా?

జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం. ఇప్పటికే 139 కులాలకు 56 కార్పొరేషన్లను వైఎస్ జగన్ ఏర్పాటు చేశారు. మళ్లీ తాను వస్తే ఏర్పాటు చేస్తానని డిక్లరేషన్‌లో చెప్పడం మోసగించడమేనని చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఈ కార్పొరేషన్లను ఎందుకు ఏర్పాటు చేయలేదు? మళ్లీ ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేస్తామని ఎందుకు చెబుతున్నారు? ఇది మోసం కాదా? అని ప్రశ్నిస్తున్నారు.

2014లో కులగణన ఎందుకు చేయలేదు?

చట్టబద్ధంగా కుల గణన చేస్తామని చంద్రబాబు డిక్లరేషన్‌లో డబ్బా కొట్టుకున్నారు. గతంలో ఇచ్చిన ఆ హామీ ఏమైంది. అధికారంలోకి వచ్చాక దాన్ని బుట్టదాఖలు చేశారు. వైఎస్ జగన్ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. అంతే కాదు రాష్ట్రంలో ఇప్పటికే కుల గణన ప్రారంభించారు.

అన్నీ జగన్ అమలు చేస్తున్న పథకాలే.. బాబు కాపీ

నేతన్నలను ఆదుకుంటానని చెప్పిన చంద్రబాబు మోసం చేస్తే సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నేతన్న నేస్తంతో ఏటా రూ.24 వేలు సాయంతోపాటు పెన్షన్ వయో పరిమితి కుదించి అర్హులందరికీ రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్నారు. బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలంటూ పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలతో ప్రైవేట్ బిల్లు పెట్టించి సీఎం జగన్ చరిత్ర సృష్టించారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు.

వంచనలో వస్తాద్

- చేనేత రంగానికి 25 హామీలు గుప్పించి ఒక్కటీ నెరవేర్చలేదు. రుణాలు మాఫీ చేస్తానని.. కమిటీతో చేతులు దులిపేసుకున్నారు. చేనేత కార్మికులకు రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక నిధి, బడ్జెట్‌లో ఏటా రూ.వెయ్యి కోట్ల మాటే మరిచారు.
- ప్రమాదవశాత్తు మరణించిన వృత్తి పనివారికి పరిహారం.. చేతి, కుల వృత్తుల సమాఖ్యలను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో అనుసంధానం చేసి ఆదుకుంటామన్న హామీ గాల్లో కలిపేశారు.
- గీత కార్మికులకు ఏడు హామీలిచ్చి మోసం చేశారు. బెల్టుషాపులు తొలగించి గీత వృత్తిని ఆదుకుంటామని, హైబ్రిడ్ విత్తనాలు సరఫరా చేసి గీత చెట్లను పెంచేలా ప్రోత్సహిస్తామని, తాటితోపుల పెంపకానికి భూమిని కేటాయిస్తామని ఇచ్చిన హామీని, అన్ని కులాలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు.

వెన్ను విరిచిన బాబు.. దన్నుగా జగన్

- బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరిస్తామని బాబు ప్రగల్భాలు
- రిజర్వేషన్లు తగ్గించాలని కేసులు వేయించింది చంద్రబాబే
- హైకోర్టుకు వెళ్లి మరీ అడ్డుకున్న టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి
- నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34% ఇస్తామని టీడీపీ బోగస్ నినాదం..
- ఇప్పటికే 50 శాతానికిపైగా పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: బీసీలకు వెన్నుపోటు పొడిచిందే చంద్రబాబునాయుడు. స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కుతంత్రాలు పన్నిందే చంద్రబాబు. ఈ అంశంపై టీడీపీ నేతలను హైకోర్టును ఆశ్రయించేలా ఆయన పురిగొల్పారు. టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడం వల్లే బీసీలకు రిజర్వేషన్ 24 శాతానికి తగ్గిపోయింది. సర్పంచుల పదవీ కాలం ముగిసినా, 2014– 19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల సమయంలో ఏ ఇతర స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించలేక పోయారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు మొత్తం 58.95 శాతం రిజర్వేషన్లతో అన్ని రకాల స్థానిక సంస్థలకు ఎన్నిక లు నిర్వహిస్తే టీడీపీ కోర్టుకు వెళ్లి మరీ బీసీల రిజర్వేషన్లకు కోత పెట్టించింది. ఫలితంగా జిల్లా పరిషత్ చైర్మన్, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు సహా ఏకంగా దాదాపు 15 వేలకు పైగా పదవులు కోల్పోవాల్సి వచ్చింది.

టీడీపీ నేత కోర్టు కేసుతో జీవోపై స్టే.. మొత్తం రిజర్వేషన్లను తగ్గిస్తూ తీర్పు!

- బిర్రు ప్రతాప్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కల్పిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవోను కోర్టు కొట్టివేసింది.
- ఆ తర్వాత సైతం సుప్రీంకోర్టు ప్రభుత్వ జీవోను కొట్టివేస్తే ప్రతాప్‌రెడ్డి మరోసారి స్థానిక సంస్థల రిజర్వేషన్లపై హైకోర్టును ఆశ్రయించారు. పర్యవసానంగా...ప్రభుత్వం మొత్తం 59.85 శాతంగా రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికల నిర్వహణకు నిర్ణయించిన రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ ఆదేశాలిచ్చింది. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మార్పులు చేయకూడదు. దీంతో బీసీలే 9.82 శాతం రిజర్వేషన్లు నష్టపోవాల్సి వచ్చింది.

దగా చేసింది బాబు...ఆదుకుంది జగన్...

పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి 59.85 శాతం రిజర్వేషన్లు అమలుకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో 2019 డిసెంబరులో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ చేసేలా ఏకంగా చట్టాన్ని తీసుకువచ్చారు.

మోసాలు బాబు నైజం... బీసీలకు పట్టమే జగనిజం...

చంద్రబాబు చేసిన మోసాలు, మాయలను పటాపంచలు చేస్తూ వైఎస్ జగన్ మేలు చేశారు. రిజర్వేషన్లు తగ్గినా అంతకంటే ఎక్కువ మంది బీసీలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 13 జిల్లా పరిషత్‌లను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంటే, అందులో బీసీలకు 6 జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు (46 శాతం) కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో 648 మండలాలకు వైఎస్సార్‌సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను దక్కించుకుంటే.. అందులో 67 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకే ఇచ్చారు. 14 కార్పొరేషన్‌లను వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తే.. అందులో తొమ్మిది చోట్ల మేయర్ పదవులు బీసీలకు ఇచ్చారు. 87 మున్సిపాలిటీల్లో 84 మున్సిపాలిటీలను వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంటే 44 స్థానాలు బీసీలకే ఇచ్చారు.

రాష్ట్రంలో 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవుల్లో 76 అంటే 39 శాతం బీసీలకు ఇచ్చారు. వివిధ ప్రభుత్వ కార్పొరేషన్‌లలో 137 చైర్మన్ పదవుల్లో 53 బీసీలకు ఇచ్చారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికే అవకాశం కల్పించారు. 137 కార్పొరేషన్‌లకు సంబంధించి మొత్తం 484 డైరెక్టర్ పదవుల్లో 201 బీసీలకు ఇచ్చారు.

నాడు అవమానం.. నేడు సమున్నత గౌరవం

వైఎస్ జగన్ మంత్రివర్గంలో ఇప్పుడు 25 మంది సభ్యులు ఉంటే అందులో ఏకంగా 11 మంది బీసీలకు ఆయన స్థానం కల్పించారు. విద్య, రెవెన్యూ, పౌరసరఫరాలు, వైద్యారోగ్యం వంటి కీలక శాఖలను ఆ వర్గాలకు అప్పగించారు. చంద్రబాబు 2014–19 మధ్య మంత్రివర్గంలో కేవలం 8 పదవులు మాత్రమే బీసీలకు ఇచ్చారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాంను నియమించారు. రాష్ట్ర కోటాలో ఖాళీ అయిన 11 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తే.. నలుగురు బీసీలను సీఎం వైఎస్ జగన్ రాజ్యసభకు పంపారు. టీడీపీ హయాంలో ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు.శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కు 29 పదవులు జగన్ ఇస్తే.. 2014–19 మధ్య చంద్రబాబు18 పదవులు మాత్రమే ఇచ్చారు.

నిన్నటి దొంగ నేడు ముత్యమా?

- గుమ్మనూరుకు సీటిస్తే గుంతకల్లును భ్రష్టు పట్టిస్తారు
- రెడ్ బుక్‌లో రాసిన పేరు ఇప్పుడు లోకేశ్ తీసేస్తారా?
- ఇప్పుడు అవినీతి గుమ్మంలోకి వచ్చిందని రామోజీ రాయగలరా?
- టీడీపీని నిలదీసిన ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి



గుంతకల్లు: 'నిన్నటి వరకూ గుమ్మనూరు జయరాంను బాబు బండబూతులు తిట్టారు. ఇప్పుడు టీడీపీలో చేరగానే అదే జయరాం ముత్యమైపోతాడా? అప్పుడు జయరాం దొంగ అని అన్నారు. ఇప్పుడు మంచి వాడయ్యాడా?' అని అనంతపురం జిల్లా గుంతకల్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు కర్నూలు వెళ్లినప్పుడల్లా పేకాట మంత్రి అని, బెంజ్ కారు మంత్రి అంటూ గుమ్మనూరును విమర్శించేవారని, అదే వ్యక్తికి బాబు టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారని, పసుపు కండువా కప్పుకోగానే పునీతుడయ్యారా అంటూ ప్రశ్నించారు. అప్పుడాయన అవినీతి చేసి ఉంటే టీడీపీలోకి రాగానే ఆ పాపాలన్నీ ప్రక్షాళన అయినట్టని బాబు భావిస్తున్నారా అని నిలదీశారు.

రెడ్‌బుక్‌లో పేరు తొలగిస్తారా?

లోకేశ్ యువగళం పాదయాత్రలో ఆలూరు వెళ్లినప్పుడు ఇక్కడి పేకాట మంత్రి పేరు రెడ్‌బుక్‌లో రాసుకున్నా అని, అధికారంలోకి వచ్చాక ఆయన పని చెబుతా అంటూ గుమ్మనూరును ఉద్దేశించి అన్నారని చెప్పారు. జయరాం ఇప్పుడు టీడీపీలోకి వచ్చినందున, ఆయన పేరు రెడ్ బుక్‌లో నుంచి తీసేస్తారా అని ప్రశ్నించారు. ఈనాడులో గుమ్మనూరుపై కథనం రాశారని, ఇప్పుడు బెంజ్ కారులో గుమ్మంలోకి అవినీతిని తెచ్చుకున్నామని రాయగలరా అని నిలదీశారు.

పేకాట జయరాం మాకొద్దంటూ టీడీపీ క్యాడర్ నిరసన



గుంతకల్లులో ర్యాలీ చేస్తున్న టీడీపీ నేతలు

గుంతకల్లు: పేకాట మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు గుంతకల్లు టికెట్ కేటాయిస్తే డిపాజిట్లు కూడా దక్కనివ్వబోమని టీడీపీ అనుబంధ సంస్థ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. అసలు జయరాంకు గుంతకల్లుతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. బుధవారం తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా గుంతకల్లులోని టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేశారు. పేకాట మాజీ మంత్రి మనకు వద్దంటూ నినాదాలు చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణాన్ని కోరుకుంటున్నారని, అరాచకాలు చేసే జయరాంతో అది సాధ్యం కాదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, జయరాంకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలూరులో చెత్త (గుమ్మనూరు జయరాం) ఇక్కడ బంగారం అవుతుందా అని చంద్రబాబును ప్రశ్నించారు. నారా లోకేశ్‌ను దూషించిన గుమ్మనూరు సోదరులను పార్టీలోకి చేర్చుకోవడానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోనే ప్రశాంతతకు మారుపేరైన గుంతకల్లు సీటును ఈ అరాచక వ్యక్తికి ఇస్తే పేకాట క్లబ్బులు, నకిలీ మద్యానికి అడ్డాగా మార్చేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. జితేంద్రగౌడ్‌ను కాదని జయరామ్‌కు టికెట్ ఇస్తే డిపాజిట్టు కూడా రాకుండా ఓడిస్తామని శపథం చేశారు.

టీడీపీలో కొత్త కష్టాలు

- వలస నేతలతో ఉన్న నేతలకు గండం
- వేమిరెడ్డి రాకతో సోమిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి సీట్లు గల్లంతు
- సోమిరెడ్డికి బదులు సర్వేపల్లిలో రూప్‌కుమార్‌కి సీటివ్వాలని వేమిరెడ్డి పట్టు
- కోవూరు సీటును తన సతీమణికి ఇప్పించేందుకు ప్రయత్నాలు
- లావు శ్రీకృష్ణదేవరాయలు చేరికతో యరపతినేని, అరవింద్‌బాబు సీట్ల కిందకు నీరు
- గుమ్మనూరు జయరాం దెబ్బకు జితేంద్ర గౌడ్.. సారథి ప్రభావంతో ముద్దరబోయినకు చెక్
- ఫిరాయింపు నేతలకు పెద్దపీట వేసి తమను అవమానిస్తున్నారని సీనియర్ల ఆగ్రహం



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ వద్దనుకున్న నాయకులను అక్కున చేర్చుకున్న టీడీపీకి ఇప్పుడు కొత్త కష్టాలు మొదలయ్యాయి. పార్టీ ఫిరాయించి వలస వచ్చిన నేతలు ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న సీనియర్ నేతలకు ఎసరు పెడుతున్నారు. భారీగా నిధులు ఇస్తుండటంతో చంద్రబాబు కూడా వారు చెప్పినట్టల్లా ఆడుతున్నారు. వలస నేతల దెబ్బకు సీట్లు ఎగిరిపోయిన నేతలు చంద్రబాబుపై నిప్పులు చెరుగుతున్నారు. దిగుమతి నేతలపై కారాలు మిరియాలు నూరుతూ నియోజకవర్గాల్లో వారికి పట్టు దొరక్కుండా చేస్తున్నారు. ఫిరాయింపు నేతలకు పెద్దపీట వేసి, తమను అవమానిస్తున్నారని సీనియర్లు చంద్రబాబుపై ఆగ్రహంగా ఉన్నారు. దీంతో టీడీపీలో పాత, కొత్త నేతల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది.

నెల్లూరు టీడీపీలో చిచ్చుపెట్టిన వేమిరెడ్డి

ఉమ్మడి నెల్లూరు జిల్లా టీడీపీలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పెద్ద చిచ్చే పెట్టారు. ఇటీవలే టీడీపీలో చేరిన ఆయన నెల్లూరు ఎంపీ స్థానాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా మరికొన్ని ఎమ్మెల్యే స్థానాల్లో తాను చెప్పిన వారికే సీట్లు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కోవూరు స్థానాన్ని తన సతీమణి ప్రశాంతికి ఇవ్వాలని చంద్రబాబుపై గట్టి ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పుడు ఆమె పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే జరుగుతోంది. దీంతో అక్కడి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి రగిలిపోతున్నారు. ఆయన ఈసారి తన కొడుకుని అక్కడ పోటీ చేయించేందుకు చాలారోజుల నుంచి పని చేస్తున్నారు. ఇప్పుడు బయటి వ్యక్తి కోసం తమను మోసం చేయడం ఏమిటని ఆయన అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. వేమిరెడ్డి ప్రవేశంతో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీటు కూడా ఎగిరిపోయే పరిస్థితి ఏర్పడింది. సర్వేపల్లిలో సోమిరెడ్డి స్థానంలో తనతో పాటు టీడీపీలో చేరిన నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌ని పోటీ చేయించడానికి వేమిరెడ్డి రంగం సిద్ధం చేశారు. రూప్‌కుమార్ పేరుతో సర్వే కూడా చేస్తుండడంతో సోమిరెడ్డి వర్గం భగ్గుమంటోంది. టీడీపీలో ఆది నుంచి ముఖ్య నాయకుడిగా ఉన్న సోమిరెడ్డి ఇప్పుడు చంద్రబాబు వద్ద చేతులు కట్టుకుని నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బున్న నేతలతోనే అంతా అయిపోతే ఇక తామెందుకుని ఆయన అనుయాయుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నగాక మొన్న పార్టీలో చేరి తమ సీట్లను ప్రభావితం చేయడం ఏమిటని, చంద్రబాబు ఆయనకు వంత పాడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'లావు' దెబ్బకు ఇద్దరు సీనియర్లు విలవిల


వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట లోక్‌సభ సీటు నిరాకరించడంతో చంద్రబాబు పక్కన చేరిన లావు శ్రీకృష్ణదేవరాయలు దెబ్బకు ఇద్దరు టీడీపీ సీనియర్లు విలవిల్లాడుతున్నారు. పార్టీలో చేరకముందే ఆయన సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు సీటుకు ఎసరు పెట్టారు. యరపతినేని పోటీ చేసే గురజాల సీటును జంగా కృష్ణమూర్తికి ఇవ్వాలని ప్రతిపాదన పెట్టారు. చంద్రబాబు దానికి సరేనని యరపతినేనికి సీటు ఖరారు చేయకుండా పక్కనపెట్టేశారు. అంతటితో ఆగకుండా యరపతినేనిని నర్సరావుపేట ఎమ్మెల్యే స్థానానికి పంపాలని సూచించడంతో చంద్రబాబు దానిపై ఐవీఆర్ఎస్ సర్వే చేయించారు. దీంతో అక్కడి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద్ బాబు సీటు ప్రశ్నార్థకమైంది. లావు రాజకీయంతో నర్సరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో అయోమయం నెలకొంది.

గుమ్మనూరు రాకతో జితేంద్రగౌడ్ సీటు గల్లంతు

వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వెళ్లిపోయి బర్తరఫ్ అయిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకి గుంతకల్ సీటు ఇచ్చేందుకు చంద్రబాబు సమ్మతించడం టీడీపీలో అగ్గి రాజేసింది. గుంతకల్ సీటును జయరాం దక్కించుకోవడంతో అక్కడి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ సీటు గల్లంతైంది. దీంతో ఆయన వర్గం జయరాంకి వ్యతిరేకంగా ఆందోళనకు దిగింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం స్థానాన్ని బయట నుంచి వచ్చిన వసంత కృష్ణప్రసాద్‌కి ఖరారు చేయడంతో మాజీ మంత్రి దేవినేని ఉమా పరిస్థితి ప్రశ్నార్థకమైంది. నూజివీడు సీటును వలస నేత కేపీ సారథికి కేటాయించడంతో పదేళ్లుగా అక్కడ పార్టీ కోసం పనిచేస్తున్న బీసీ నేత ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు చోటు లేకుండాపోయింది. ఇలా రాజకీయ అవసరాల కోసం అప్పటికప్పుడు పార్టీ ఫిరాయించిన వారిని చంద్రబాబు అందలం ఎక్కించుకుని పార్టీ కోసం పని చేసిన వారిని పూచికపుల్లల్లా తీసివేస్తుండటం టీడీపీలో కల్లోలం రేపుతోంది.

బీసీలకు బాబు ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా?

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సామాజికంగా వెనుకబడిన బీసీలను సీఎం జగన్ గుర్తించి వారి అభ్యున్నతికి పాడుపడ్డారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు లాంటి వ్యక్తులు అబద్ధాలు చెప్పేందుకు 'జయహో బీసీ' పేరుతో సభలు నిర్వహించి బీసీలను మోసగిస్తున్నారని దుయ్యబట్టారు. 14 ఏళ్లు సీఎంగా బీసీల కోసం ఒక్క మంచిపనైనా చేశారా.. అని ప్రశ్నించారు. నిజంగా బీసీలకు ఏమైనా చేసి ఉంటే చంద్రబాబు గానీ, ఆయన తరఫున ఎవరైనాగానీ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం ధనవంతులకే రాజ్యసభ సీట్లు కేటాయించి డబ్బులు దోచుకున్నారే తప్ప, ఏనాడూ వెనుకబడిన కులాల కోసం ఆలోచన చేయలేదన్నారు. సీఎం జగన్ వచ్చాక చరిత్రలో నిలిచిపోయేలా బీసీల్లో నలుగుర్ని రాజ్యసభకు, ఆరుగురిని ఎంపీలుగా, 12 మందిని మంత్రులుగా చేశారని గుర్తు చేశారు. అత్యున్నత న్యాయస్థానంలో బీసీలు పనికిరారు అని కేంద్రానికి లేఖ రాసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానన్న బాబు మాటలను జనం నేటికీ మరిచిపోలేదని చెప్పారు. తాము మాత్రం వారికి క్షౌరశాల ఉంటే రూ.10 వేలు, విద్యుత్ చార్జీల తగ్గింపు, వృత్తి చార్జీలపెంపు, టీటీడీ ట్రస్ట్ బోర్డులో మెంబర్‌గా అవకాశం కల్పించామని తెలిపారు.



రేపు ఉమెన్స్ డే

ఆర్థిక స్వాతంత్ర్యం అంటే?

స్త్రీలు సంపాదనపరులైతే ఏమవుతుంది?
ఆర్థికంగా సమృద్ధి సాధిస్తే ఏమవుతుంది?
తమ జీవితాలపై అధికారం వస్తుంది.
కీలక నిర్ణయాలప్పుడు
గొంతెత్తే ఆత్మవిశ్వాసం వస్తుంది.
తమకు ఏ హక్కులు రక్షణ ఇస్తాయో
ఎరుక కలుగుతుంది.
స్త్రీ ఇవన్నీ కుటుంబ సంక్షేమానికే
వెచ్చిస్తుంది.
స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం ఇంటా, బయటా
స్త్రీ, పురుషుల సమ భాగస్వామ్యాన్ని
ప్రతిపాదిస్తుంది.
కాని స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యానికి
ఇంకా ఎంతో చైతన్యం కావాలి.

జీవితంపై అధికారం హక్కులపై ఎరుక

స్త్రీలు సాధికారత పొందటం అంటే ఏమిటి? పరాధీనత నుంచి బయటపడటమే. అంటే? మరొకరు తనను పోషించే స్థితి నుంచి బయటపడటమే. తండ్రి, భర్త, కుమారుడి సంపాదన వల్ల మాత్రమే జీవితం గడుస్తూ ఉంటే కనుక ఆ పరాధీనత నుంచి బయట పడటం. అంటే బంధం నుంచి బయటపడటం కాదు. స్థితి నుంచి మాత్రమే. స్త్రీలు సాధికారత ఎప్పుడు పొందుతారంటే ఆర్థికంగా వారు స్వేచ్ఛ పొందినప్పుడు. స్త్రీలకు సామాజికంగా, కుటుంబపరంగా హక్కులు ఉంటాయి. అయితే ఆ హక్కులను దక్కించుకోవాలంటే వారికి ఆర్థిక ఆత్మవిశ్వాసం ఉండాలి.

పుట్టుక నుంచే

స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలనే భావన ఆడపిల్లలు పుట్టినప్పటి నుంచే తీసివేయడం నేటికీ జరుగుతోంది. 'ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టడానికి' అనుకునే తల్లిదండ్రులు, భర్త సంపాదన వల్ల మాత్రమే ఆమె బతకాలనుకునే తల్లిదండ్రులు ఆమె చదువును నిర్లక్ష్యం చేయడం గ్రామీణ భారతంలో నేటికీ జరుగుతూనే ఉంది. ఆడపిల్లకు ఆస్తిపాస్తులు ఇచ్చినా చదువు వల్ల వచ్చే, ఆమెకై ఎంచుకునే ఉపాధి నుంచి వచ్చే సంపాదన కలిగించే ఆత్మవిశ్వాసం వేరు. స్త్రీలను 'అదుపులో ఉంచడం' అంటే వారిని ఆర్థిక వనరుల నుంచి దూరంగా పెట్టడమే. పోపుల డబ్బాలో కొద్దిపాటి చిల్లరకే ఆమె హక్కుదారు. దానివల్ల న్యూనతతో ఉండాలి. కుటుంబంలో ముఖ్యమైన నిర్ణయాల సమయంలో భర్త/తండ్రి/కుమారుడి మాట చెల్లుబాటు కావడానికి కారణం వారు 'ఆర్థిక వనరులు కలిగి ఉండటం'. 'రూపాయి సంపాదన లేని దానివి నువ్వు కూడా మాట్లాడేదానివేనా' అని స్త్రీలను పరోక్షంగా అనడం. అదే ఆమెకు సంపాదన ఉంటే నా వల్ల కూడా కుటుంబం నడుస్తోంది కాబట్టి కుటుంబ సంక్షేమం కోసం నా పాయింట్ చెప్పాల్సిందే అని అనగలదు. కుటుంబపరంగా, సామాజికంగా తన జీవితం ఏ విధంగా గడవాలని స్త్రీ ఆశిస్తుందో ఆ నిర్ణయాన్ని వెల్లడించే శక్తి ఆర్థిక స్వావలంబన వల్ల కలుగుతుంది. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం. అందుకు చదువు ముఖ్య సాధనం.

సాధికారత అంటే?

స్త్రీలు సాధికారత పొందాలంటే వారి ఆకాంక్షలకు సమాజం ఆమోదం తెలపాల్సిందే. ఒక స్త్రీ అంట్రప్రెన్యూర్ కావాలనుకున్నా, పెద్ద పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానానికి ఎదగాలనుకున్నా, కాన్పు సమయంలో బ్రేక్ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత తిరిగి తన ఉద్యోగం చేయాలని అనుకున్నా, పెళ్లి తర్వాత పై చదువులకు వెళ్లాలనుకున్నా, గృహిణిగా ఉంటూ ఇంటిపట్టునే ఏదైనా పనిచేసి సంపాదించాలనుకున్నా వారికి అడ్డుగా నిలవకపోవడమే చేయవలసింది. ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు తమ సంపాదనలో 90 శాతం కుటుంబం కోసం ఖర్చు పెడతారు. పురుషులు నలభై-యాభై శాతం ఖర్చు పెడతారు. స్త్రీలు సాధికారత పొందడం అంటే తాము ఏం చేసినా పడి ఉంటుందనే భావన నుంచి పురుషులను బయట పడేయడం. ఎక్కువ తక్కువ లేని గౌరవ బంధాలను ప్రతిపాదించడం.

ఆర్థిక అక్షరాస్యత

స్త్రీలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి. ముఖ్యంగా దిగువ, మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక అక్షరాస్యతను కలిగించాలి. వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ బడ్జెట్, పొదుపు, ఆదాయం తెచ్చే పెట్టుబడి... వీటి గురించి అవగాహన ఉండాలి. 'మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే' మీ దగ్గర ఎంత డబ్బు ఉండాలి... అందుకు ఏమి చేయాలో తెలుసుకోవాలి. సొంత ఆస్తి, స్వీయపేరు మీద పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, షేర్లు, ఎమర్జన్సీ ఫండ్ కలిగి ఉండటం, డిజిటల్ పరిజ్ఞానం పొంది ఉండటం– అంటే ఆర్థిక లావాదేవీలు ఫోన్‌మీద, కంప్యూటర్ మీద చేయగలిగి వేగంగా పనులు నిర్వర్తించ గలగడం.

కుటుంబ సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అనుకుంటే కుటుంబంలో కీలకమైన వాటాదారైన స్త్రీ ఎంత ఆర్థిక సమృద్ధితో ఉంటే దేశ సమృద్ధి అంతగా పెరుగుతుంది. ఉమెన్స్ డే సందేశం అదే.

వినూత్నం

రోబో టీచరమ్మ





సినిమాల్లో హ్యూమనాయిడ్ రోబోను చూడగానే
పిల్లల సంతోషం ఇంతా అంతా కాదు.
సినిమాల్లో కనిపించే రోబో క్లాస్‌రూమ్‌లోకి
అడుగు పెడితే?
'అబ్బో! ఆ అల్లరికి అంతు ఉండదు' అనుకుంటాం.
అయితే 'ఐరిష్' అనే ఈ రోబో ముందు మాత్రం పిల్లలు
బుద్ధిగా, సైలెంట్‌గా ఉండాల్సిందే.
ఇంతకూ ఎవరీ ఐరిష్?

కేరళలోని తిరువనంతపురం కేటీసీటీ హైయర్ సెకండరీ స్కూల్ లోకి ఫస్ట్ జెనరేటివ్ ఏఐ స్కూల్ టీచర్ ఐరిష్ అడుగు పెట్టింది. ఈ హ్యూమనాయిడ్ ఉపాధ్యాయురాలు మూడు భాషల్లో మాట్లాడగలదు. విద్యార్థులు అడిగే ప్రశ్నలకు స్పష్టంగా జవాబులు చెప్పగలదు.

ఎడ్‌టెక్ 'మేకర్‌ల్యాబ్స్' రూపకల్పన చేసిన ఈ జెనరేటివ్ ఏఐ స్కూల్ టీచర్ కేరళలోనే కాదు దేశంలోనే మొదటిది.

'ఐరిష్ నాలెడ్జ్‌బేస్ ఇతర ఆటోమేటెడ్ టీచింగ్ టూల్స్ కంటే విస్తృతంగా ఉంటుంది. ఎందుకంటే ఇది జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేస్తుంది' అంటుంది మేకర్ ల్యాబ్స్.

చదువుకు సంబంధం లేని సబ్జెక్ట్‌ల జోలికి 'ఐరిష్' వెళ్లదు.

'కృత్రిమ మేధతో అవకాశాలు అనంతం అని చెప్పడానికి ఐరిష్ ఒక ఉదాహరణ. పిల్లలు అడిగే సందేహాలకు టీచర్‌లాగే ఐరిష్ సరియైన సమాధానాలు ఇవ్వగలదు' అంటున్నారు 'మేకర్‌ల్యాబ్స్' సీయీవో హరిసాగర్.

'మేకర్‌ల్యాబ్స్‌తో కలిసి ఎన్నో రకాల వర్క్‌షాప్‌లు నిర్వహించాం. వీటి ద్వారా పిల్లలు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3డీ ప్రింటింగ్‌కు సంబంధించిన నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారు' అంటున్నారు స్కూల్ ప్రిన్సిపాల్ మీరా ఎంఎన్.

స్టార్టప్ దిశగా అంకురం!



విద్యార్థులకు సర్టిఫికేట్ ప్రదానం చేస్తున్న డాక్టర్ గీతారెడ్డి

సమాజం మారాలి... సమాజంలో మార్పు రావాలి.
సమాజంలో మార్పు తేవాలి. ఈ ప్రసంగాలు వింటూనే ఉంటాం.
మారాలని అందరూ కోరుకుంటారు.
మార్పు కోసం ఏం చేయాలో తెలిసిన వాళ్లెందరు?
సమాజం మారాలంటే ఏం చేయాలో తెలిసి ఉండాలి.
ఆ మార్పు మనతోనే మొదలు... అనుకోవాలి.
మార్పు దిశగా తొలి అడుగు వేయగలిగిన చొరవ ఉండాలి.
అలా డిజిటల్ ఎరాలోకి అడుగుపెట్టారు డాక్టర్ గీత.
తన పాదముద్రలతో అభివృద్ధి దారి చూపిస్తున్నారు.



మన సమాజం ఉద్యోగాలు వెతుక్కునే సమాజంగానే ఉండిపోవడానికి కారణం కూడా పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు యువత ఆలోచనలను చిదిమేయడమే. పెద్దవాళ్ల కంటే యువత ఒక తరం ముందు ఉంటుంది. ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. ఆ ఆలోచనలకు ఒక అండ దొరికితే వాళ్లు అద్భుతాలు చేస్తారు.

– డాక్టర్ గీతారెడ్డి బోర.
ఫౌండర్, యష్మి సొల్యూషన్స్,
యష్మిత ఈ టెక్నాలజీస్,
ఛైర్‌పర్సన్, సీఐఎమ్ఎస్ఎమ్ఈ, ఆంధ్రప్రదేశ్

ఈ డిజిటల్ యుగంలో దాదాపుగా అందరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లే. ఇలాంటి డిజిటల్ ఎరాను ముందుగానే ఊహించి సమాజాన్ని ప్రభావితం చేసిన సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ గీతాబోర. ప్రపంచదేశాలన్నీ ఒక తాటిమీదకు వచ్చి ఒకేరకమైన నైపుణ్యాలతో గ్లోబల్ వేదిక మీద పోటీ పడుతున్న తరుణంలో మన గ్రామీణ విద్యార్థుల్లో ఎంతమంది ఈ పోటీలో నిలవ గలుగుతున్నారనే ప్రశ్న వేసుకుని అందుకు సమాధానంగా కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్‌లో శిక్షణ అవసరాన్ని గుర్తించారామె. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ దొరక్క మిగిలిపోయిన పిల్లలు బీపీవోల్లో నైట్ షిఫ్ట్ ఉద్యోగాల్లో ఉపాధిని వెతుక్కోవాల్సి రావడం, క్రమంగా నైట్‌లైఫ్‌కు అలవాటు పడిపోవడం, యువశక్తి నిర్వీర్యం కావడంతోపాటు సమాజంలో చాపకింద నీరులా వ్యసనాలు విస్తరించడాన్ని గ్రహించారు. అలాగే చదువుకున్న ప్రతి ఒక్కరూ పట్టా చేతపట్టుకుని ఉద్యోగం కోసం ఎదురు చూడడం కాదు సొంతంగా తమను తాము నిరూపించుకునే ప్రయత్నం చేయాలని, స్టార్టప్ దిశగా నడవడానికి విద్యార్థి దశలోనే ఈ ఆలోచనకు అంకురం వేయాలని ఆలోచించారు. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ఉన్నత విద్యాశాఖ సమన్వయంతో సర్టిఫికేట్ కోర్సుకు రూపకల్పన చేశారు. సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా సమాజానికి తన కంట్రిబ్యూషన్ గురించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారామె.

''నేను పుట్టింది, పెరిగింది వైజాగ్‌లో. ఎంసీఏ తర్వాత హైదరాబాద్‌లో పన్నెండేళ్లపాటు ఉన్నాను. ఇప్పుడు నా కంపెనీ వ్యవహారాలు, సామాజిక వ్యవహారాలను వైజాగ్ నుంచే నిర్వహిస్తున్నాను. సమాజం మారాలని వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడం కాదు, విద్యావ్యవస్థను గాడిలో పెడితే, యువత ఆలోచనలను అభివృద్ధి వైపు మరల్చినట్లయితే సమాజం దానంతట అదే మారుతుంది. సరిగ్గా నేను అదే చేస్తున్నాను. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 41 ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రసంగించి, నాలుగువందల మంది విద్యార్థులను ప్రభావితం చేయగలిగాను. వారిలో 150 మంది తమ సొంత ఆలోచనలతో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ వైపు అడుగులు వేస్తున్నారు. పెద్దవాళ్లు అనుభవం పేరుతో యువత ఆలోచనలకు పరిధులు విధిస్తుంటారు. ఇది చాలా తప్పు. యువత ఆలోచనలను బయటకు చెప్పగలిగేలా వాళ్లను ప్రోత్సహించాలి. పెద్దవాళ్లు ఎప్పుడూ యువత ఆలోచనలను కార్యరూపం దాల్చడానికి తమ అనుభవం నుంచి కొన్ని సూచనలు చేయవచ్చు. అంతేతప్ప యువత ఎలాంటి ఉపాధిని వెతుక్కోవాలనే ఆలోచనలు కూడా తామే చేయాలనుకోకూడదు. ఈ అంతరాన్ని పూడ్చడానికి నేను ప్రయత్నిస్తున్నాను. మెంటార్, రీసోర్స్ పర్సన్, మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నాను. చైల్డ్ అబ్యూజ్, మహిళల పట్ల వివక్ష, మహిళల కుటుంబ, వైవాహిక పరమైన చిక్కులకు న్యాయసలహాలతో కౌన్సెలింగ్ ఇస్తున్నాను. మా వైజాగ్‌లో భూబకాసురుల చేతిలో చిక్కుకున్న భూమి వివరాలను, ఒరిజినల్ డాక్యుమెంట్‌ల ఆధారాలను ప్రభుత్వానికి తెలియచేసి, బాధితులకు అండగా నిలిచాను. ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉమన్‌గా సమాజానికి ఇస్తున్న సేవకుగాను 'నారీప్రెన్యూర్' గుర్తింపును అందుకున్నాను. ఇప్పుడు నా మీద మహిళల కోసం పని చేయాల్సిన బాధ్యత కూడా పెరిగింది. గ్రామీణ మహిళలను ఆర్థిక సాధికారత వైపు నడిపించడానికి కార్యక్రమాల మీద పని చేస్తున్నాను. పరిమితమైన వనరులు, సాధారణ విద్యార్హతలు కలిగిన గ్రామీణ మహిళ తన మేధను ఉపయోగించి ఎదగడానికి అవసరమైనట్లు శిక్షణ కార్యక్రమాలను రూపొందిస్తున్నాను. ఆడవాళ్ల అభ్యుదయ కోణంలో ఆలోచించనంత కాలం సమాజం అభివృద్ధి దిశగా నడవదు. అందుకే మహిళ మారాలి, ఆమె మారితే పిల్లల ఆలోచనలు మారుతాయి. ఆ భావితరం మనం కోరుకున్న సమాజాన్ని నిర్మిస్తుంది'' అన్నారు డాక్టర్ గీతారెడ్డి బోర.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రేపు మహాశివరాత్రి

ఒక చైతన్య జాగృతి



చతుర్దశి నాడు మహాశివరాత్రిని భక్తులు శివుని జన్మదినంగా వైభవంగా జరుపుకుంటారు. ఇది హిందువులకు అత్యంత ప్రాధాన్యత గల పవిత్ర దినం. ప్రతి నెలా అమావాస్య ముందు వచ్చే బహుళ (రాత్రిగల) చతుర్దశినాడు మాసశివరాత్రిగా జరుపుకుంటారు.

పరమ శివునికి ఎంతో ప్రీతికరమైన శివరాత్రినాడు పగలంతా ఉపవాసం ఉండి, రోజంతా శివనామస్మరణతో గడుపుతూ, ప్రదోషవేళ శివుని అభిషేకించి, బిల్వదళాలతో పూజించాలి. ఆ రోజున శివాలయంలో దీపం వెలిగించడం వలన విశేష ఫలం లభిస్తుంది. ఉపవాసం, శివార్చన, జాగరణ.. ఈ మూడూ శివరాత్రినాడు ఆచరించ వలసిన విధులు. ఉపవాసం అంటే దేవునికి అతి సమీపంలో వసించడం. మనం ఇంద్రియాలతో అనుభవిస్తున్నవన్నీ ఆహారాలే. వాటన్నింటికీ దూరంగా ఉండడమే నిజమైన నియంత్రణ. అదే నిజమైన ఉపవాసం. భౌతిక రుచులన్నింటినీ పక్కకు పెట్టి పూర్తిగా శివసంబంధమైన కార్యక్రమాల్లోనే త్రికరణ శుద్ధిగా తాదాత్మ్యం చెందాలి. భోగానందాన్ని విస్మరించి, యోగానందావస్థలోకి ప్రవేశిస్తూ కోటి వెలుగుల ఆ శివజ్యోతి ప్రకాశాన్ని అంతరంగంలో నింపుకొని సచ్చిదానందమైన ఆధ్యాత్మిక ప్రస్థానం చేయడమే మహాశివరాత్రి అంతర్యం. మహాశివరాత్రినాటి అర్ధరాత్రి సమయంలో శివలింగ ప్రాదుర్భావం జరుగుతుందంటారు. లింగం నిర్గుణోపాసనకు, శివస్వరూపం సగుణోపాసనకు సంకేతాలు.

శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి మాసశివరాత్రులు/మహాశివరాత్రినాడు రుద్రాభిషేకాలు శివార్చనలు, బిల్వార్చనలు జరపడం ఆయురారోగ్యైశ్వర్య ప్రదం. ప్రత్యేకించి శివునికి ప్రీతికరమైన సోమవారం నాడు ఉదయాన్నే నిత్యకర్మలు పూర్తిచేసి పగలంతా ఉపవాసం ఉండి సాయంకాలం శివారాధన చేసి నక్షత్రోదయ సమయాన ఈశ్వర నివేదితమైన ప్రసాదం తినడాన్ని నక్షత్ర వ్రతం అంటారు. సోమవారం 'ఇందుప్రదోషం'గా శివుని ఆరాధించడం విశేష ఫలప్రదమని శాస్త్ర వచనం.16 సోమవారాలు నియమ పూర్వకంగా చేస్తే గ్రహదోషాలు పోవడమే కాక సర్వాభీష్టాలు నెరవేరతాయి.

శివరాత్రులు ఐదు రకాలు

1. **నిత్యశివరాత్రి:** ప్రతిరోజూ శివారాధన చేస్తారు.
2. **పక్ష శివరాత్రి :** ప్రతి మాసంలో శుక్ల, బహుళ పక్షాలలో వచ్చే చతుర్దశులలో శివార్చన చేయడం.
3. **మాస శివరాత్రి :** ప్రతి మాసంలో బహుళ చతుర్దశినాడు మాసశివరాత్రి.
4. **మహాశివరాత్రి :** మాఘ బహుళ చతుర్దశి నాటి సర్వశ్రేష్ఠమనదగిన శివరాత్రి.
5. **యోగ శివరాత్రి:** యోగులు యోగ సమాధిలో ఉండి చేసే శివచింతన.

శివ తత్త్వం

శివతత్త్వం ఎవరికీ అంత సులువుగా అర్థమైనది కాదు. శివుని కన్నా పెద్దది గాని, చిన్నది గాని సాటి మరొకటి లేదనేది తత్త్వ సాధకులు మోక్ష సాధకులకు ఆశ్రయించదగ్గ ఏకైక రూపం శివస్వరూపం. శివతత్త్వంలోని నిగూఢమైనటువంటి విషయాలలో ప్రప్రథమమైనవి జ్యోతిర్లింగాలు. శివుడు ద్వాదశ జ్యోతిర్లింగ రూపాలలో ఉన్నాడని, ఇది శివతత్త్వంలో భాగమేనని జ్యోతిర్లింగమనగా చీకటిని, అజ్ఞానాన్ని తొలగించి వెలుగు (అనగా జ్ఞానము) ప్రసాదించేది అని జ్యోతిర్లింగాల తత్త్వం తెలియచేస్తుంది. శివతత్త్వంలో మరొకటి లింగాకారం. శివలింగాకారం పై భాగం లింగంగా కింద పానవట్టం యోని రూపంలో ప్రకృతీ పురుషుల ప్రతీకగా ప్రకృతీ పురుషులలో ఒకరు లేనిదే మరొకరు లేరు అని చెప్పేటటువంటి తత్త్వం. శివతత్త్వంలో మరొక తత్త్వం ప్రళయ తత్త్వం. ప్రళయతత్త్వం మూడు విధాలుగా ఉన్నది. రాత్రి సమయంలో నిద్ర ఇది ప్రళయ తత్త్వంలో ఒక భాగం (నిద్ర) ప్రాపంచిక మాయ నుండి మరపునిస్తుంది. రెండవది మరణం. ఇది స్థూల శరీరానికి సంబంధించినటువంటి ప్రళయం.

మూడవది మహా ప్రళయం. సమస్తం శివునిలో కలసిపోవటం. నాలుగవది త్రిమూర్తితత్త్వం (శివ, విష్ణు, బ్రహ్మ). శివుని నుండి విష్ణువు, విష్ణువు నుంచి బ్రహ్మ ఆవిర్భవించారనేది శాస్త్రం. బ్రహ్మ సృష్టిస్తే విష్ణువు నడిపించి శివుడు అంతం చేయటం లోకోక్తి. పంచభూతలింగాల తత్త్వం. పంచభూతాలు అనగా అగ్ని, వాయువు, భూమి, ఆకాశం, జలం. అన్నిటిలోను శివుడున్నాడు అనేటటువంటి తత్త్వం. రుద్రతత్త్వం అంటే శివుడిని పూజించేటటువంటి పద్ధతి. రుద్రంలో మహన్యాసం, నమకం, చమకం అనే విధానం. మహన్యాసం అంటే చేసేది శివుడే, నీవు శివుడవే అని నిర్ధారిస్తుంది. శివతత్త్వంలో శివస్వరూపంలో దాగివున్న విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అందరికందరూ ఒకే రూపం అయినప్పటికీ, శివ రూపమే సనాతనం. ఇదే సకల రూపాలకు మూలం. సాక్షాత్తు శివుడు గుణాతీతుడు. కాలాతీతుడు. నిత్యుడు, అద్వితీయుడు, అనంతుడు, పూర్ణుడు, నిరంజనుడు, పరబ్రహ్మ పరమాత్మ.

గుణనిధి అనే ఒక దుర్వ్యసనపరుడు నేరం చేసిన భయంతో శివరాత్రినాడు శివాలయంలో శివుని వెనుక దాగున్నాడు. కొండెక్కుతున్న దీపం వత్తిని కాకతాళీయంగా ఎగదోసి, తన ఉత్తరీయపు కొంగులను చించి వత్తిగా చేసి దానికి జత చేసి ఆవునెయ్యి పోసి దీపప్రజ్వలనం కావించాడు.

తెల్లవార్లూ భయంతో మేలుకొని ఉండి తెల్లవారాక తలారి బాణపు దెబ్బకు మరణించాడు. బతుకంతా దుశ్శీలుడై నడచినా శివరాత్రినాడు దైవసన్నిధిలో ఉపవాసం, జాగరణ తనకు తెలియకుండానే చేసిన మహాపుణ్య ఫలితంగా మరుజన్మలో కళింగ రాజు అరిందముడికి పుత్రుడై జన్మించి దముడనే పేరుతో మహారాజై తన రాజ్యంలోని శివాలయాలన్నింటిలో అఖండ దీపారాధనలు చేయించి అపై కుబేరుడిగా జన్మించి ఉత్తర దిక్పాలకుడై శివుడికి ప్రాణసఖుడయ్యాడన్న కథ శ్రీనాథుడి కాశీఖండంలో ఉంది.

శ్రీరాముడు లంకపైకి దండెత్తే ముందు సాగరతీరంలో ఇసుకతో లింగం చేసి పూజించాడు. ఆ సైకతలింగ క్షేత్రమే నేటి రామేశ్వరం. లంకాధీశుడు తన పది తలలు కోసి శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నది ఈ రోజునే అని చెబుతారు.

ఆ రూపంలోనే అంతా!

శివుని తలపై గంగ ప్రవాహం ఒక తరం నుండి మరొక తరానికి జ్ఞానం ప్రసారమవుతుందని సూచిస్తుంది. శివుని తలపై చంద్రుడు భగవంతుడిపై ధ్యాస ఎల్లవేళలా ఉండాలని సూచిస్తుంది. శివునికి మూడో కన్ను చెడును, అజ్ఞాన నాశనాన్ని చూపిస్తుంది. శివుని వద్ద ఉన్న త్రిశూలం జ్ఞానం, కోరిక, అమలు అనేటటువంటి మూడింటి స్వరూపం. శివుని ఢమరుకం వేదగ్రంథాలు వేదస్వరాన్ని తెలియచేసే ఢమరుకం. శివుని మెడపై ఉన్న సర్పం అహం నియంత్రణను సూచిస్తుంది. శివుడు ధరించే రుద్రాక్ష స్వచ్ఛతను, ధరించే మాలలు ఏకాగ్రతనూ సూచిస్తాయి. నడుముకు చుట్టుకునే పులి చర్మం భయం లేనటువంటి తత్త్వాన్ని సూచిస్తుంది.

క్షీర సాగర మథన సమయంలో నిప్పులు చిమ్ముకుంటూ పెల్లుబికి వచ్చిన ఘోర కాకోల విషాగ్నుల నుంచి లోకాలను రక్షించవలసిందిగా దేవగణం వేడుకోగా, శివుడు ఆ గరళాన్ని తన గళాన నిలిపి ముల్లోకాలనూ కల్లోలం నుంచి కాపాడాడు. ఆ కాళరాత్రే శివరాత్రి. 'నిర్ణయసింధు'లోని నారద సంహితలో శివరాత్రి వ్రతవిధానం ఉంది. మార్కండేయుడు, నత్కీరుడు, సిరియాళుడు, చిరుతొండనంబి, తిన్నడు, శక్కనారు, అక్క మహాదేవి, బెజ్జ మహాదేవి వంటి ఎందరో శివ భక్తుల అమేయ భక్తిగాథలు మనకు పురాణాల్లో కనిపిస్తాయి.

జాంబవతికి సత్సంతానాన్ని ప్రసాదించమని ఇదే రోజున శివుణ్ణి కృష్ణుడు ప్రార్థించాడనే కథనం వ్యాప్తిలో ఉంది. శివ అంటే శుభం, ఆనందం, మంగళం, కైవల్యం, శ్రేయం అని అర్థాలు. శివరాత్రివేళ అభిషేక ప్రియుడైన శివుడి పార్థివ లింగాన్ని మహాన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకంతో, నమక చమకాలతో, పురుష సూక్తంతో పూజిస్తారు. మొదటి జాములో పాలతో, రెండో జాములో పెరుగుతో, మూడో జాములో నెయ్యితో, నాలుగో జాములో తేనెతో అభిషేకిస్తారు. పరమశివునికి అత్యంత ప్రీతికరమైన బిల్వ పత్రాలతో శివార్చన చేసి, రుద్రాక్షమాలతో 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ శివపురాణ పారాయణ చేస్తారు.

– చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ,
ఆధ్యాత్మికవేత్త.



నిశాంత్ ముందుకు... శివ, అంకుశిత ఓటమి

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల విభాగంలో నిశాంత్ దేవ్ (71 కేజీలు) రెండో రౌండ్‌కు చేరగా... శివ థాపా (63.5 కేజీలు), మహిళల విభాగంలో అంకుశిత (66 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడారు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో నిశాంత్ 3–1తో లూయిస్ రిచర్డ్‌సన్ (బ్రిటన్)పై గెలిచాడు. ప్రపంచ చాంపియన్ రుస్లాన్ (ఉజ్బెకిస్తాన్) పంచ్‌ల ధాటికి శివ బౌట్ ఆరంభం లోనే చేతులెత్తేశాడు. అంకుశిత 2–3తో సాన్‌వికో ఎమిలీ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్



ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. కాలిఫోర్నియాలో బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌లో సుమిత్ 6-2, 2-6, 6-7 (4/7)తో సియోంగ్‌చన్ హాంగ్ (కొరియా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 21 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక టైబ్రేక్‌లో సుమిత్ తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. సుమిత్‌కు 14,400 డాలర్ల (రూ. 11 లక్షల 93 వేలు) ప్రైజ్‌మనీ, 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

గట్టెక్కిన సింధు

ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ • ప్రణయ్ ఓటమి



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 80 నిమిషాల్లో 20–22, 22–20, 21–19తో మిచెల్లి లీ (కెనడా)పై కష్టపడి గెలిచింది. తొలి గేమ్ కోల్పోయి, రెండో గేమ్‌లో 7–14తో వెనుకబడిన సింధు నెమ్మదిగా పుంజుకుంది. స్కోరు 15–18 వద్ద సింధు వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 20–18తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్కోరు 20–20తో సమమైనా... కీలకదశలో సింధు రాణించి రెండు పాయింట్లు నెగ్గి 22–20తో గేమ్‌ను దక్కించుకుంది. నిర్ణాయక మూడో గేమ్ కూడా హోరాహోరీగా సాగినా కీలక తరుణంలో సింధు పైచేయి సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21–15, 20–22, 21–8తో చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... ప్రణయ్ 17–21, 17–21తో లు గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓటమి చవిచూశాడు.

రాజా రిత్విక్‌కు కాంస్యం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం సాధించాడు. నాసిక్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత రిత్విక్ 8.5 పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాడు.



అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... ఆరోణ్యక్ ఘోష్ (రైల్వేస్)కు రెండో ర్యాంక్, రిత్విక్‌కు మూడో ర్యాంక్ దక్కాయి. 9 పాయింట్లతో దీప్తాయన్ ఘోష్ (రైల్వేస్) విజేతగా నిలిచాడు. రిత్విక్ ఆడిన 11 గేముల్లో ఏడింటిలో గెలిచి, మూడింటిని 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. కాంస్యం నెగ్గిన రిత్విక్‌ను తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ అభినందించారు. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్తీక్ వెంకటరామన్, నూతక్కి ప్రియాంక 13వ, 14వ ర్యాంక్‌ల్లో నిలిచారు.

4-1 వేటలో...

ఘనమైన ముగింపుపై భారత్ దృష్టి

నేటి నుంచి ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు | ఉదయం గం.9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం



ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ | భారత్ కెప్టెన్ రోహిత్

భారత జట్టు హైదరాబాద్‌లో తొలి టెస్టును కోల్పోయిన తీరు చూస్తే నాలుగో టెస్టు ముగిసే సరికి మన జట్టు సిరీస్ గెలుచుకోగలదని ఎవరూ ఊహించలేదు. తర్వాతి మూడు టెస్టుల్లోనూ ఇంగ్లండ్ మెరుగ్గానే ఆడినా, వెనుకబడిన ప్రతీసారి కోలుకుంటూ టీమిండియా వరుస విజయాలు అందుకుంది. ఇప్పుడు సిరీస్ సొంతం కావడంతో చివరి మ్యాచ్‌నూ గెలిచి ఘనంగా ముగించాలని రోహిత్ బృందం భావిస్తుండగా... సిరీస్ ఓడినా మరో మ్యాచ్ గెలిచి అంతరాన్ని 2–3కు తగ్గిస్తూ స్వదేశం వెళ్లాలని స్టోక్స్ జట్టు పట్టుదలగా ఉంది.

ధర్మశాల: భారత గడ్డపై ఇంగ్లండ్ ఆడిన గత రెండు టెస్టు సిరీస్‌లను టీమిండియా 4-0తో, 3-1తో గెలుచుకుంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే 3-1తో పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టుకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఆఖరి సమరంలో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న భారత్ సిరీస్‌ను 4–1తో ముగిస్తుందా లేక తాము నమ్ముకున్న 'బజ్‌బాల్'తో ఇంగ్లండ్ రెండో విజయాన్ని అందుకుంటుందా అనేది ఆసక్తికరం.

బుమ్రా వచ్చేశాడు

సిరీస్ గెలుచుకున్న ఉత్సాహంతో భారత శిబిరంలో ప్రస్తుతం ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఆటగాళ్లంతా మరోసారి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓపెనర్లు రోహిత్, యశస్వి‌లతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. సిరీస్‌లో ఇప్పటికే 655 పరుగులు చేసిన యశస్వి జైస్వాల్‌ను నిలువరించడం ఇంగ్లండ్ వల్ల కావడం లేదు. ఒక్క రజత్ పటిదార్ మాత్రమే ఇప్పటి వరకు విఫలమయ్యాడు. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి 63 పరుగులే చేసినా... అతనికి మరో మ్యాచ్‌లో అవకాశం దక్కుతోంది. గత టెస్టులో విఫలమైన సర్ఫరాజ్ ఈసారి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. కీపర్ ధ్రువ్ జురేల్ రాంచీ టెస్టుతోనే తానేంటో చూపించగా... జడేజా, అశ్విన్ ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా తన 100వ టెస్టు ఆడనున్న అశ్విన్ ఈ మ్యాచ్‌ను మరింత ప్రత్యేకంగా మార్చుకోవాలని భావిస్తున్నాడు. నాలుగో టెస్టుకు దూరంగా ఉన్న బుమ్రా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతుండటంతో మన పేస్ మరింత పటిష్టంగా మారింది. సిరాజ్‌తో పాటు గత మ్యాచ్‌లో రాణించిన ఆకాశ్‌దీప్‌కు మూడో పేసర్‌గా అవకాశం ఇస్తారా లేక మూడో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను ఎంచుకుంటారా అనేది మ్యాచ్ రోజే తేలుతుంది.

రాబిన్సన్ స్థానంలో వుడ్

ఇంగ్లండ్ తుది జట్టులో ఒకే ఒక మార్పు చోటు చేసుకుంది. బౌలింగ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోవడంతో పాటు వెన్నునొప్పితో ఇబ్బంది పడుతున్న రాబిన్సన్ స్థానంలో మార్క్ వుడ్‌కు ఇంగ్లండ్ చోటు కల్పించింది. తన 187వ టెస్టు బరిలోకి దిగేందుకు సిద్ధమైన సీనియర్ అండర్సన్ 700 వికెట్ల మైలురాయికి మరో రెండు వికెట్ల దూరంలో మాత్రమే ఉన్నాడు. పరిస్థితులు ఎలా ఉన్నా ఇంగ్లండ్ ఇద్దరు స్పిన్నర్లు హార్ట్‌లీ, బషీర్‌లను ఎంచుకుంది. అయితే బ్యాటింగే ఆ జట్టును ఇబ్బంది పెడుతోంది. ప్రతీ ఒక్కరు సిరీస్‌లో ఒక్కో సమయంలో రాణించినా సమష్టిగా ఆడకపోవడం వరుస ఓటములకు కారణమైంది. ఓపెనర్లు క్రాలీ, బెన్ డకెట్‌లతో పాటు పోప్ రాణించాల్సి ఉంది. జో రూట్ ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం కాగా కెప్టెన్ బెన్ స్టోక్స్ తన స్థాయికి తగినట్లుగా ఒక్క ఇన్నింగ్స్ కూడా ఆడలేదు. సిరీస్‌లో ఇప్పటి వరకు విఫలమవుతూనే ఉన్న బెయిర్‌స్టో తన 100వ టెస్టులోనైనా ఆకట్టుకుంటాడా లేదా వేచి చూడాలి.

1 ధర్మశాల స్టేడియంలో ఇప్పటి వరకు ఒకే ఒక టెస్టు జరిగింది. 2017లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో గెలిచింది.

పిచ్, వాతావరణం

ధర్మశాలలో చల్లటి వాతావరణం, పిచ్ సీమ్ బౌలింగ్‌కు అనుకూలంగా కనిపిస్తున్నాయి. అయితే దాని ప్రభావం కొద్ది సేపే ఉండవచ్చు. పచ్చిక దాదాపుగా తొలగించడంతో బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా కనిపిస్తోంది.

గుజరాత్ బోణీ

అదరగొట్టిన బెత్ మూనీ, లౌరా



బెత్ మూనీ



లౌరా

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఎట్టకేలకు గుజరాత్ జెయింట్స్ జట్టు ఖాతాలో తొలి విజయం చేరింది. వరుసగా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన గుజరాత్ ఐదో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 19 పరుగుల తేడాతో నెగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు సాధించింది. ఓపెనర్లు లౌరా వొల్వార్ట్ (45 బంతుల్లో 76; 13 ఫోర్లు), కెప్టెన్ బెత్ మూనీ (51 బంతుల్లో 86 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 13 ఓవర్లలో 140 పరుగులు జోడించారు. లౌరా అవుటయ్యాక వచ్చిన ఫోబీ లిచ్‌ఫీల్డ్ (18; 1 ఫోర్), యాష్లీ గార్డ్‌నర్ (0), హేమలత (1), వేద కృష్ణమూర్తి (1) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అనంతరం 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓడిపోయింది. స్మృతి మంధాన (24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎలీస్ పెరీ (24; 3 ఫోర్లు), సోఫీ డివైన్ (23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రిచా ఘోష్ (30; 5 ఫోర్లు, 1 సిక్స్), జార్జియా వేర్‌హామ్ (48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

ఫైనల్లో విదర్భ

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో రెండు సార్లు చాంపియన్ విదర్భ జట్టు మూడోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మధ్యప్రదేశ్‌తో బుధవారం ముగిసిన రెండో సెమీఫైనల్లో విదర్భ 62 పరుగుల తేడాతో విజయం సాధించింది. 321 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 81.3 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఈనెల 10 నుంచి జరిగే ఫైనల్లో ముంబైతో విదర్భ తలపడుతుంది. ఓవర్‌నైట్ స్కోరు 228/6తో మ్యాచ్ చివరిరోజు బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ మరో 30 పరుగులు జోడించి మిగతా 3 వికెట్లు కోల్పోయింది.

సహజ శుభారంభం

నాగ్‌పూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సహజ 3-6, 6-1, 6-1తో భారత్‌కే చెందిన వైదేహి చౌదరీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

న్యూజిలాండ్‌తో భారత్ తొలి పోరు



లుసానె (స్విట్జర్లాండ్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీ ఈవెంట్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. పూల్ 'బి'లో ఉన్న భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను జూలై 27న న్యూజిలాండ్‌తో ఆడుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 9 గంటలకు మొదలవుతుంది. గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత జట్టు తమ రెండో మ్యాచ్‌ను జూలై 29న అర్జెంటీనాతో (సాయంత్రం గం. 4:15 నుంచి)... మూడో మ్యాచ్‌ను జూలై 30న ఐర్లాండ్‌తో (సాయంత్రం గం. 4:45 నుంచి)... నాలుగో మ్యాచ్‌ను ఆగస్టు 1న బెల్జియంతో (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)... ఐదో మ్యాచ్‌ను ఆగస్టు 2న ఆస్ట్రేలియాతో (సాయంత్రం గం. 4:45 నుంచి) ఆడుతుంది.

సినిమా

ఓ హీరో చెల్లెళ్లు, ప్రేయసితో కలిసి ఆడి పాడుతున్నారు. మరో హీరో ఏమో హీరోయిన్‌తో ప్రేమ పాటకు స్టెప్పులేస్తున్నారు. ఇంకో హీరో మాస్ నంబర్‌కు హుషారుగా కాలు కదుపుతున్నారు. 'ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్' అంటూ ఆ హీరోలు చేస్తున్న పాటల గురించి తెలుసుకుందాం.

డ్యాన్సింగ్ టైమ్



• చిరంజీవి



• ప్రభాస్



• అల్లు అర్జున్

ఫ్యామిలీ సాంగ్

ఆనందోత్సాహలతో ఫ్యామిలీ పాట పాడుతున్నాడట 'విశ్వంభర'. చెల్లెళ్లు, ప్రేయసితో కలిసి హాయిగా డ్యాన్స్ చేస్తున్నాడట. ఈ ఫ్యామిలీ సెలబ్రేషన్ సాంగ్‌కు కారణమైన హ్యాపీ మూమెంట్స్ ఏంటో 'విశ్వంభర' సినిమాలో చూడాలి. చిరంజీవి హీరోగా నటిస్తున్న చిత్రం ఇది. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. 'స్టాలిన్' తర్వాత అంటే దాదాపు 18 ఏళ్ల తర్వాత 'విశ్వంభర' కోసం చిరంజీవితో జోడీ కట్టారు త్రిష. ఈ సినిమాలో చిరంజీవి పాత్ర భీమవరం దొరబాబు అని, కథ రీత్యా దొరబాబుకు ఐదుగురు చెల్లెళ్లు ఉంటారనే ప్రచారం సాగుతోంది. చిరంజీవి చెల్లెళ్లుగా మీనాక్షీ చౌదరి, మృణాల్ ఠాకూర్, ఆషికా రంగనాథ్, ఇషా చావ్లా, సురభి కనిపిస్తారని భోగట్టా. కాగా 'విశ్వంభర' తాజా షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముందుగా కొంత టాకీ పార్ట్ చిత్రీకరించారు. ఇటీవల ఫ్యామిలీ సాంగ్ చిత్రీకరణ ఆరంభించారని తెలిసింది. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ అడ్వెంచరస్ ఫ్యాంటసీ ఫిల్మ్ వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు ఎమ్‌ఎమ్ కీరవాణి స్వరకర్త. ఈ సంగతి ఇలా ఉంచితే... 'హిట్లర్' (1997) సినిమాలో హీరో చిరంజీవికి ఐదుగురు చెల్లెళ్లు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇన్నేళ్లకు చిరంజీవి మళ్లీ ఐదుగురు చెల్లెళ్లతో 'విశ్వంభర' చేస్తున్నారు.

రొమాంటిక్ కల్కి


ఇటలీ బీచ్‌లో ప్రేమ పాట పాడుతున్నారు ప్రభాస్. ఈ రొమాంటిక్ పాట 'కల్కి 2898 ఏడీ' సినిమా కోసం. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న మైథాలజీ అండ్ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఇది. ఇందులో దీపికా పదుకోన్, దిశా పటానీ హీరోయిన్లుగా నటిస్తుండగా, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలక పాత్రధారులు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ ఇటలీలో ప్రారంభమైంది. ప్రభాస్, దిశా పటానీల మధ్య కొన్ని రొమాంటిక్ సీన్స్‌తో పాటు ఓ మెలొడీ లవ్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ షెడ్యూల్‌తో 'కల్కి 2898ఏడీ' సినిమా మేజర్ చిత్రీకరణ పూర్తవుతుందని తెలిసింది. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది.

పుష్పరాజ్ పాట

మంచి ఫైర్ మీద ఉన్నాడు పుష్పరాజ్. తన సత్తా ఏంటో పాట రూపంలో మరోసారి చెబుతున్నాడు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లోని 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలో 'ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా' అంటూ ఓ మాస్ సాంగ్ ఉంటుంది. ఈ తరహా సాంగ్ 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'లోనూ ఉందట. ప్రస్తుతం ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో చిత్రీకరిస్తున్నారని తెలిసింది. ఈ పాటకు ప్రేమ్‌రక్షిత్ కొరియోగ్రఫీ చేస్తున్నారట. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. తొలి భాగంలో శ్రీవల్లి పాత్రలో ప్రేయసిగా నటించిన హీరోయిన్ రష్మికా మందన్నా మలి భాగంలో భార్యగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ఇలా ప్రస్తుతం సెట్స్‌లో పాటల చిత్రీకరణ జరుపుకుంటున్న మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

ట్రిపుల్ ధమాకా



• శర్వానంద్

హీరో శర్వానంద్ బర్త్ డే (మార్చి 6) సందర్భంగా మూడు చిత్రాల అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రానికి 'మనమే' అనే టైటిల్ ఖరారు చేయగా, 36వ సినిమా బుధవారం ప్రారంభమైంది. అలాగే శర్వా నటించనున్న 37వ సినిమా ప్రకటన కూడా వెల్లడైంది. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రానికి 'మనమే' టైటిల్ ఖరారు చేసి, గ్లింప్స్ విడుదల చేశారు. అలాగే శర్వానంద్ 36వ సినిమా ఆరంభమైంది. అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్. విక్రమ్ సమర్పణలో వంశీ-ప్రమోద్ నిర్మిస్తున్నారు. శర్వా 37వ సినిమాని రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఇక శర్వానంద్ వ్యక్తిగత జీవితం విషయానికొస్తే గత ఏడాది రక్షితను వివాహం చేసుకున్నారు. ఇటీవల పాపకు జన్మనిచ్చారు రక్షిత. పాపకు లీలాదేవి అని నామకరణం చేసినట్లు బుధవారం వెల్లడించారు.

నవ్వితే చాలు.. బాలకృష్ణకు కోపం వస్తుంది

- దర్శకుడు కేఎస్ రవికుమార్

"తెలుగులో బాలకృష్ణతో సినిమాలు చేశాను. ఎవరైనా బాలకృష్ణని చూసి నవ్వితే చాలు. ఆయనకు చాలా కోపం వచ్చేస్తుంది" అంటూ చెన్నైలో జరిగిన తమిళ చిత్రం 'గార్డియన్' ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు కేఎస్ రవికుమార్ అనడం వైరల్‌గా మారింది. బాలకృష్ణతో వరుసగా 'జైసింహా' (2018), 'రూలర్' (2019) చిత్రాలకు దర్శకత్వం వహించారు కేఎస్ రవికుమార్. ఆ చిత్రాల షూటింగ్ లొకేషన్‌లో జరిగిన సంఘటనలనే 'గార్డియన్' వేదికపై పంచుకున్నట్లున్నారు. ఇంకా ఆ ప్రీ రిలీజ్ వేడుకలో మాట్లాడుతూ– "ఒకరోజు లొకేషన్‌లో ఒక వ్యక్తి నవ్వితే.. 'ఎందుకు నవ్వుతున్నావ్... రేయ్ ఎందుకురా నవ్వావ్.. నన్ను చూసి ఎందుకు నవ్వావ్' అని బాలకృష్ణ కొట్టడానికి ముందుకు వెళ్లినట్లుగా చేతులతో చూపించారు కేఎస్ రవికుమార్. ఇంకా మాట్లాడుతూ– "ఇంకోసారి నా అసిస్టెంట్‌ని 'ఆ ఫ్యాన్‌ని ఇలా తిప్పు' అంటే.. అతను ఫ్యాన్ తిప్పాడు. ఆ గాలికి బాలకృష్ణ విగ్ కాస్త చెదిరినట్లయితే అతను నవ్వాడు. 'ఏయ్ ఎందుకు నవ్వుతున్నావ్' అని బాలకృష్ణ అడుగుతుంటే అసలే తను నా అసిస్టెంట్.. ఎక్కడ కొట్టేస్తారేమోనని, 'సార్ సార్.. అతను మన అసిస్టెంట్ డైరెక్టర్ శరవణన్ సార్..' అన్నాను. 'లేదు లేదు.. ఆపోజిట్ గ్యాంగ్.. ఆపోజిట్ గ్యాంగ్.. చూడు ఇప్పుడు కూడా నవ్వుతున్నాడు' అని ఆయన అన్నారు. ఇక అప్పుడు 'రేయ్.. వెళ్లరా ఇక్కణ్ణుంచి' అని అతన్ని పంపించేశాను" అని కూడా చెప్పారు రవికుమార్.

రామ్‌చరణ్‌కి జోడీగా..



• 'దేవర'లో జాన్వీ

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ ఫిక్స్ అయ్యారు. బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. బుధవారం (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కి జంటగా జాన్వీ కపూర్ నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. "ఆర్‌సీ 16' కోసం బుచ్చిబాబు యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు" అన్నారు మేకర్స్. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ 'దేవర' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ, కల్యాణ్ రామ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు.

ఎమోషన్.. ఎలివేషన్.. ఎంటర్‌టైన్‌మెంట్



• హర్ష

"సినిమాలో ఏ మాత్రం ల్యాగ్ ఉన్నా సరే థియేటర్స్‌లో ఆడియన్స్ మొబైల్ ఫోన్స్ చూస్తున్నారు. సో... ఆడియన్స్‌ను ఎంగేజ్ చేయాలంటే మంచి స్క్రీన్ ప్లే ఉండాలి. 'భీమా'లో గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే ఉంది. ఎలివేషన్.. ఎమోషన్.. ఎంటర్‌టైన్‌మెంట్‌లతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో 'భీమా' చిత్రంలో ఓ సామాజిక సందేశం కూడా ఉంది" అన్నారు దర్శకుడు ఎ. హర్ష. గోపీచంద్ హీరోగా ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'భీమా'. ఈ నెల 8న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో ఎ.హర్ష మాట్లాడుతూ– "కరోనా సెకండ్ వేవ్ సమయంలో 'భీమా' చిత్రం సహనిర్మాత శ్రీధర్‌గారు ఓ కథ ఉంటే చెప్పమన్నారు. ఆన్‌లైన్‌లో గోపీచంద్‌గారికి 'భీమా' స్టోరీలైన్ చెప్పాను. ఆ తర్వాత ఫుల్ స్టోరీ చెప్పాను. ఆయనకు నచ్చింది. చిన్న మార్పులు సూచించారు. ఆ తర్వాత సెట్స్‌పైకి వెళ్లాం. గోపీచంద్‌గారు అద్భుతమైన నటుడు. ఆయన చేసిన 'భీమా' పాత్రను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. రాధామోహన్‌గారు నిర్మించిన 'బెంగాల్ టైగర్'కు కొరియోగ్రాఫర్‌గా చేశాను. ఇప్పుడు ఆయన నిర్మించిన సినిమాకు దర్శకత్వం వహించడం హ్యాపీ" అన్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్

విజయ్ శంకర్, మహేశ్ యడ్లపల్లి, ఆయూషి పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో 'విశాలాక్షి' మూవీ ఆరంభమైంది. పవన్ శంకర్ దర్శకత్వంలో కేతిక హన్మయశ్రీ సమర్పణలో పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ దర్శకత్వం వహించారు. "పరిశోధన నేపథ్యంలో సాగే యాక్షన్ మూవీ ఇది" అన్నారు పవన్ శంకర్. "స్టింగ్ ఆపరేషన్, ఇన్వెస్టిగేషన్, ఎమోషనల్ అంశాలతో ఈ మూవీ సాగుతుంది" అన్నారు పల్లపు ఉదయ్ కుమార్.



• అనుశ్రీ, మహేశ్, విజయ్, ఆయుషి

బుల్లెట్ వస్తోంది



• రవి వర్మ, ఏయం రత్నం

రవి వర్మ, సంజనా సింగ్, అలోక్ జైన్, మనీషా దేవ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. బండి సదానంద్- మెమరీ మేకర్స్ సోమిశెట్టి హరికృష్ణ సమర్పణలో ఎంసీ రావు, జి.గోపాల్, ఎమ్.వ. మల్లిఖార్జునరావు, కోసూరి సుబ్రహ్మణ్యం, మణి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'బుల్లెట్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాత ఏయం రత్నం, దర్శకుడు వి. సముద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "ఈ సినిమా విజయం సాధించి టీమ్‌కి మంచి పేరు తీసుకురావాలి" అన్నారు ఏయం రత్నం, వి.సముద్ర. "ఇదొక యాక్షన్ మూవీ" అన్నారు చౌడప్ప. "హీరోగా అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు" అన్నారు రవి వర్మ.

వేసవిలో ధూం ధాం



• చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

హెబ్బా పటేల్, చేతన్ కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికుమార్, 'వెన్నెల' కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి కిశోర్ మచ్చ దర్శకత్వంలో ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. పెళ్లి బారాత్‌లో హీరో, హీరోయిన్ జోరుగా డ్యాన్స్ చేస్తున్న 'ధూం ధాం' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. "లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు సాయి కిశోర్. ఈ మూవీకి గోపీ మోహన్ కథ, స్క్రీన్ ప్లే అందించారు. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నాం" అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
409	118
74,086	22,474

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,217	▲	188
డోజోన్స్	38,811	▲	225
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	▲	33
డాక్స్	17,717	▲	18
షాంఘై	3,040	▼	8
నికాయ్	40,091	▼	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	64,493	▼	105
బంగారం (99.5 స్వచ్ఛత)	64,339	▼	104
వెండి (కిలో)	72,244	▼	534

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫారెక్స్	80.99	84.67
£	బ్రిటన్ పౌండ్	ఫారెక్స్	102.95	107.86
€	యూరో	ఫారెక్స్	87.87	92.33
¥	జపాన్ ఎన్ (100)	ఫారెక్స్	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఫారెక్స్	54.64	56.48
S$	సింగపూర్ డాలర్	ఫారెక్స్	59.44	64.12
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.18	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.65	23.45
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.38	12.46

బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్రకటనలకు దూరంగా ఉండండి

సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు సీసీపీఏ సూచన



న్యూఢిల్లీ: బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సంబంధిత ప్రకటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో అటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను ప్రమోట్ చేయడానికి దూరంగా ఉండాలని సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ సంస్థ సీసీపీఏ సూచించింది. అలాంటి కార్యకలాపాలను ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు అడ్వైజరీని జారీ చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల ప్రకటనలు, ప్రమోషన్ మొదలైనవి వివిధ చట్టాల కింద నిషిద్ధమని సీసీపీఏ పేర్కొంది. 'పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ 1867 ప్రకారం బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై నిషేధం ఉంది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వీటిని చట్టవిరుద్ధంగా పరిగణిస్తారు. అయినప్పటికీ గేమింగ్ ముసుగులో పలు ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, యాప్‌లు నేరుగా బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్రకటనలు ఇస్తున్నాయి' అని సీసీపీఏ తెలిపింది. ఇలాంటి కార్యకలాపాలను బలపర్చడమనేది ఆర్థికంగా, సామాజికంగా, ముఖ్యంగా యువతపై, తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపుతుందని పేర్కొంది. వాటికి సంబంధించిన మార్గదర్శకాలు అన్ని మాధ్యమాలకు వర్తిస్తాయని సీసీపీఏ తెలిపింది. చట్టవిరుద్ధమైన వాటిని ఏ రకంగా ప్రమోట్ చేసినా ఆయా కార్యకలాపాల్లో పాల్గొన్న వారితో సమానంగా చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లను హెచ్చరించింది.

రుణ జారీలో లోపాలు లేవు

జేఎం ఫైనాన్షియల్ వివరణ

న్యూఢిల్లీ: అప్రమత్తతతో కూలంకషంగా చేపట్టిన సమీక్ష ప్రకారం రుణ విడుదల విధానంలో లోపాలు కనిపించలేదని జేఎం ఫైనాన్షియల్ తాజాగా పేర్కొంది. కంపెనీ ఫైనాన్సింగ్ బిజినెస్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో తాజా వివరణకు తెరతీసింది. షేర్లు, డిబెంచర్లపై రుణాలు జారీ చేయవద్దంటూ ఆర్‌బీఐ మంగళవారం జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌పై నిషేధాన్ని విధించిన నేపథ్యంలో కంపెనీ వివరణకు ప్రాధాన్యత ఏర్పడింది. కొంతమంది కస్టమర్ల గ్రూప్ కంపెనీ విడుదల చేసిన రుణ నిధులతో వివిధ పబ్లిక్ ఇష్యూలకు బిడ్ చేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా రుణాలు ఇవ్వడంతో కొన్ని తీవ్ర లోటుపాట్లు గుర్తించి ఆర్‌బీఐ ఆంక్షలు విధించడంతో ఈ షేరు బుధవారం 11% నష్టపోయి రూ.85 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.76.43 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.979 కోట్లు హరించుకుపోయి రూ.8,149 కోట్లకు దిగివచ్చింది.

అన్‌స్టాపబుల్స్

- సెన్సెక్స్ @ 74,000
- 22,450 స్థాయి పైకి నిఫ్టీ
- సరికొత్త శిఖరాలపై సూచీలు
- ఇంట్రాడే, ముగింపుల్లోనూ చరిత్రాత్మక స్థాయిల నమోదు




ముంబై: ఇంట్రాడే నష్టాలు భర్తీ చేసుకొన్న స్టాక్ సూచీలు బుధవారం సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఐటీ, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ తొలిసారి 74,000 పాయింట్ల ఎగువన, నిఫ్టీ 22,450 స్థాయిపై ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకొన్న సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చింది. మిడ్ సెషన్ నుంచి లార్జ్ క్యాప్ షేర్లలో వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 474 పాయింట్లు బలపడి 74,151 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు పెరిగి 22,497 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. చివరికి దాదాపు ఇంట్రాడే గరిష్టం వద్ద ట్రేడింగ్ ముగించాయి. సెన్సెక్స్ 409 పాయింట్ల లాభంతో 74,086 వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు పెరిగి 22,474 వద్ద స్థిరపడ్డాయి. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు కావడం విశేషం.

– పర్యవేక్షణ లోపాల కారణంగా పసిడి రుణాలు ఇవ్వకూడదంటూ ఆర్‌బీఐ నిషేధం విధించడంతో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ షేరు రెండోరోజూ మరో 20% క్షీణించింది. ఏడాది కనిష్ట స్థాయి రూ.383 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. గత రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.8,396 కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.14,603 కోట్లకు దిగివచ్చింది.

2031 నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

- అప్పటికి 7 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భావం
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనా 6.8 శాతం
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2024–25) 6.8 శాతంగా క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అలాగే 2031 నాటికి దేశం ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థాయికి రెట్టింపై దాదాపు 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని.. తద్వారా ఎగువ మధ్య–ఆదాయ దేశంగా మారుతుందని క్రిసిల్ ఇండియా అవుట్‌లుక్ నివేదిక పేర్కొంది. నిర్మాణాత్మక సంస్కరణలు తదితర సానుకూల ఆర్థిక నిర్ణయాల వల్ల దేశ ఎకానమీ 2030 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని తెలిపింది. రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2024–25 నుంచి 2030–31) భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల స్థాయిని దాటి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని పేర్కొంది. ఈ కాలంలో ఎకానమీ సగటును 6.7 శాతం పురోగమిస్తుందని అభిప్రాయపడింది.

ప్రస్తుతం ఐదవ స్థానంలో..

25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావు శాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. కాగా, 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, త్వరలో జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత దేశ ఎకానమీ విలువ 3.6 ట్రిలియన్ డాలర్లు.

4,500 డాలర్లకు తలసరి ఆదాయం..

2031 ఆర్థిక సంవత్సరం భారత్ తలసరి ఆదాయం 4,500 డాలర్లకు పెరుగుతుంది. దీనితో దేశం ఎగువ మధ్య–ఆదాయ దేశాల క్లబ్‌లో ప్రవేశిస్తుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక సూత్రాల ప్రకారం... తలసరి ఆదాయం 1,036 డాలర్ల నుంచి 4,045 డాలర్ల మధ్య ఉన్న దేశాన్ని దిగువ మధ్య తరగతి ఆదాయ దేశంగా పరిగణిస్తారు. 4046 డాలర్ల నుంచి 12,535 డాలర్ల మధ్య ఆదాయ దేశాలను ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాలుగా పేర్కొంటారు. 12,000 డాలర్ల తలసరి ఆదాయం దాటితే అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది.

తయారీ, సేవల రంగాల్లో మంచి అవకాశాలు...



దేశీయ, ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా తయారీ– సేవల రంగాలు రెండింటికీ పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. 2025–2031 ఆర్థిక సంవత్సరాల మధ్య తయారీ–సేవల రంగాలు వరుసగా 9.1 శాతం, 6.9 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని మేము అంచనా వేస్తున్నాము. తయారీ రంగం ద్వారా కొంత పెరుగుదల ఉన్నప్పటికీ, సేవా రంగం భారతదేశ వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుంది.

– ధర్మకీర్తి జోషి, క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

7-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
6-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469–00
వరంగల్	471–00
రిటైల్ ధర	5.30

ఎయిర్‌టెల్ కొత్త స్టోర్ల ప్రారంభం

హైదరాబాద్: భారతీ ఎయిర్‌టెల్ హైదరాబాద్‌లో ఒకేసారి 18 కొత్త స్టోర్లను ప్రారంభించింది. అలాగే విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ఒక్కొక్కటి చొప్పున నూతన స్టోర్లను ప్రారంభించడంతో విజయవాడలో స్టోర్ల సంఖ్య 14కి, విశాఖలో పదికి చేరుకున్నాయి. ఈ స్టోర్లలో కంపెనీకి సంబంధించిన అన్ని రకాల సేవలను పొందవచ్చని భారతీ ఎయిర్‌టెల్ ఏపీ–తెలంగాణ సీఈవో శివన్ భార్గవ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌టెల్ 1,500 స్టోర్లలో సేవలు అందిస్తోంది.

అధిక రేటింగ్ కంపెనీ బోర్డుల్లో మహిళలు

బోర్డు సభ్యులుగా చోటు ● మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ వెల్లడి



న్యూఢిల్లీ: అధిక రేటింగ్ కలిగిన కంపెనీలు.. బోర్డు సభ్యులుగా మహిళలను ఎంపిక చేసుకుంటున్నట్లు రేటింగ్ దిగ్గజం మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తాజాగా పేర్కొంది. తక్కువస్థాయి రేటింగ్ కలిగిన కంపెనీలతో పోలిస్తే వీటిలో బోర్డు సభ్యులుగా స్త్రీలకు అధికంగా చోటు కల్పిస్తున్నట్లు తెలియజేసింది. సంస్థ రేటింగ్ ఇచ్చిన 3,138 కంపెనీలను విశ్లేషించినట్లు వెల్లడించింది. విశ్లేషణ ప్రకారం ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్(బీఏఏ, అంతకంటే అధిక రేటింగ్) కలిగిన కంపెనీల బోర్డు సీట్లలో సగటున 29 శాతం మంది మహిళలకు చోటు లభించింది. 2023తో పోలిస్తే 1 శాతం పెరిగినట్లు వెల్లడించింది. ఇక స్పెక్యులేటివ్ గ్రేడ్(బీఏ, అంతకంటే తక్కువ రేటింగ్) కంపెనీలలో సగటున 24 % బోర్డు సీట్లను మహిళలు పొందారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య యథాతథమే. అభివృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థల్లో బోర్డు సభ్యుల లింగభేదం, క్రెడిట్ రేటింగ్స్ మధ్య పరస్పర సంబంధమున్నప్పటికీ వర్ధమాన మార్కెట్లలో ఇది లేనట్లు మూడీస్ పేర్కొంది. విశ్లేషణకు పరిగణనలోకి తీసుకున్న కంపెనీలలో 24 ఏఏఏ, 146 ఏఏ, 728 ఏ, 1165 బీఏఏ, 582 బీఏ, 394 బీ, 90 సీఏఏ, 9 సీఏ రేటింగ్ కలిగినవి ఉన్నట్లు వెల్లడించింది.

సంవర్ధనలో సుమిటోమో వాటాల విక్రయం

న్యూఢిల్లీ: సంవర్ధన మదర్సన్‌లో జపాన్‌కి చెందిన సుమిటోమో వైరింగ్ సిస్టమ్స్ (ఎస్‌డబ్ల్యూఎస్) 4.4 శాతం వాటాలను రూ. 3,633 కోట్లకు విక్రయించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) డేటా ప్రకారం రూ. 121.03–121.25 ధర శ్రేణిలో సుమిటోమో మొత్తం 30 కోట్ల షేర్లను విక్రయించింది. వాటాల విక్రయంతో సంస్థలో ఎస్‌డబ్ల్యూఎస్ వాటా 14.15 శాతం నుంచి 9.72 శాతానికి తగ్గింది.

ఎఫ్‌ఆర్‌వో పోస్టులకు నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: అటవీ శాఖలో ఖాళీగా ఉన్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 37 పోస్టులకు ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం తెలిపారు. దీంతోపాటు అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్లు ఇచ్చామని, దరఖాస్తు ప్రక్రియ, ఇతర వివరాలకు https:// psc.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

అనంతపురం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఐసెట్–2024కు దరఖాస్తుల స్వీకరణ బుధవారం ప్రారంభమైనట్లు ఏపీ ఐసెట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.హుస్సేన్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ పి.మురళీ కృష్ణ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 110 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఏప్రిల్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 6న ఐసెట్ నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలుhttps://cets.apsche.ap.gov.inలో పొందుపరిచామని, సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్ నంబరు 9000977657కు ఫోన్ చేయాలని సూచించారు.

సీఎం జగన్ చెప్పేవన్నీ అబద్ధాలే: మాజీ మంత్రి గంటా



ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): రూ.500 కోట్లతో క్యాంప్ కార్యాలయం, 17 హెలిప్యాడ్ల నిర్మాణం తప్ప విశాఖకు సీఎం జగన్ చేసింది ఏమీ లేదని ఆరోపించారు. విశాఖలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు అన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటన్నారు. విశాఖలోని ఆయన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఒక్కసీటు కూడా గెలవలేదన్నారు. విశాఖలో పారిశ్రామికవేత్తల సమావేశం పెట్టి అన్నీ అసత్యాలే చెప్పారని సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ గెలిచేదీ లేదు.. విశాఖలో జగన్ ప్రమాణ స్వీకారం చేసేదిలేదంటూ ఎద్దేవా చేశారు. తనపై పోటీ చేస్తే గంటా ఓడిపోతారంటూ మంత్రి బొత్స చేసిన వ్యాఖ్యలపై గంటా స్పందిస్తూ.. ఓటమి అనుభవం బొత్సకే ఉందన్నారు. తాను ఇప్పటి వరకు పోటీ చేసిన ఏ ఎన్నికల్లోను ఓడిపోలేదని, తాను ఎక్కడి నుంచి పోటీ చేసేది టీడీపీ అధిష్టానం నిర్ణయించిన వెంటనే మీడియాకి తెలియజేస్తానని చెప్పారు.

క్రీడలపై రామోజీ క్రీనీడ ఎల్లో బ్యాచ్.. దుకాణం బంద్!

ఫ్యాక్ట్ చెక్

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడలకు మహర్దశ

- వైఎస్సార్ నగదు పురస్కారాలతో ఆర్థిక సాయం పెంపు
- దాదాపు రూ.20 కోట్లకుపైగా క్రీడాకారులకు నగదు సాయం
- 2 సాంఘిక, 6 గిరిజన గురుకులాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు
- సీఎం కప్, ఖేలో ఇండియా, జాతీయ పోటీల్లో ఏపీకి పెరుగుతున్న పతకాలు
- ఆడుదాం ఆంధ్రతో గ్రామాల్లో ప్రతిభగల క్రీడాకారులకు ఊతం
- ఎల్లో బ్యాచ్ 'అవినీతి ఖేల్ ఖతం' అవ్వడంతో రామోజీలో ఫ్రస్టేషన్
- ఇదే పరిస్థితి ఉంటే శాశ్వతంగా తమ 'దుకాణం బంద్' అవుతుందనే భయం

సాక్షి, అమరావతి: కురుక్షేత్రంలో అర్జునుడు 'గాండీవం' సహాయంతో అధర్మాన్ని వధిస్తే.. క్రీడాక్షేత్రంలో టీడీపీ అదే గాండీవం పేరుపెట్టి అవినీతికి పురుడుపోసింది. మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామంటూ (టాలెంట్ హంట్) పాఠశాలల్లో క్రీడాపోటీల నిర్వహణ పేరుతో తన అనుయాయులకు రూ.కోట్లు దోచిపెట్టింది. ఏ ఒక్క మైదానంలోనూ క్రీడాకారులు పోటీ పడలేదు. కానీ, వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ మాత్రం వచ్చేశాయి. ఆ వచ్చిన విషయం క్రీడాకారుడికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యం. అప్పట్లో పాఠశాలల నుంచి హాజరు పట్టిక తీసుకొచ్చి విద్యార్థుల పేర్లు గాండీవం ప్రాజెక్టులో రాసేసి ప్రజాధనాన్ని అప్పనంగా మింగేశారు. ఇది.. చంద్రబాబు రాజకీయ వికృతి క్రీడలో.. క్రీడారంగం బలైపోయిందనడానికి చిన్న ఉదాహరణ మాత్రమే. కానీ, ఎల్లో రాతల్లో ఎల్లలు దాటిన రామోజీకి మాత్రం ఇదొక ఉజ్వల కాలంగా కనిపిస్తోంది. పేదింటి బిడ్డల్లో క్రీడా ప్రతిభను వెలికితీస్తామని మోసం చేస్తే 'ఈనాడు' గొప్పగా అభివర్ణిస్తోంది. వాస్తవానికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులతో పాటు రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించిన వారికి వైఎస్సార్ నగదు పురస్కారాలు అందుతున్నాయి. ఆడుదాం ఆంధ్ర వంటి మెగా టోర్నీ ద్వారా క్రీడా ప్రతిభను వెలికితీస్తోంది. సీఎం కప్, శాప్ లీగ్స్, ఖేలో ఇండియా పోటీలకు వెళ్లే వారికి సైతం ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి శిక్షణ అందిస్తోంది. ఫలితంగా పతకాల సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్లో బ్యాచ్ 'అవినీతి ఖేల్ ఖతం' అవ్వడం.. ఇదే కొనసాగితే శాశ్వతంగా తమ 'దుకాణం బంద్' చేసుకోకతప్పదని రామోజీ.. క్రీడల ముసుగులో పైశాచికత్వాన్ని ప్రదర్శించారు.

సామగ్రి దొంగలెత్తుకుపోయారు!

చంద్రబాబు హయాంలో టెన్విక్ పేరుతో ఏపీ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు రూ.కోట్లు వెచ్చించారు. విదేశాల నుంచి కొంత మంది కోచ్‌లను తీసుకొచ్చి తూతూ మంత్రంగా శిక్షణ ఇప్పించారు. ఈ శిక్షణ కాస్తా టీడీపీ ప్రభుత్వంలోనే ముగిసిపోవడం గమనార్హం. కానీ, ఈనాడు ఆపాపాన్ని సైతం ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేసింది. గుంటూరులోని ఏఎన్‌యూలో నడిచిన టెన్విక్ క్యాంపు కోసం రూ.కోట్లు కుమ్మరించి క్రీడా పరికరాలు కొనుగోలు చేశారు. వాటిని సరిగా వినియోగించకుండానే ఒకానొక రాత్రి సమయంలో దొంగలు ఎత్తుకుపోయారు. దీనిపై అప్పట్లో మంగళగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ, ఒక్క వస్తువు కూడా రికవరీ కాలేదు. అసలు నిజంగా దొంగతనం జరిగితే రికవరీ అవుతుంది. ఇందులో అప్పటి ప్రభుత్వ పెద్దల హస్తం ఉంది కాబట్టి కేసులో ఎటువంటి పురోగతి లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ భిన్నవాదనలు కూడా లేపోలేదు. కేవలం పేపర్లపైనే వస్తువులు కొని దొంగతనం డ్రామా ఆడారన్న వాదన ఒకటైతే.. నిజంగా కొనుగోలు చేసిన వస్తువులను దొడ్డిదారిన తిరిగి డీలర్లకు ఇచ్చేసి సొమ్ము చేసుకున్నారన్న వాదన కూడా అప్పట్లో బలంగా వినిపించింది.

టీడీపీ హయాంలో క్రీడలకు మకిలి..

టీడీపీ హయాంలోనే క్రీడా అసోసియేషన్లకు మకిలి పట్టింది. అప్పటి ప్రజా ప్రతినిధులే అసోసియేషన్లలో వర్గపోరుకు బీజం వేశారు. కేంద్రం.. రాష్ట్రాలు విధిగా స్పోర్ట్స్ కోడ్‌ను అమలు చేయాలని ఆదేశించినా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేసింది. స్పోర్ట్స్ కోడ్ అమలులోకి వస్తే దశాబ్దాలుగా అసోసియేషన్ల పదవుల్లో పాతుకు పోయిన వారికి ఉద్వాసన తప్పదని.. అందుకే పట్టీపట్టనట్టు వ్యవహరించారు. పైగా అప్పట్లో అసోసియేషన్లకు జిల్లాలో ఎన్నికలు నిర్వహించకుండానే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఇవ్వడం కూడా వర్గపోరుకు కారణం. దీనికి తోడు ఎప్పటి నుంచో దరఖాస్తు చేసుకుంటున్న వారికి కాకుండా సిఫారసులతో వచ్చిన వారికి గుర్తింపు ఇవ్వడం గమనార్హం. కొన్ని అసోసియేషన్లు టీడీపీ కాలం నుంచి అనాదిగా రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను కాగితాల పైనే ఎంపిక చేసే ఆచారాన్ని కొనసాగిస్తూ ప్రతిభ కలిగిన వారికి తీవ్ర అన్యాయం చేశాయి. కానీ, వైఎస్సార్ సీపీ హయాంలో క్రీడా సంఘాలకు పెద్ద పీట వేసింది. అంతర్‌జిల్లా, జాతీయ పోటీల నిర్వహణకు 18 రాష్ట్ర క్రీడా సంఘాలకు రూ.3.05 కోట్లను మంజూరు చేసింది.



ఎన్నికల ముందు హడావుడిగా..

టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.13.76 కోట్లు అందించినప్పటికీ చిన్న క్రీడాకారులకు మేలు జరగలేదు. క్రీడలను కూడా రాజకీయాలతో చూసే బాబు ఎన్నికలకు ముందు హడావుడిగా 2018–19 లో 115 మందికి రూ.7.75 కోట్లు ఇచ్చారు. అంతకు ముందు ఇచ్చింది రూ.6 కోట్లు వీటిల్లో సింహభాగం అంతర్జాతీయ క్రీడాకారులకు కేటాయించినదే.

శ్మశానాల్లో కేవీకేలా?

అవినీతి పరమావధిగా టీడీపీ నాయకులు క్రీడారంగాన్ని భ్రష్టు పట్టించారు. కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు క్రీడా వికాస కేంద్రాలను తెరపైకి తెచ్చారు. ఊరికి దూరంగా మొండి గోడలతో భవనాలు నిర్మించి బిల్లు చేసుకుని మింగేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ప్రాధాన్య క్రమంలో గుర్తించి పే అండ్ ప్లే ద్వారా క్రీడా కార్యక్రమాలను ప్రారంభించింది. ఇలా 41 కేవీకేలు వినియోగంలోకి వచ్చాయి. వీటితో పాటు మరో 428 క్రీడా సముదాయాలు ఏపీలో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు శాప్ ఆధ్వర్యంలో 250 మంది కోచ్‌లు వివిధ రూపాల్లో నిత్యం 7356 మంది క్రీడాకారులకు సేవలందిస్తున్నారు. గ్రామీణ క్రీడాకారులకు ఉన్నత శిక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 25 జిల్లాల్లో ఖేలో ఇండియా సెంటర్లు, ఒక రాష్ట్ర ఖేలో ఇండియా సెంటర్‌ను స్థాపించింది.

ప్రోత్సాహకాల పెంపు ఇలా..

జాతీయ పోటీల్లో పతకాలు గెలిచిన క్రీడాకారులకు..

పతకం	గతంలో	ప్రస్తుతం
స్వర్ణం	రూ.3లక్షలు	రూ.5లక్షలు
రజతం	రూ.2లక్షలు	రూ.4లక్షలు
కాంస్యం	రూ.లక్ష	రూ.3లక్షలు

జాతీయ స్థాయి టోర్నమెంట్స్‌లో సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో విజేతలకు

పతకం	గతంలో	ప్రస్తుతం
స్వర్ణం	రూ.లక్ష	రూ.1.25లక్షలు
రజతం	రూ.50వేలు	రూ.75వేలు
కాంస్యం	రూ.25వేలు	రూ.50వేలు

రూ.20 కోట్లకుపైగా నగదు పురస్కారాలు

సీఎం జగన్ ప్రభుత్వం క్రీడాకారులకు ఆర్థిక భరోసా కల్పించడంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో సుమారు 65 క్రీడాంశాల్లో పతకాలు సాధించిన 1800 మంది క్రీడాకారులకు రూ.9,61,06,369 నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. అదే అంతర్జాతీయ స్థాయిలో 24 క్రీడాంశాల్లో 76 మందికి రూ.8,47,50,000 నగుదు పురస్కారాలు ప్రదానం చేసింది. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక విధానమంటూ లేకపోవడంతో చాలా మంది క్రీడాకారులు నష్టపోయారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాల'ను ప్రవేశ పెట్టారు. గతంలో ఇచ్చే నగదు మొత్తాన్ని భారీగా పెంచారు. దీంతో 2014 నుంచి 2019 మధ్య కాలంలో పతకాలు సాధించినా అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన ఎందరో క్రీడాకారులకు లబ్ధి చేకూరింది. ముఖ్యంగా 33 క్రీడాంశాల్లో 51 మంది అంతర్జాతీయ అథ్లెట్స్‌కు మెరుగైన శిక్షణ అందించేందుకు రూ.2,24,47,160 ఆర్థిక సాయాన్ని అందజేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక్క స్పోర్ట్స్ కోటాలోనే ఏకంగా 2వేల మందికిపైగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు కల్పించింది. జగనన్న క్రీడా సంబరాల పేరుతో నాలుగు క్రీడాంశాల్లో రూ.50.24 లక్షల నగదు బహుమతులతో పోటీలను నిర్వహించింది. ఇందులో దాదాపు 15వేల మందికి పైగా క్రీడాకారులు పోటీ పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 26 జిల్లాల్లో 1356 వేదికల్లో సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించింది. ప్రతి శిబిరానికి రూ.7వేల చొప్పున స్పోర్ట్స్ మెటీరియల్స్ కొనుగోలుకు ఇచ్చి యువతను క్రీడలవైపు నడిపిస్తోంది. దేశంలోనే అతిపెద్ద క్రీడా టోర్నీగా రూ.120 కోట్లతో ఆడుదాం ఆంధ్రను విజయవంతంగా చేపట్టింది. ఇందులో సుమారుగా 38 లక్షల మంది పురుషులు, మహిళా క్రీడాకారులు భాగస్వాములయ్యారు. వీటన్నింటిని ప్రపంచం మొత్తం క్రీడలు అంటుంటే.. ఈనాడు ఆంధ్రాలో ఆటలు లేవంటూ తన అంధత్వాన్ని ప్రదర్శించింది.

అడవి బిడ్డల ఆటకు పదును



కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలల్లో 10 క్రీడాంశాల్లో 279 మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో 77 మంది జాతీయ స్థాయి, 5 గురు అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పతకాలు సాధించారు. ఈ స్ఫూర్తితోనే శాప్, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో తొలిసారిగా స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభించింది. పశ్చిమగోదావరి జిల్లా బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలురకు పెదవేగిలో, బాలికలకు పోలసానిపల్లిలో క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. ఇక్కడ అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, ఫెన్సింగ్, షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లలో శిక్షణ అందిస్తోంది. దీనితో పాటు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఏకంగా 6 స్పోర్ట్స్ స్కూళ్లను ప్రవేశపెట్టింది. సీతంపేట(శ్రీకాకుళం), భద్రగిరి(విజయనగరం), ముసురిమిల్లి(తూర్పు గోదావరి), యర్రగొండపాలెం (ప్రకాశం), మహానంది (కర్నూల్), గొల్లలదొడ్డి(అనంతపురం)లో గిరిజన యువతను క్రీడాకారులగా తీర్చిదిద్దుతోంది. ఆయా స్పోర్ట్స్ స్కూళ్లలో 25 మంది కోచ్‌లను నియమించింది. దీనిని క్రీడాభివృద్ధిలో భాగంగా ఈనాడు చూడలేక నంగనాచి రాతలు రాసింది.

సీఐఐ ఏపీ చాప్టర్ చైర్మన్‌గా మురళీ కృష్ణ



సాక్షి, అమరావతి: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్‌గా వైజాగ్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎండీ డాక్టర్ వి.మురళీ కృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో 2024–25 సంవత్సరానికి సీఐఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న సుజయ్ బయోటెక్ ఎండీ డాక్టర్ ఎం లక్ష్మీ ప్రసాద్ నుంచి వి.మురళీ కృష్ణ బాధ్యతలు తీసుకుంటారు. వైస్ చైర్మన్‌గా ఫ్లూయెంట్ గ్రిడ్ చైర్మన్ ఎండీ జి.మురళీకృష్ణ ఎన్నికయ్యారు. టెక్నాలజీ, ఇన్నొవేషన్, ఆర్‌అండ్‌డీ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే విధంగా పారిశ్రామికీకరణలో అనుసరించాల్సిన నూతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

కాశీలో తెలుగువారి కోసం మరో వసతి గృహం

ప్రారంభించిన కుర్తాళం పీఠాధిపతి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీకి వెళ్లే తెలుగు భక్తుల కోసం మరో వసతి గృహం సిద్ధమైంది. శ్రీ రామతారక ఆంధ్ర ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్మించిన కొత్త వసతి గృహాన్ని కుర్తాళం పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ స్వామి బుధవారం ప్రారంభించారు. ఉచిత భోజనం, వసతి కల్పించే ఈ వసతి గృహం శివరాత్రి నుంచి భక్తులకు అందుబాటులోకి వస్తుందని ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వేమూరి వేంకట సుందర శాస్త్రి తెలిపారు. శ్రీ రామతారక ఆంధ్ర ఆశ్రమానికి తమకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని ఈ సందర్భంగా సిద్ధేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశీ అన్నపూర్ణా మాత ఆలయం ప్రధాన అర్చకులు మహంత శంకర పూరి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా దాక్షాయణి



సాక్షి, అమరావతి: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్‌గా చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరుకు చెందిన పంటపల్లి దాక్షాయణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు అమలు పరుస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

పుష్పపల్లకీ సేవలో మల్లన్న దంపతులు

- శ్రీశైలంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు బుధవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునుడు పుష్పపల్లకీపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత పుష్పపల్లకీని వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారిని తోడ్కొనివచ్చి పుష్పపల్లకీలో ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. క్షేత్రం తూర్పు, దక్షిణ మాడవీధుల్లో అంగరంగ వైభవంగా పుష్పపల్లకీ గ్రామోత్సవం నిర్వహించారు. లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారు గజవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



జాన్వీ కపూర్, మహేశ్వరి, వంగా సందీప్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీ నటులు జాన్వీ కపూర్, మహేశ్వరి, సంపత్ రాజ్, సినీ డైరెక్టర్ వంగా సందీప్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మద్దాలి ఉషాగాయత్రి, ఎల్వీ గంగాధరశాస్త్రి, మండ సుధారాణి, వినుకొండ సుబ్రహ్మణ్యం


సంగీత, నాటక అకాడమీ అవార్డుల ప్రదానం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురికి అందజేసిన రాష్ట్రపతి ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ/విశాఖపట్నం: సంగీత, నృత్య, నాటక రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురికి సంగీత నాటక అకాడమీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. బుధవారం విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2022, 2023 సంవత్సరాలకు గానూ విజేతలకు రాష్ట్రపతి పురస్కారాలు బహూకరించారు. ప్రముఖ కూచిపూడి నృత్యకారులు రాజా–రాధారెడ్డి 2022–23 గాను సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకున్నారు. వీరితోపాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరుకు చెందిన వినుకొండ సుబ్రహ్మణ్యం 2022 సంవత్సరానికి కర్ణాటక ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ (తవిల్) విభాగంలో అవార్డు అందుకున్నారు. కర్నూలుకు చెందిన మద్దాలి ఉషాగాయత్రి కూచిపూడి రంగంలో 2023 సంవత్సరానికి, అవనిగడ్డకు చెందిన ఎల్వీ గంగాధరశాస్త్రి సుగం సంగీతంలో 2023 సంవత్సరానికి, కర్ణాటక గాత్ర సంగీతంలో పేరుగాంచిన విశాఖకి చెందిన మండ (ఆలమూరు) సుధారాణి 2022 సంవత్సరానికి పురస్కారాలు అందుకున్నారు. తెలంగాణలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన పేరిణి ప్రకాష్ పేరిణియాట్టంలో 2023 సంవత్సరానికి, హైదరాబాద్‌కు చెందిన భాగవతుల సేతురామ్ కూచిపూడి నృత్యంలో 2022 సంవత్సరానికి అవార్డు అందుకున్నారు.

‘ప్రసాద్ పథకం’ పనులకు ప్రధాని శంకుస్థాపన నేడు

- వర్చువల్ పద్ధతిలో హాజరుకానున్న నరేంద్ర మోదీ
- సింహాచలం దేవస్థానంలో రూ.54.04 కోట్లతో అభివృద్ధి పనులు



సింహాచలం: సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రూ.54.04 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ‘ప్రసాద్ పథకం’లో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఉదయం 11.45 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు సింహగిరిపై నృసింహ మండపం ఆవరణలో సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర టూరిజం శాఖ, సింహాచలం దేవస్థానం అధికారులు చేస్తున్నారు. సింహగిరిపై రూ.27 కోట్లతోనూ, కొండదిగువన రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు జరుగనున్నాయి. రూ.3 కోట్లతో లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగనున్నాయి. వీటిలో ప్రధానంగా సింహగిరిపై క్యూకాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ హాల్ ఉన్నాయి. అలాగే ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాల, పార్కుల నిర్మాణం, బ్రాస్ క్యూలు, అన్నదానం భవనం వద్ద కోల్డ్ స్టోరేజీ, ఆధునిక కిచెన్, ఆలయానికి విద్యుద్దీపాలంకరణ పనులు చేయనున్నారు. కొండ దిగువన రూ.5.50 కోట్లతో పుష్కరిణి సత్రం పునఃనిర్మాణం, రూ.2 కోట్లతో సింహగిరి మెట్లు ఆధునికీకరణతో పాటు కొత్త ఘాట్‌రోడ్డులో బస్సు కాంప్లెక్స్ తదితర పనులు జరుగనున్నాయి.

‘పాట్’ అమలులో ఏపీ ఉత్తమం

- సైకిల్–1లో 8.67 ఎంటీవోఈ ఇంధనం ఆదా
- సైకిల్–2లో ఆదా అయిన ఇంధనం 14.08 ఎంటీవోఈ
- పెర్ఫార్మ్, అచీవ్ ట్రేడ్ పథకంపై రీజనల్ వర్క్‌షాప్
- ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల పరిశ్రమల ప్రతినిధులు హాజరు



వర్క్ షాప్‌లో ప్రసంగిస్తున్న ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

సాక్షి, అమరావతి: పెర్ఫార్మ్, అచీవ్ ట్రేడ్ (పాట్) పథకం అమలులో రాష్ట్రం ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. పారిశ్రామికరంగంలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన వ్యయాన్ని తగ్గించడం, గ్రీన్‌హౌస్ ఉద్గారాలను కట్టడిచేయడం వంటి లక్ష్యాలను సాధించడంలో భాగంగా పరిశ్రమల్లో ఎనర్జీ మేనేజర్లకు పాట్ పథకంపై బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్‌ఈసీఎం) బుధవారం విజయవాడలో రీజనల్ వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయానంద్ ఏపీఎస్‌ఈసీఎం సీఈవో కుమారరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ నందకిషోర్‌రెడ్డి, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీ కమలాకర్‌బాబు, బీఈఈ సీనియర్ సెక్టార్ ఎక్స్‌పర్ట్ నవీన్‌కుమార్‌లతో కలిసి పాట్‌పై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పాట్ పథకం అమలు చేయటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లలో డీకార్బనైజేషన్ చర్యలు నిర్వహించడం వంటి పటిష్టమైన ప్లాన్‌ను రూపొందించిన ఉత్తమ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని చెప్పారు. ఈ పథకం దేశవ్యాప్తంగా అద్భుతమైన ఫలితాలను సాధించిందన్నారు. పాట్ సైకిల్–1లో 8.67 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వివాలెంట్ (ఎంటీవోఈ) ఇంధనాన్ని ఆదా చేయడం వల్ల సుమారు 31 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను నివారించగలిగామని చెప్పారు. పాట్ సైకిల్–2లో 14.08 ఎంటీవోఈ ఇంధనం ఆదా చేయడంద్వారా 68 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో పరిశ్రమలు ఇంధన సామర్థ్య చర్యలను అమలు చేయడం ద్వారా పాట్ సైకిల్–3 వరకు 1.16 ఎంటీవోఈ ఇంధనాన్ని ఆదా చేశాయని చెప్పారు. పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే కాకుండా పారిశ్రామిక ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని ఆయన తెలిపారు. వర్క్‌షాప్‌లో ఏపీ, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సిమెంట్, టెక్స్‌టైల్స్, పవర్‌ప్లాంట్లు, ఎరువులు, ఇనుము, ఉక్కు, ఎరువులు, సిమెంట్, అల్యూమినియం, పేపర్, క్లోర్–ఆల్కలీ పరిశ్రమల నుంచి 100 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

- 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం ఈ నెల 25 వరకు గడువు
- సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు అవకాశం
- విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు రిజర్వ్

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద పేద పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో ఉచితంగా విద్యనభ్యసించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల కోసం ప్రైవేట్ పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 25 శాతం సీట్లను రిజర్వ్ చేసింది. ఐదేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలకు 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల దరఖాస్తులను సమర్పించేందుకు గడువు ఇచ్చింది. దరఖాస్తు చేసుకోవడానికి https://cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. గ్రామ, వార్డు సచివాలయాలు, ఇంటర్నెట్, మీ–సేవా కేంద్రాల నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమర్పించేందుకు చిరునామా, కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఇల్లు మారినట్లయితే.. ఆధార్ కార్డులో పాత ఇంటి చిరునామా ఉంటే.. ప్రస్తుతం ఉంటున్న ఇంటి చిరునామా కోసం విద్యుత్ బిల్లును ఉపయోగించవచ్చు. పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు తమ నివాసానికి ట్యాగ్ చేసిన సంబంధిత సచివాలయానికి కిలోమీటర్ నుంచి మూడు కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చు. అధికారులు దరఖాస్తుల అర్హతను ధ్రువీకరించిన తర్వాత లాటరీ విధానంలో సీట్లు కేటాయిస్తారు. సంబంధిత సచివాలయాలకు కిలోమీటర్ దూరంలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తారు. ఒకవేళ కిలోమీటర్ పరిధిలో సీటు లభించకపోతే.. మూడు కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలల్లో సీట్లు కేటాయిస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో సుమారు 19,000 మంది పిల్లలకు ఉచిత ప్రవేశాలు కల్పించారు.

హజ్ యాత్రికుల సమస్యలు పరిష్కరించండి

కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ కార్యదర్శికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి అమరావతి: హజ్ పర్యటనలో భాగంగా మక్కా, మదీనా తదితర ప్రాంతాల్లో ఏపీ యాత్రికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం.. కేంద్ర మైనార్టీ వ్యవహారాలశాఖ కార్యదర్శి శ్రీనివాస్‌ను కోరారు. ఆయన బుధవారం ఢిల్లీలో శ్రీనివాస్‌కు 15 అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. విజయవాడ ఎంబార్కేషన్ నుంచి బయలుదేరే సమయంలోనే యాత్రికుల మీద పడుతున్న రూ.83 వేల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని గుర్తుచేశారు. 2023లో ఏపీ నుంచి 2,067 మంది హజ్ యాత్రకు వెళ్లారని తెలిపారు. మక్కా, మదీనా తదితర ప్రాంతాల్లో తాగునీరు, వైద్య సదుపాయం సమయానికి అందక వారు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లేవారికి ఆ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. హజ్‌కు హైదరాబాద్ నుంచి వెళ్లేవారితో పోలిస్తే విజయవాడ నుంచి విమాన చార్జీలు రూ.83 వేలు అధికంగా ఉన్నాయని, ఆ వ్యత్యాసాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర కార్యదర్శి ఈ ఏడాది నుంచి యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు వైఎస్సార్ చేయూత నిధులు విడుదల



నేడు అనకాపల్లి జిల్లా పిసినికాడలో 4వ విడత నిధులు బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం జగన్

‘మహిళ బాగుంటే.. కుటుంబం బాగుంటుంది. కుటుంబం బాగుంటే ప్రాంతం బాగుంటుంది. ప్రాంతం బాగుంటే రాష్ట్రం బాగుంటుంది’ అని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచీ అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి కోసం వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. లక్షలాది మంది మహిళలకు ఆర్థికంగా ఆసరా అందిస్తూ వ్యాపారాలు, చేతివృత్తులు, చిన్నపాటి పరిశ్రమల వైపు చేయిపట్టి నడిపిస్తున్నారు. ఈ మహా యజ్ఞంలో భాగంగా గురువారం వైఎస్సార్ చేయూత పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల జీవనోపాధుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.18,750 చొప్పున నాలుగో విడత ఆర్థిక సాయం అందజేయనున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 45–60 ఏళ్ల మధ్య వయసు గల 26,98,931 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు గురువారం నుంచి నాలుగో విడత వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున నగదు అందుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలు శాశ్వత జీవనోపాధి పొందేలా ప్రతి నెలా స్థిర ఆదాయం లభించేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2020 ఆగస్టు 12న ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఒక్కో లబ్ధిదారునికి నాలుగు విడతల్లో మొత్తం రూ.75 వేల చొప్పున అందించే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా రూ.18,750 చొప్పున ప్రభుత్వం ఇప్పటివరకు ప్రతి మహిళకు రూ.56,250 చొప్పున అందజేసింది. నాలుగో విడతగా అందించే మొత్తంతో ఒక్కొక్క మహిళకు రూ.75 వేల సాయం అందించినట్టవుతుంది. 4వ విడతగా అందించే రూ.5,060.49 కోట్లతో కలిపి ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఒక్క పథకం ద్వారానే రూ.19,189.60 కోట్లు అందించినట్టవుతుంది.

14 రోజులపాటు ఉత్సవంలా..

ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యే నాలుగో విడత వైఎస్సార్ చేయూత కార్యక్రమం ఉత్సవాల తరహాలో రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులపాటు నిర్వహించనున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మండలాల వారీగా స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ వైఎస్సార్ చేయూత పంపిణీ కార్యక్రమాలు చేపడతారు.

వ్యాపార దిగ్గజాల ద్వారా అదనపు తోడ్పాటు

- వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధి పొందే మహిళలు ఆ మొత్తాలను వారివారి ఇష్టం మేరకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు.
- లబ్ధిదారుల్లో ఎవరైనా ప్రభుత్వం అందజేసే సాయంతో చిన్న, మధ్యతరహా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తే వారికి అదనపు తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం గతంలోనే హిందుస్తాన్ యూనిలీవర్, ఐటీసీ, ప్రాక్టర్ గాంబుల్, రిలయన్స్ రిటైల్, అమూల్, అజియో బిజినెస్ వంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థలతోనూ ఒప్పందాలు చేసుకుంది.
- మూడు విడతల్లో లబ్ధి పొందిన మహిళల్లో ఇప్పటివరకు 16,55,591 మంది వివిధ రకాల వ్యాపారాలు ప్రారంభించి ప్రతి నెలా స్థిర ఆదాయం పొందుతున్నారు.
- ఈ ఏడాది కొత్తగా జీవనోపాధులు ఏర్పాటుకు ముందుకొచ్చే లబ్ధిదారులకు అవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా లేదంటే స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద ఇప్పించేందుకు మండల అధికారులు తగిన చర్యలు చేపడతారు.
- ఈ పథకం ద్వారా లబ్ధి పొంది ఇప్పటికే వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి విజయగాథలను ఇతర లబ్ధిదారులకు తెలియజేసేలా కార్యక్రమాలను, ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నారు.

నేడు సీఎం జగన్ అనకాపల్లి జిల్లా పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి అనకాపల్లి జిల్లా కశింకోట చేరుకుంటారు. అక్కడి నుంచి పిసినికాడ చేరుకుని.. ‘వైఎస్సార్ చేయూత’ 4వ విడత నిధులను బటన్ నొక్కి సీఎం జగన్ విడుదల చేస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు.

నాలుగు విడతల్లో అందించిన సాయం ఇలా..

విడత	అమలు తేదీ	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధిదారులకు అందించిన మొత్తం
తొలి విడత	12.08.2020	24,00,111	రూ.4,500.20 కోట్లు
రెండో విడత	22.06.2021	24,95,714	రూ.4,679.46 కోట్లు
మూడో విడత	23.09.2022	26,39,703	రూ.4,949.44 కోట్లు
నాలుగో విడత	07.03.2024	26,98,931	రూ.5,060.49 కోట్లు

బ్రదర్ అనిల్ సమావేశంలో పాస్టర్ల అవస్థలు



నిర్వాహకులిచ్చిన టోకెన్లు చూపిస్తున్న పాస్టర్లు

పెదపాడు: ఏలూరు జిల్లా వట్లూరులోని ఓ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన బ్రదర్ అనిల్‌కుమార్ సమావేశం పాస్టర్లకు చుక్కలు చూపించింది. ఉదయం 10 గంటలకు సమావేశానికి వచ్చి పేర్లు నమోదు చేసుకుంటే ఒక్కొక్కరికీ రూ.1,000, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామని ఏలూరుకు కొందరు వ్యక్తులు పాస్టర్లకు సమాచారమిచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకు పలువురు పాస్టర్లు వచ్చారు. ఉదయం 7 గంటలకే రిజిస్ట్రేషన్ పూర్తయిందని చెప్పడంతో వారంతా అవాక్కయ్యారు. సందేశం అనంతరం బ్రదర్ అనిల్‌కుమార్ మధ్యాహ్నం 2 గంటల సమయంలో వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన వెంటనే హాలులో ఫ్యాన్లు, ఏసీ, విద్యుత్ లైట్లు స్విచ్ఛాఫ్ చేసేశారు. దీంతో గాలి లేక అందరూ ఇబ్బందులు పడ్డారు. కొందరు వృద్ధులు శ్వాస ఆడక అస్వస్థతకు గురయ్యారు. భోజనాల వద్ద కూడా అరకొర వసతులు ఉండటంతో పాస్టర్లు ఇబ్బంది పడ్డారు. సమావేశానికి వస్తే ఇస్తామన్న పారితోషికం కోసం టోకెన్లు తీసుకున్న వారిని సైతం నాలుగైదుసార్లు తిప్పారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదీ కొద్దిమందికి మాత్రమే డబ్బులు ఇవ్వడంతో మిగతా వారు నిర్వాహకులను నిలదీశారు. డబ్బులు అయిపోయాయని తీసుకువస్తామని చెప్పడంతో పలువురు పాస్టర్లు, మహిళలు గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. అక్కడ ఉన్న వారితో మహిళలు వాగ్వాదానికి దిగారు. కొంత సమయం తర్వాత క్యూలో ఉన్న మరికొందరికి రూ.500 చొప్పున ఇచ్చి డబ్బులు అయిపోయాయని నిర్వాహకులు చేతులెత్తేశారు. దీంతో నిర్వాహకులపై పాస్టర్లు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు వారి నిరసన కొనసాగింది. విషయం తెలిసిన ఏలూరు త్రీ టౌన్ ఎస్సై బీవీ రామారావు సంఘటన స్థలానికి చేరుకుని పాస్టర్లతో మాట్లాడారు. అనంతరం పాస్టర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.

రాజకీయంగా బాబు అండ్‌కోను గోతిలో పాతిపెట్టండి..

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడ్లవల్లేరు: సీనియర్ ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్‌ను గుండెల్లో పెట్టుకుని అభిమానించే ప్రతి ఒక్కరూ.. పందుల్లా కలిసి వస్తున్న చంద్రబాబు అండ్‌కోను రాబోయే ఎన్నికల్లో గోతిలో పాతి పెట్టాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు (నాని) పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మంగళవారం రాత్రి జరిగిన సభలో మాట్లాడుతూ.. పనికి రాని లోకేశ్‌ను గెలిపిస్తే.. పెద్ద ఎన్టీఆర్ మాదిరిగానే జూనియర్ ఎన్టీఆర్‌ను బయటకు గెంటేసి టీడీపీని ఆక్రమించుకుంటారని అన్నారు. పుట్టిన రోజు, చావు రోజుకు తేడా తెలియని లోకేశ్‌ను సీఎం చేయాలనే దురుద్దేశంతో జూనియర్ ఎన్టీఆర్‌పై అనేక కుట్రలు చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 120సార్లు బటన్ నొక్కి పేద ప్రజలకు రూ.2.50లక్షల కోట్లను సంక్షేమ ఫలాలుగా అందించిన సీఎం జగన్ కోసం రెండు సార్లు ఈవీఎం బటన్‌ను ఫ్యాన్ గుర్తుపై నొక్కాలని కోరారు. సభలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ నేతలు శాయన రవి, వడ్లమూడి చిన్ని, పడమటి సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం

1,256వ రోజుకు చేరిన బహుజన రిలే దీక్షలు



తాడికొండ: విశాఖ వేదికగా పాలన కొనసాగిస్తానని చెప్పి వికేంద్రీకరణకు మార్గం సుగమం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు బహుజనులు జేజేలు పలికారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,256వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. కులవాదులకు ఇది చెంపపెట్టు అని, 2 శాతం ఓటు బ్యాంకు ఉన్న ఓ సామాజిక వర్గం తరతరాల ఆధిపత్యం చలాయించాలనే ఎత్తుగడలు ఇక సాగనివ్వబోమని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. వికేంద్రీకరణతో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు సమానంగా అభివృద్ధి చెంది పేద రికం లేని సమాజ నిర్మాణానికి సాధ్యమవుతుందని తెలిపారు. జపాన్, సింగపూర్, మలేషియా దేశ విదేశాలను మించిన రాజధాని నిర్మిస్తానని చెప్పిన చంద్రబాబు అమరావతి ప్రాంతాన్ని అడవిలా మార్చి.. తను మాత్రం పక్క రాష్ట్రంలో విలాసవంతమైన భవనంలో కులుకుతున్నాడని మండి పడ్డారు. బీసీ డిక్లరేషన్ పేరుతో బాబు కొత్త డ్రామాకు తెరలేపాడన్నారు. ఎంతమంది బీసీలను రాజ్యసభకు పంపాడో చెప్పాలన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి బహుజనులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బోదాల సలోమీ, పులి దాసు, పల్లె బాబు, కొమరవల్లి కిషోర్ బాబు, బోదాల సౌమ్య, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బొలిమేర శ్యామ్యూల్, నూతక్కి జోషి పాల్గొన్నారు.

‘రైతులకు గిట్టుబాటు ధర’

మద్దిపాడు: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడితోటి యశ్వంత్ కుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా వెల్లంపల్లి వేలం కేంద్రంలో బుధవారం ఆయన పొగాకు కొనుగోళ్ల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యుడు పొద వరప్రసాదరావు, ఆర్‌ఎం లక్ష్మణరావు, పొగాకు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పగిలిన తాగునీటి పైపు లైన్

- మూడు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- నానాఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు



తాగునీటి పైపులైన్‌తో పగిలి చుట్టు పక్కల పొలాల్లోకి చేరిన నీరు

రాయచూరు రూరల్: నగరానికి తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్ యరమరస్ పంప్ హౌస్ వద్ద పగిలి పోవడంతో మంగళవారం సాయంత్రం నీటి సరఫరా నిలిచిపోయింది. నీరు చుట్టు పక్కల పొలాలు, పరిసరాల్లోకి చేరాయి. కృష్ణా నది నుంచి నిర్మించిన రెండో దశ తాగునీటి పథకం పైపు లైన్ లీక్ కావడంతో ఆ నీరు వృథాగా పోతున్నాయి. నగరసభ కమిషనర్, నీటి సరఫరా అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు. వేసవిలో నీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేకపోయింది. వానలు లేక నదుల్లో నీరు లేకపోవడంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి పైపు లైన్ పగిలి రోడ్డు పక్కన నీరు వృథాగా ప్రవహిస్తున్నా అడిగేవారు కరువయ్యారు.

రేపటి నుంచి శివరాత్రి ప్రత్యేక ఉత్సవాలు



మాట్లాడుతున్న సంచాలకురాలు స్మిత

రాయచూరు రూరల్: నగరంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు శివరాత్రి పండుగ సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత పేర్కొన్నారు. బుధవారం ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వాల్కట్ మైదానంలో 12 జ్యోతిర్లింగాల దర్శనం, శివలింగాల యాత్ర చేపడుతామన్నారు. 8న ఆత్మ సాక్షాత్కార మహోత్సవం, 9న పరమాత్మ సాక్షాత్కార మహోత్సవం, 10న శ్రేష్ట జీవన సాక్షాత్కార మహోత్సవం, సాంస్కృతిక ఉత్సవాలు చేస్తామన్నారు. 8న 12 కార్లపై శివలింగాల నుంచి శివలింగ యాత్రను నిర్వహిస్తామన్నారు. 10న వాల్కట్ మైదానంలో బొమ్మలాట సర్వ ధర్మాల సారం భగవంతుడు ఒక్కడే అనే నాటకం చేపడుతామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తాలూకాలోని జంగ్లి రాంపుర గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. 2022–23వ ఏడాది కళ్యాణ కర్ణాటక ప్రదేశ అభివృద్ధి మండలి మెగా మైక్రో పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతనంగా నిర్మించారు. దీనిని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శిశు అభివృద్ధి పథకం అధికారి ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగపు అధికారి ఈరమ్మ, జీపీ పీడీఓ శ్రీనివాస్ పత్తార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయిని ఈరమ్మ, సహాయకురాలు పార్వతిబాయి, జీపీ సభ్యులు బాబురెడ్డి, దండప్ప రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్కేయూ వీసీగా మైత్రి



వైస్‌చాన్సలర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతిస్తున్న విజయకుమార్ మాలశెట్టి

బళ్లారిఅర్బన్: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం'వీఎస్కేయూ) వైస్‌చాన్సలర్‌గా హంపీ కన్నడ విశ్వవిద్యాలయం గిరిజన అధ్యయన విభాగం ప్రొఫెసర్ మైత్రిని నియమిస్తూ గవర్నర్ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జ్ చాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ విజయకుమార్ బి.మాలశెట్టి నూతన వైస్‌చాన్సలర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి అధికార బాధ్యతలను అప్పగించారు.

టిప్పర్ దూసుకెళ్లి బాలిక మృతి

రాయచూరు రూరల్: బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా ఇస్లాంపురలో మంగళవారం ఇంటి ముందు బజారులో ఆడుకుంటుండగా అకస్మాత్తుగా టిప్పర్ దూసుకెళ్లడంతో చక్రాల కింద పడి అద్వయిత అక్షయ(4) అనే బాలిక మరణించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హుక్కేరి పోలీసులు తెలిపారు.

పౌష్టికాహార లోపం.. భవితకు శాపం

- జిల్లాలో 1333 మంది పిల్లల్లో ఎదుగుదల లేమి
- స్త్రీశిశు సంక్షేమశాఖ డీడీ నారాయణస్వామి వెల్లడి



అపౌష్టికత బారిన పడిన చిన్నారులు

కోలారు: గర్భావస్థలో ఉన్న సమయంలో పౌష్టిక ఆహార కొరత, అవధి పూర్వ జననాలు తదితర కారణాల వల్ల జిల్లాలో 1333 మంది పిల్లలు అపౌష్టికతతో బాధపడుతున్నారని స్త్రీశిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ నారాయణస్వామి తెలిపారు. జిల్లాలోని ఆరు తాలూకాల్లో కలిపి 109 మంది పిల్లల్లో తీవ్ర అపౌష్టికత ఉండగా 1224 మంది పిల్లలు సాధారణ అపౌష్టికతను కలిగి ఉన్నారన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అందించిన వివరాల ప్రకారం 2023 డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాలో మొత్తం 84,671 మంది పిల్లల బరువులను పరీక్షించారన్నారు. వారిలో 1,333 మంది పిల్లల్లో అపౌష్టికత కనిపించిందన్నారు. మొత్తం పిల్లల ప్రమాణంతో పోలిస్తే జిల్లాలో 1.57 శాతం మంది పిల్లల్లో అపౌష్టికతను నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను వెచ్చించి వివిధ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు.

క్షీణించిన శారీరక ఎదుగుదల

అయితే పిల్లల శారీరక ఎదుగుదల మాత్రం అనుకున్నంత ప్రమాణంలో లేదన్నారు. పెరుగుతున్న బాల్యవివాహాలు, సామాజిక ఆర్థిక కారణాలు జిల్లాలో పిల్లల అపౌష్టికత పెరుగుదలకు కారణమవుతున్నాయన్నారు. పిల్లల్లో అపౌష్టికత నివారణ జిల్లా యంత్రాంగానికి సవాలుగా పరిణమించిందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు తాలూకాలోనే అపౌష్టికత ఎక్కువగా కనిపిస్తోందన్నారు. తాలూకాలో 576 మంది పిల్లలు తీవ్ర, సాధారణ అపౌష్టికతను కలిగి ఉన్నారన్నారు. అనంతర స్థానం శ్రీనివాసపుర తాలూకాదన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అపౌష్టికత కలిగిన పిల్లలపై దృష్టి పెట్టారన్నారు. జిల్లాలో ప్రతి తాలూకాకు ఒకరు చొప్పున నోడల్ అధికారిని నియమించారన్నారు,. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువును కొలుస్తున్నారన్నారు. అపౌష్టికత కలిగిన పిల్లలకు పౌష్టికాహారం ఇస్తున్నామన్నారు. పిల్లల్లో అపౌష్టికత, రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించి నియంత్రించడానికి సముదాయ ఆరోగ్య అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు.

అపౌష్టికతతో చిన్నారుల మృత్యువాత

వయస్సు, ఎత్తుకు తగిన బరువు, చర్మం ఆధారంగా పిల్లల్లో అపౌష్టికతను గుర్తిస్తున్నారన్నారు. తీవ్ర అపౌష్టికతతో ఐదేళ్లలోపు వయస్సు పిల్లలు మరణించే అవకాశం ఉందన్నారు. కోవిడ్ తరువాత అపౌష్టికతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిందన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి విద్యార్థులకు పౌష్టిక ఆహారంగా రాగిమాల్ట్ ఇచ్చే కార్యక్రమాన్ని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వెన్నతో కూడిన పాలు, కోడిగుడ్డు, అరటి పండు, వేరుశెనగ చిక్కీ అందిస్తోందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ పిల్లలకు కూడా పౌష్టిక ఆహారం అందిస్తున్నారన్నారు. అపౌష్టికతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించే కార్యక్రమం నిరంతరంగా జరుగుతోందన్నారు. పిల్లల్లో అపౌష్టికత కనిపిస్తే తగిన చికిత్సను, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు.

సీఎం సంతకం ఫోర్జరీతో మండలి అధ్యక్షుడి నియామకం



అబ్దుల్ నబీ కాద్లూర్

రాయచూరు రూరల్: రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్ష పదవికి నియామకంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సంతకం ఫోర్జరీ చేసిన ఉదంతం యాదగిరి జిల్లా సురపురలో చోటు చేసుకుంది. రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్ష నియామకంలో యాదగిరి జిల్లా కాంగ్రెస్ నేత అబ్దుల్ నబీ కాద్లూర్‌కు ముఖ్యమంత్రి సిద్దరామయ్య నకిలీ సంతకం చేసిన ఆదేశాలు జారీ చేశారు. నకిలీ ఆదేశ పత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గత నెల 25న మరణించిన సురపుర ఎమ్మెల్యే, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాజా వెంకటప్ప నాయక్ గుండెపోటుతో మరణించిన సంగతి విదితమే. ఆయన స్థానంలో అబ్దుల్ నబీ కాద్లూర్‌ను నియమించినట్లు సీఎం నకిలీ సంతకంతో ఉత్తర్వులు జారీ కావడం చర్చకు కారణమైంది.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న స్వామీజీ తదితరులు

రాయచూరు రూరల్: నేటి సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలని కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య పేర్కొన్నారు. ఎల్‌బీఎస్ నగర్‌లోని విజ్ఞాన్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సంస్కృతి, సంస్కారం, ఆచార, విచారాలు, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో కళలను పోషించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సంస్థాపకులు వెంకటేష్, సురేషున్నారు.

పిల్లల్లో భగవంతుడిని చూడాలి



వంట సిబ్బందికి వస్త్రాలు అందిస్తున్న దాత ధర్మేశ్

శ్రీనివాసపురం: అక్షర దాసోహ సిబ్బంది పాఠశాలలో స్వచ్ఛతను కాపాడాలని, వంట సిబ్బంది పిల్లల్లో దేవుడిని చూస్తూ వారికి రుచికరమైన భోజనం వడ్డించాలని దాత ధర్మేష్ తెలిపారు. బుధవారం తాలూకాలోని బట్టరహళ్లి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్లస్టర్‌లోని 30 మంది అక్షర దాసోహ వంట సిబ్బందికి నూతన వస్త్రాలను అందించి ఆయన మాట్లాడారు. వంట సిబ్బంది పిల్లలకు మాతృహృదయంతో భోజనం వడ్డించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణప్ప మాట్లాడుతూ దాత ధర్మేష్ ప్రతి నెలా తన జీతంలో రూ.10 వేలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి గత 20 ఏళ్లుగా వెచ్చిస్తున్నారన్నారు. సాహిత్య, సంగీత, క్రీడా రంగాలకు కూడా సహాయ హస్తాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ గంగాధర్, ఉపాధ్యాయుడు చంద్రప్ప, పరమేష్, మునిస్వామి, మంజుల పాల్గొన్నారు.

రెండు రోజుల్లో లోక్‌సభ అభ్యర్థుల జాబితా

- సీఎం సిద్దరామయ్య వెల్లడి



మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

సాక్షి బళ్లారి: మరో రెండు రోజుల్లో రాష్ట్రంలోని లోక్‌సభ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆయన బుధవారం బెళగావి జిల్లా అథణి తాలూకా కొత్తలగి గ్రామంలో అమ్మాజేశ్వరి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి మాట్లాడారు. లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో చిక్కోడి అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు. ఇక్కడ పనులు చేశాం, అభివృద్ధికి ఓట్లు వేయాలని ఆయన కోరారు. కూలి పని చేశాం, తమకు కూడా కూలి రూపంలో ఓట్లు వేయాలన్నారు. జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లోనూ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శక్తి పథకం కింద ఆలయాలకు ఎక్కువ మంది వెళ్లి దైవదర్శనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2 వేలు ఇస్తున్నామన్నారు. లక్ష్మణ సవది మంచి రాజకీయ వేత్త. ఆయనకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఆయన మంత్రి పదవి అడగలేదు. నీటి పారుదల రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని అడిగారన్నారు. ఈ పథకం కింద రూ.1486 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. దీంతో 50 వేల ఎకరాలకు నీటి సౌలభ్యం కలుగుతుందన్నారు. అథణి తాలూకా 95 శాతం నీటిపారుదల తాలూకాగా మారుతుందన్నారు. చెరువులు నిండుతాయని, రైతులకు కరువు తీరుతుందన్నారు. నీటిపారుదల రంగానికి తాము అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత నివ్వడం లేదన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాదజోషి మహదాయి గురించి మాట్లాడడం లేదన్నారు. అప్పర్‌కృష్ణా పథకానికి రూ.5300 కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పటికి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. నరేంద్ర మోదీ వద్ద కర్ణాటక ఎంపీలు మాట్లాడడానికి భయపడుతున్నారన్నారు. కేంద్రం నుంచి ఎలాంటి నిధులు రానందున వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత 5 గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతున్నామన్నారు. గత లోక్‌సభ ఎన్నికల ముందు పుల్వామా దాడి అంశాన్ని తెచ్చారు. ప్రస్తుతం రామమందిరం అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. బీజేపీ రాముడి పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. ఆయన సతీమణి సీత, భక్తుడు ఆంజనేయ స్వామిని మరిచారన్నారు. దీంతో తాము జైసీతారాం అంటామన్నారు. బీజేపీ జైశ్రీరాం అంటే మేం జైసీతారాం అంటాం, అంజనాద్రి అభివృద్ధికి రూ.100 కోట్లు విడుదల చేశామన్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పరీక్ష రాసి వస్తుండగా విద్యార్థి మృతి



గాయపడిన మల్లేశ్

హొసపేటె: తాలూకాలోని మరియమ్మనహళ్లి సమీపంలో ఉన్న డణాపుర గ్రామ సమీపంలో మంగళవారం ఆటో, సరుకు రవాణా వాహనం మధ్య జరిగిన ప్రమాదంలో విద్యార్థి మృతి చెందగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..హొసపేటె నగరం నుంచి మరియమ్మనహళ్లి వైపునకు 11 మంది ప్రయాణికులతో ఆటో వెళుతుండగా మార్గ మధ్యంలో హొసపేటె వైపునకు వెళుతున్న సరుకు రవాణా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న హనుమనహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థి బిసనళ్లి మల్లేశ్(17) మృతి చెందాడు. నగరంలో ద్వితీయ పీయూసీ పరీక్ష రాసి తిరిగి డణాపుర గ్రామంలోని ఇంటికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. మిగిలిన వారిని చికిత్స నిమిత్తం హొసపేటెలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన మల్లేశ్‌ను బళ్లారిలోని విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మరియమ్మనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఉడుసులమ్మ కుంభోత్సవాలు



అలంకరణలో ఉడుసులమ్మ దేవి



తలపై కుంభాలు మోసుకెళుతున్న భక్తులు

కంప్లి: కురుగోడు సమీపంలోని బాదనహట్టి గ్రామస్తుల ఆరాధ్య దైవం ఉడుసులమ్మ దేవి కుంభోత్సవాలు, ఊరి పండుగ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. బాదనహట్టితో పాటు 5 గ్రామాల్లో జానపద దేవతలైన బాదనహట్టి ఉడుసులమ్మ దేవి, వద్దట్టి గ్రామ దుర్గమ్మ దేవి, శానవాసపుర గ్రామ సుంక్లపార్వతిదేవి, మారెమ్మ దేవి, సింధిగేరి గ్రామ సుంకలమ్మదేవిల కుంభోత్సవం ఊరి పండగ నిమిత్తం ఉదయం నుంచి గ్రామ దేవతలకు విశేష పూజలు, అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ జరిపించారు. ఈ ఊరి పండుగకు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కులమత భేదాలు మరిచి అందరూ ఉడుసులమ్మ దేవికి ఉదయం నుంచి రాత్రి వరకు కుంభాలు సమర్పించారు. మేటి పెద్ద కుంభం, కుంభోత్సవంలో ఆకర్షణమైన కుంభాల్లో అన్నం, హోళిగితో పాటు 101 కేజీల బరువు గల పెద్ద కుంభాన్ని దేవరమనె కుటుంబం, వాల్మీకులు తీసుకొస్తారు. అర్ధరాత్రి 1.30 గంటలకు ప్రారంభమైన కుంభం ఉదయం 5 గంటలకు వరకు డోలు, కలశాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో చేరుకుంటుంది. కుంభోత్సవాల సందర్భంగా తాగునీటితో పాటు ఆయా వార్డుల్లో నీళ్ల ట్యాంకులు సిద్ధం చేశారు. మురుగు కాలువల మరమ్మతులు, గుంతలు పడిన రోడ్లలో గ్రావెల్ వేశారు. జెస్కాం సిబ్బంది విద్యుత్ సౌకర్యం కల్పించారు.

11, 12 తేదీల్లో ఆనెగుంది ఉత్సవం



లోగో విడుదల చేస్తున్న మంత్రి తంగడిగి, ఎమ్మెల్యే, తదితర అధికారులు

గంగావతి: ఆనెగుంది ఉత్సవాన్ని ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహించాలని తీర్మానించారు. అంజనాద్రి బెట్ట వద్ద వాహనాల పార్కింగ్ కోసం జరిగిన వేలంలో రూ.24.95 లక్షలు పలికింది. 23 మంది వేలంలో పాల్గొనగా, శివపురకు చెందిన గోపి రూ.24.95 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారు. ఆయన వరుసగా మూడో సారి ఈ పార్కింగ్ వేలాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది రూ.13 లక్షలకు ఈయన పాడగా, ఈ ఏడాది అంతకన్నా రెట్టింపు ధరకు పాడారు. ఈ వేలం పాటలో గ్రేడ్–2 తహసీల్దార్ మహంతగౌడ, ఆర్ఐ మంజునాథ్, ఆనెగుంది జీపీ మాజీ ఉపాధ్యక్షులు నరసింహులు, సణాపుర రెవెన్యూ శాఖ అధికారులు కృష్ణవేణి, శ్రీకంఠ తదితరులు పాల్గొన్నారు.

లాంఛనం విడుదల

ఆనెగుంది ఉత్సవానికి లాంఛనాన్ని రాష్ట్ర మంత్రి, కొప్పళ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శివరాజ్ తంగడిగి చేతుల మీదుగా విడుదల చేశారు. కొప్పళ నగరంలోని జిల్లాధికారి కార్యాలయ సభాభవనంలో ఆనెగుంది ఉత్సవాల ఏర్పాట్లకు గురించి మంత్రి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనెగుంది ఉత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా ప్రజలు సహాయ సహకారాలను అందించి విజయవంతం చేయాలని కోరారు. ప్రధానంగా అధికారులకు కేటాయించి ఆయా కార్యచరణ పరిపూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, కొప్పళ జిల్లాధికారి నళిన్ అతుల్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనంతో సమృద్ధిగా వర్షాలు

- ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి
- బుడా అధ్యక్షులు జేఎస్ ఆంజనేయులు



బుడా అధ్యక్షుడిని సన్మానిస్తున్న పార్క్ సభ్యులు

బళ్లారిఅర్బన్: మొక్కలను, చెట్లను కాపాడుకుంటేనే పచ్చదనం పెంపొంది సకాలంలో వర్షాలు కురుస్తాయని బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం రాఘవేంద్ర కాలనీ రెండో స్టేజ్ వద్దగల పార్క్‌లో ఆదర్శ ఉద్యానవన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రెండోసారి బుడా అధ్యక్షుడైన జేఎస్ ఆంజనేయులుకు ఏర్పాటు చేసిన ఘన సన్మానం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటించి వాటికి గ్రిల్ వేయిస్తానని, నీరు పోసి పెంచే బాధ్యత మాత్రం మీదేనన్నారు. నగరంలోని ప్రతి ప్రధాన రోడ్డు పక్కన, పార్కుల్లో, ఇంటి ముందు ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చే నెల నుంచి శ్రీకారం చుడతామన్నారు. అనంతరం పార్క్ అధ్యక్షులు కెరెకోడప్ప మాట్లాడుతూ తాను రోజూ ఉదయం వాకింగ్ చేసే ఈ పార్కును అభివృద్ధి చేయాలన్నారు. గతంలో హెచ్‌ఆర్‌జీ, మోదీ సర్కిళ్లలోని పార్కుల్లో 3 వేల మొక్కలు నాటిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పార్టీనే నమ్ముకొని సేవ అందించడంతో రెండోసారి ఈ స్థానం దక్కిందన్నారు. ఈ సందర్భంగా పార్క్‌కు వచ్చే వారందరూ ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు వివేక్(విక్కి), ముల్లంగి నందీష్, మాజీ బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, జేడీఎస్ జిల్లాధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ, కాంగ్రెస్ నాయకురాలు పద్మావతి, పదాధికారులు సురేష్‌గౌడ, నాగరాజ్, నెట్టకల్లప్ప, అల్లం కిషోర్, గోపాల్‌రెడ్డి, నారాయణప్పలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసులో నలుగురి అరెస్ట్

రాయచూరు రూరల్/యశవంతపుర: ప్రేమ విషయంలో యువకుడిపై దాడి చేసి, హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను కలబురగి పోలీసులు అరెస్ట్ చేశారు. కలబురగి నగరంలోని ప్రైవేట్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ రెండో సెమిస్టర్ చదువుతున్న అభిషేక్(18)పై దాడి చేయటంతో మంగళవారం మృతి చెందాడు. నిందితులు, మృతుడి సమీప బంధువులైన అనిల్ రాథోడ్, సంతోష్ రాథోడ్, సాగర్ జాధవ్, హేమంత్ రాథోడ్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ రామచంద్ర నాయుడు తెలిపారు. వివరాలు..కలబురగి పట్టణంలోని గంగానగరకు చెందిన అభిషేక్ ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తూ మాట్లాడుకొనేవారు. విషయం తల్లిదండ్రులకు తెలియటంతో అభిషేక్‌ను మందలించారు. అయినా అభిషేక్‌లో మార్పు రాలేదు. సోమవారం రాత్రి అభిషేక్‌ను అమ్మాయి తన ఇంటికి పిలిపించుకుంది. అప్పుడే తల్లిదండ్రుల కంటపడ్డాడు. ఆక్రోశంతో అమ్మాయి తల్లిదండ్రులు, యువకులు కర్రలు, ఇనుపరాడ్లతో ఇష్టం వచ్చినట్లు చితకబాదారు. బలమైన గాయాలైన అభిషేక్‌ను తక్షణం జిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని విచారించిన కలబురగి విశ్వవిద్యాలయం పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం కనక సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివృత్త ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. నివృత్త ఉద్యోగులు వ్యాయామ, మానసిక ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టి సమాజానికి మార్గదర్శనం చేయాలన్నారు. రూ.20 కోట్లతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇప్పటికే రూ.5 కోట్లను విడుదల చేశారన్నారు. మిగిలిన రూ.5 కోట్లను పట్టణ సమీపంలోని అమాని చెరువు అభివృద్ధికి వెచ్చిస్తారన్నారు. చెరువు కట్టపై వ్యాహ్యాళికి అనుకూలంగా రహదారిని నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం పట్టణ సమీపంలోని మదనపల్లి రోడ్డులో 5 వేల ఎకరాల పారిశ్రామికవాడను నిర్మిస్తామన్నారు. పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి. నారాయణరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు వినతి

కేజీఎఫ్: అస్తవ్యస్త విద్యుత్ సరఫరాను ఖండిస్తూ రైతుసేన కార్యకర్తలు బుధవారం బెస్కాం కార్యాలయం ముందు ధర్నా చేశారు. రైతు సేన తాలూకా అధ్యక్షుడు తొరగినదొడ్డి మంజునాథ్ మాట్లాడుతూ బెస్కాం సిబ్బంది విద్యుత్ సక్రమంగా సరఫరా చేయక పోవడం వల్ల రైతుల పంటలు ఎండుతున్నాయన్నారు. గతంలో రాత్రివేళలో 6 గంటలు విద్యుత్ సరఫరా చేసేవారు. అయితే ఇప్పుడు రాత్రివేళలో కూడా విద్యుత్ సక్రమంగా సరఫరా చేయపోవడం వల్ల రైతుల పంటలు దెబ్బ తింటున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతుల పంప్‌సెట్లకు సింగల్ ఫేస్, త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను గుర్తించి వెంటనే సరిచేయాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం బెస్కాం ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. తుమటగెరె అమరేష్, మరియప్ప, శ్రీనివాస్, మంజునాథ్, రామప్ప పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల బహిష్కారానికి తీర్మానం

- మహదాయి పోరాట సమితి యోధుల వెల్లడి



కీలక సమావేశంలో పాల్గొన్న మహదాయి పోరాట యోధులు

హుబ్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తిరిగి మహదాయి పోరాటానికి సమయం ఆసన్నమైందని రెండు జాతీయ పార్టీల నేతలకు అన్నదాతలు, పోరాట యోధులు తుది హెచ్చరిక జారీ చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు షాక్‌ను ఇవ్వడానికి రైతులు సిద్ధమయ్యారు. బుధవారం ధార్వాడ విద్యావర్ధక సంఘంలో జరిగిన చింతనమంతన సమావేశంలో ఈ ఎన్నికలను బహిష్కరించాలని మహదాయి పోరాట సమితి యోధులు ముక్త కంఠంతో ఒక నిర్ణయానికి వచ్చారు. అన్నదాతలు మహదాయి కోసం గత 40 ఏళ్లుగా నిరంతర పోరాటాలతో విసిగి పోయారు. అందువల్ల లోక్‌సభ ఎన్నికల గంట మోగేలోపే మహదాయిపై ఉన్న అన్ని అభ్యంతారాలను నివారించాలని వారు కోరుతున్నారు. జంట నగరాల ప్రజలు కూడా తమ ఎన్నికల బహిష్కార పిలుపునకు మద్దతు ఇవ్వాలని కోరారు. తాగునీటిని సరఫరా చేసే మలప్రభ నది నీటి జాక్‌వెల్‌ను బంద్ చేస్తామని హెచ్చరించారు. రెండు పార్టీల నేతలు ఎన్నికల్లోగా మహదాయి పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టాలన్నారు. లేకుంటే భారీ స్థాయిలో ఆందోళన తప్పదన్నారు. ఎన్నికల ప్రకటన వచ్చే వరకు గడువు ఇస్తున్నామన్నారు. ఒక వేళ నిర్మాణ పనులు ప్రారంభించక పోతే పోరాటం తథ్యమన్నారు. వన్యజీవి శాఖ అనుమతి తీసుకొని కూడా నిర్మాణ పనులు ప్రారంభించి దాన్ని పొందేంత వరకు ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనరాదని రైతులు ముక్తకంఠంతో తీర్మానించారు. రాజకీయ నాయకులు తమను కేవలం రాజకీయ పబ్బం కోసం వాడుకుంటున్నారని తీవ్రంగా ఆక్రోశం వెళ్లగక్కారు. హుబ్లీ ధార్వాడ నగర ప్రజలు ఎన్నికలను బహిష్కరించి తమ చివరి పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. తాము ఎవరి ఇళ్ల వద్దకు వెళ్లం, రాజకీయ నేతలే తమ వద్దకు వచ్చి చర్చించి నీటి సరఫరా చేయాలి, లేకుంటే తుది పోరాటానికి తామంతా సిద్ధమని అన్నదాతలు ఆక్రోశించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ స్టంట్

- మంత్రి సంతోష్‌లాడ్ ఆరోపణ



మాట్లాడుతున్న మంత్రి సంతోష్‌లాడ్

హుబ్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున బీజేపీ నేతలకు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, తీవ్రవాద పదాలు తప్పితే అభివృద్ధి అంశమే గుర్తుకు రాదని, ఇలాంటి అంశాలపైనే ఎన్నికలు ఎదుర్కొని లబ్ధి పొందడానికి వారు ప్రయత్నిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సంతోష్‌లాడ్ ఆరోపించారు. బుధవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలకు 5 పదాలు మినహా వేరే పదాలే తెలియవన్నారు. ఒకే విషయాన్ని ముందు పెట్టుకొని ఎన్నికలను ఎదుర్కొంటున్నారన్నారు. గత 10 ఏళ్ల నుంచి వీరిది ఇదే తంతు అన్నారు. యడియూరప్ప, శెట్టర్, బొమ్మై పాలనలో బాంబ్ బ్లాస్ట్ జరగలేదా? అని ప్రశ్నించారు. వారి పాలనలోను రాష్ట్రంలో బాంబ్ పేలుళ్లు జరిగాయన్నారు. అప్పుడు బీజేపీకి నైతికత లేదా? ఇప్పుడేమో సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అప్పుడు ప్రధాని మోదీ నైతిక బాధ్యతతో రాజీనామా చేయలేదు కదా? అని నిలదీశారు. మండ్యలో కేసరి శాలువా కప్పుకొని పాక్ తరపున నినాదాలు చేశారన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి ప్రధాని మోదీ రాజీనామా చేయాలి కదా? జగదీశ్ శెట్టర్ ఈ విషయంపై ఏమంటారన్నారు. అన్ని సమాధానాలు వారి వద్దే ఉన్నాయన్నారు. శెట్టర్ మంచి స్పీడ్‌గా ఉన్నారన్నారు. కేంద్ర నరేగ పథకం కూలీ డబ్బులను విడుదల చేయాలన్నారు, అయితే కూలీ చేసి నాలుగైదు నెలలు పూర్తయినా నిధులు విడుదల కాలేదన్నారు. రాష్ట్రానికి రూ.1400 కోట్ల నిధుల బకాయి ఉందన్నారు. కరువు నేపథ్యంలో అదనంగా మరో 50 రోజులు ఉపాధి పనులు కల్పించాలని కోరామన్నారు. అయితే ఇప్పటి వరకు కేంద్రం ఆమోదం తెలపలేదన్నారు. కరువు పరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ నయా పైసా కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు.